ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 20.07.2024 | సంపుటి : 11 సంచిక : 10 | పేజీలు : 12 వెల: రూ. 4/-

RNI NO.APTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## సంపన్న పార్టీ బీఆరెస్సే..

- ప్రాంతీయ పార్టీల ఆదాయాల్లో అగ్రస్థానం
- ఏడీఆర్ నివేదిక వెల్లడి

దిల్లీ(జనంసాక్షి): ప్రాంతీయ పార్టీల ఆదాయ, వ్యయాలపై అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ తాజా నివేదిక వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో భారత్ రాష్ట్ర సమితి కు రూ. 737.67కోట్ల ఆదాయం వచ్చినట్లు వెల్లడించింది. ప్రాంతీయ పార్టీల్లో బీఆర్ఎస్ అగ్ర



మిగతా 2లో..

8 కోట్ల ఉద్యోగాల సృష్టి..

## మరో మోసం

మోడీ ప్రకటనపై ఖర్గే మండిపాటు

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఎనిమిది కోట్ల ఉద్యోగాలు సృష్టించామన్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటనను కాంగ్రెస్

మిగతా 7లో..





## రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు

# సర్కారు నిర్ణయం

ముసాయిదా సిద్ధం • అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

- దిల్లీ, హర్యానా తరహాలో ప్రతిపాదనలు సిద్ధం చెయ్యండి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- హాజరైన ఉపముఖ్యమంత్రి సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్(జనంసాక్షి):అసెంబ్లీ సమావేశాల్లో స్కిల్‌వర్సిటీ బిల్లు పెట్టే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. దిల్లీ, హర్యానా తరహాలో రాష్ట్రంలో స్కిల్ వర్సిటీ ఏర్పాటుకు అధికారులు ముసాయిదాను సిద్ధం చేశారు. ఈ మేరకు స్కిల్ వర్సిటీపై సీఎం రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించారు. దిల్లీ, హర్యానా తరహాలో రాష్ట్రంలో స్కిల్ వర్సిటీ ఏర్పాటుకు అధికారులు ముసాయిదాను సిద్ధం చేశారు. వర్సిటీలో సర్టిఫికేషన్ కోర్సులు, డిప్లొమా కోర్సుల వివరాలు అధికారులు తెలిపారు. పూర్తి స్థాయి ముసాయిదా సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ స్కిల్ వర్సిటీ బిల్లు పెట్టే యోచనలో ప్రభుత్వం ఉంది. సచివాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అధికారులు పాల్గొన్నారు.

### అమెరికాకు సీఎం రేవంత్

ఖరారైన షెడ్యూల్ • ఆగస్టు 3 నుంచి పర్యటన

వార్త 2లో

### కార్పొరేట్లకు దీటుగా ఇక సర్కారు బడులు

- సెమీ రెసిడెన్షియల్‌గా మర్చాలని సర్కారు నిర్ణయం
- వచ్చే మూడేళ్లలో పాఠశాలల మరింత బలోపేతం
- ప్రతిపాదనలు తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి): వచ్చే మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలలను మరింత పటిష్ఠం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్

మిగతా 2లో..

# గ్రూప్-2 పరీక్షలు వాయిదా

- టీజీపీఎస్సీ అధికారిక ప్రకటన
- ఆగస్ట్ నుంచి డిసెంబర్‌కు వాయిదా
- నిర్వహణ తేదీలు త్వరలో వెల్లడి



హైదరాబాద్(జనంసాక్షి): గ్రూప్-2 పరీక్షలను తెలంగాణ సర్కార్ వాయిదా వేసింది. ఆగస్టులో నిర్వహించాల్సిన పరీక్షలను డిసెంబర్‌కు వాయిదా వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించాలని మొదట నిర్ణయించగా నిరుద్యోగుల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో పరీక్షల తేదీలను మార్చింది. డీఎస్సీ పరీక్షలు జులై 18నుంచి ఆగస్టు 5వరకు ఉండటం వెంటనే గ్రూప్-2పరీక్షలు ఉండడంతో అభ్యర్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో పలు ధర్నాల అనంతరం పరీక్షలను డిసెంబర్‌కు వాయిదా వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.డిసెంబర్‌లో నిర్వహించనున్న గ్రూప్-2 రాతపరీక్షల తేదీలను త్వరలోనే వెల్లడించనున్నారు.గ్రూప్-2 వాయిదాతో పాటు పోస్టుల సంఖ్య పెంచాలని గత నెల రోజులుగా నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. కొద్ది రోజుల క్రితం టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించి తమ నిరసన వ్యక్తం చేశారు. దీంతో పాటు ఉస్మానియా యూని వర్సిటీ, అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగులు పలు రకాలుగా నిరసనలు వ్యక్తం చేశారు. నిరసనలు, ఆందోళనల్లో పాల్గొన్న నిరుద్యోగులపై పోలీసులు ఉక్కుపాదం మోపి లాఠీలు ఝుళిపించారు.ఇటీవలే అశోక్‌నగర్‌లో అర్ధరాత్రి వేళ భారీ నిరసన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. మొత్తం 783 పోస్టుల భర్తీకి గ్రూప్-2 నోటిఫికేషన్ వెలువడింది. ఈ పోస్టులకు 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వాయిదాతో పాటు పోస్టులు కూడా పెంచాలని

మిగతా 2లో..



## రైతు రుణమాఫీతో విపక్షాలకు

# నోట్లో వెలక్కాయ

ప్రభుత్వ నిర్ణయంతో షాక్‌లో బీఆర్ఎస్, బీజేపీ నేతలు

రైతుల సూచనల మేరకే రైతు భరోసా అమలు చేస్తాం

- అతి త్వరలో పంటల బీమా పథకానికి రూపకల్పన
- ఆయిల్‌ఫామ్ సాగులో తెలంగాణ నంబర్ వన్‌గా నిలవాలి
- సమావేశంలో మంత్రులు తుమ్మల, దుద్దిళ్ల, ఉత్తమ్, పొన్నం వ్యాఖ్యలు
- కరీంనగర్‌లో రైతుల నుంచి మంత్రివర్గ ఉప సంఘం అభిప్రాయాల సేకరణ

కరీంనగర్ బ్యూరో, జులై 19 (జనంసాక్షి) : ఏకకాలంలో రైతు రుణమాఫీ అమలు చేయడంతో విపక్షాల నోట్లో వెలక్కాయ పడినట్టయ్యిందని, బీఆర్ఎస్, బీజేపీ నేతలు షాక్‌లో ఉండిపోయారని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. తమ సర్కారు నిర్ణయం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవనుందన్నారు. అదేవిధంగా తెలంగాణలోని రైతులందరి సూచనలు అభిప్రాయాలను క్రోడీకరించి రైతు భరోసాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ బైపాస్ రోడ్‌లోని వీ కన్వెన్షన్ హాల్‌లో రైతు భరోసా పథకం అమలుపై ఏర్పాటు చేసిన సమావేశంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి రైతుల

మిగతా 2లో..

### బీసీ జనగణన తర్వాతే పంచాయతీ ఎన్నికలు

నాలుగు గోడల మధ్య నిర్ణయాలు తీసుకోం

బీఆర్ఎస్ చచ్చిన పాముతో సమానం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

బీసీ జనగణన అనంతరం తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాలుగు గోడల మధ్య తాము ఏ నిర్ణయాలు తీసుకోవడం లేదని, తమది ప్రజా ప్రభుత్వమని తెలంగాణ

మిగతా 2లో..

'హైడ్రా' ఏర్పాటు చేస్తూ

# ఉత్తర్వులు

విధివిధానాలు ఖరారు చేసిన ప్రభుత్వం



హైదరాబాద్(జనంసాక్షి): ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తు నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్) విధివిధానాలను తెలంగాణ ప్రభుత్వం ఖరారు చేసింది. జీహెచ్‌ఎంసీతోపాటు ఓఆర్ఆర్ వరకు హైడ్రాకు అధికార పరిధిని అప్పగించింది. హైడ్రా ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి వ్యవహరించనున్నారు. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల మంత్రులు, సీఎస్, డీజీపీ, ప్రిన్సిపల్ సెక్రెటరీ, జీహెచ్‌ఎంసీ మేయర్ సభ్యులుగా ఉంటారు. ఈ ఏర్పాటుతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు శాఖలు ఒకే గొడుగు కిందికి రానున్నాయి.

# విండోస్‌లో సాంకేతిక సమస్య

ప్రపంచవ్యాప్తంగా నిలిచిన సేవలు

- విమానసర్వీసులపై తీవ్రప్రభావం
- అమెరికాలో 911 అత్యవసర సర్వీసుల్లోనూ నెలకొన్న ఇబ్బందులు
- వెంటనే అప్రమత్తమై సరిచేసిన మైక్రోసాఫ్ట్




న్యూయార్క్(జనంసాక్షి):మైక్రోసాఫ్ట్ విండోస్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. ప్రపంచవ్యాప్తంగా పలువురు యూజర్లకు బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్ దర్శనమిస్తోంది. ల్యాప్‌ట్యాప్/ పీసీ స్క్రీన్‌లపై ఈ ఎర్రర్ కనిపించి.. వెంటనే సిస్టమ్ షట్‌డౌన్ గానీ, రీస్టార్ట్ అయ్యింది దీంతో యూజర్లు ఎక్స్ వేదికగా ఈ సమస్యను తెలియజేస్తూ పోస్టులు పెట్టారు. భారత్ సహ అమెరికా, ఆస్ట్రేలియాలోనూ ఈ సమస్య తలెత్తాయి దీంతో ప్రభుత్వ, బ్యాంకులు తదితర సేవలకు అంతరాయం కలిగింది. మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా ప్రపంచవ్యాప్తంగా విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. విమాన సేవలు ఆలస్యం, క్యాన్సిలేషన్లకు గురయ్యా యి అమెరికాలో ఫ్రంటీయర్ ఎయిర్‌లైన్స్ సంస్థ కొన్ని విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. భారత్‌లోనూ ఇండిగో, ఆకాశ, స్పైస్‌జెట్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సేవలపై దీని ప్రభావం పడింది. మైక్రోసాఫ్ట్‌లో తలెత్తిన సాంకేతిక కారణాల అంతరాయం వల్ల బుకింగ్, చెక్-ఇన్ సేవల్లో అంతరాయం ఏర్పడొచ్చని ఆయా విమానయాన సంస్థలు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశాయి. విండోస్‌లో తలెత్తిన సాంకేతిక అంతరాయంపై మైక్రోసాఫ్ట్ స్పందించింది. మైక్రోసాఫ్ట్ 365 యాప్స్, సర్వీసుల్లో తలెత్తిన సమస్యను పరిష్కరిస్తున్నామని పోస్ట్ చేసింది. మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా అనేకసేవల్లో అంతరాయం ఏర్పడింది విమాన సర్వీసుల దగ్గరి నుంచి బ్యాంకింగ్ వరకు అనేక రంగాల్లో సమస్యలు తలెత్తాయి. భారత్‌లో అనేక దేశీయ విమానయాన సంస్థల్లో చెకిన్,

మిగతా 2లో..



భారీ వర్షాలకు తాలిపేరు ప్రాజెక్టు గేట్లు ఎత్తేయడంతో దిగువ వస్తున్న వరద నీరు

# విస్తారంగా వర్షాలు

- అల్పపీడన ప్రభావంతో పలు తెలంగాణ జిల్లాల్లో భారీగా వానలు
- వాయుగుండంతో రాష్ట్రంపై తీవ్ర ప్రభావం
- తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద.. 24 గేట్లు ఎత్తివేత
- వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న అధికారులు

హైదరాబాద్(జనంసాక్షి): తీవ్ర అల్పపీడనం వాయవ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య బంగాళాఖాతం ప్రాంతంలో వాయుగుండంగా కేంద్రీకృతమై ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాగల 24 గంటల్లో ఒడిశాలో తీరం దాటే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని పేర్కొంది. వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని, తెలంగాణపై దీని ప్రభావం ఇవాళ, రేపు ఎక్కువగా ఉంటుందని ప్రకటించింది. విస్తారంగా వర్షాలతో పాటు అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈశాన్య, తూర్పు జిల్లాలైన కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో శుక్రవారం అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, ఖమ్మం, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. శనివారం ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురవొచ్చు. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి

మిగతా 2లో..



2లో

### పోటెత్తిన పెద్దవాగు

- వరద ఉధృతికి కొట్టుకుపోయిన పశువులు
- కొండలు, గుట్టలపై తలదాచుకున్న ప్రజలు
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి
- చర్ల వద్ద తాపేరుకు వరద ఉధృతి
- అధికారులను అప్రమత్తం చేసిన ప్రభుత్వం



బిల్కిస్ బానో కేసులో

# దోషులకు షాక్

బెయిల్ పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ(జనంసాక్షి):బిల్కిస్ బానో కేసులో ఇద్దరు దోషుల పిటిషన్‌ను సుప్రీం కొట్టివేసింది. రెమిషన్ వచ్చే వరకు తమకు బెయిల్ మంజూరుచేయాల్సిందిగా దోషులు సుప్రీంను ఆశ్రయించారు. కాగా అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం ఈ పిటిషన్‌ను నిరాకరించింది. న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం దీనిని పూర్తిగా తప్పుడు పిటిషన్‌గా పేర్కొంది. కోర్టులోని ఒక బెంచ్ జారీ చేసిన ఆర్డర్‌పై మరొక బెంచ్ ఎలా అప్పీల్ చేస్తారని ప్రశ్నించింది. కాగా దోషులు రాధేశ్యామ్ భగవాన్‌దాస్ షా, రాజుభాయ్ బాబూలాల్ సోనీ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి కోరగా దానికి బెంచ్ అనుమతించింది. షా మధ్యంతర బెయిల్ కోసం కూడా దరఖాస్తు చేసుకున్నారు. 2002లో గోద్రా రైలు దహనకాండ అనంతరం గుజరాత్‌లో పెద్దఎత్తున చోటుచేసుకున్న మతపరమైన అల్లర్లలో బిల్కిస్ బానో కుటుంబానికి చెందిన ఏడుగురు సభ్యులు హత్యకు గురయ్యారు. 5 నెలల గర్భిణిగా ఉన్న బానోపై దుండగులు సామూహిక

మిగతా 2లో..

## విధివిధానాలతో మాయ చేశారు : భారాస



హైదరాబాద్(జనంసాక్షి):అర్హులైన లబ్ధిదారులు రుణమాఫీ కాక అంతులేని ఆందోళనలో ఉంటే ఎందుకీ సంబరాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రశ్నించారు. రుణమాఫీ అయిన రైతన్నల కన్నా కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువని ఆయన విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు.ఊరించి ఏడు నెలలు ఏమార్చి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ తీరు చూస్తే 'చారాణా కోడికి బారాణా మసాలా' అన్నట్లు ఉందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. రుణమాఫీ ప్రక్రియపై 'ఎక్స్'

మిగతా 2లో..

# కమలాహ్యారిస్ వైపే మొగ్గు..

అందరి చూపు ఆమె వైపే.. • బైడెన్ పట్ల డెమాక్రట్లలో అసహనం

అభ్యర్థిత్వం మార్చాలన్న డిమాండ్ • తప్పకుంటేనే మంచిదన్న ఒబామా



వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికా అధ్యక్ష ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి.. ఓ వైపు దాడి తర్వాత మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో దూకుడుతో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.. మరోవైపు ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ కూడా ప్రచారాన్ని నిర్వహిస్తున్నప్పటికీ.. డెమోక్రాట్లలో ఆయన ఆరోగ్య పరిస్థితి పార్టీలో టెన్షన్ పుట్టిస్తోంది.. ఇలా అమెరికా అధ్యక్ష ఎన్నికల వేళ అధికార డెమోక్రాటిక్ పార్టీలో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రస్తుత అధ్యక్షుడు, డెమోక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి జో బైడెన్ తీరు, వ్యవహార శైలి పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ.. ఆయనను

మిగతా 2లో..

# వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం

- గిట్టుబాటు ధరలు కూడా కల్పించని కెసిఆర్
- రైతులకు రుణామాఫీ ఏకకాలంలో చేసిన ఘనత మాదే
- రాష్ట్రంలో ఆయిల్ పామ్‌కు మంచి అవకాశాలు
- జిల్లా పర్యటనలో మంత్రులు తుమ్మల, పొన్నం, శ్రీధర్ బాబు




**పెద్దపల్లి, జూలై19 (జనంసాక్షి) :** గత ప్రభుత్వం రైతులకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గిట్టుబాటు ధర కూడా కల్పించలేదని మండిపడ్డారు. రైతులు కాలర్ ఎగరేసుకున్న రోజు రావాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పెద్దపల్లిలో పర్యటించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు తదితరులు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు ఆర్థికంగా బలపడతారని అన్నారు. భారతదేశంలో అత్యధికంగా ఆయిల్ ఫామ్ సాగు చేసే రాష్ట్రాల్లో తెలుగు రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని వివరించారు. ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. దేశంలోనే మొదటిసారి రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసింది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశంసించారు. రైతు రుణమాఫీ చేయడానికి నాయకత్వం వహించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు. భారత దేశ చరిత్రలో మే 6 వ తేది 2022 లో ఇచ్చిన హామీని రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో అనంతరం రెడ్డి పంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన రైతుల సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రసంగించారు. ఇది కలనా నిజమా అని రైతులు అనుకుంటున్నారని, గత ప్రభుత్వం లక్ష రూపాయలు రుణమాఫీని నాలుగు, ఐదు విడుతలలో చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష రూపాయలు రుణమాఫీ ఒకసారి తరువాత లక్ష 50 వేలు, తరువాత 2 లక్షల రుణమాఫీ ఒకేసారి జరుగుతుందన్నారు. ఆయిల్ ఫామ్ కు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఉన్న అన్ని ఖర్చులూ పొగ లక్షల్లో ఆదాయం వస్తుందని, ఆయిల్ ఫామ్ లో అంతర పంటలు వేసుకోవచ్చని సూచించారు. 2 లక్షల 103 మెట్రిక్ టన్నుల ఆయిల్ మార్కెట్ జరుగుతుంటే బయటి దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నామని, రాష్ట్రంలో 2 లక్షల ఎకరాల పైన ఆయిల్ ఫాం పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, పెద్దపల్లి జిల్లాలో 45 వేల ఎకరాల్లో ఆయిల్ ఫాం పెట్టడానికి ఇక్కడ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్త బస్సులకు పెద్ద ఎత్తున డిమాండ్స్ వస్తున్నాయని, చాలా చోట్ల కొత్త బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, రేవంత్ రెడ్డి నాయకత్వంలోమూడు వేలకు పైగా నియామకాలకు ఆదేశాలు జారీ చేశామని, ఇప్పటికే వెయ్యికి పైగా బస్సులు కొనుగోలు చేశామని, మరో 1500 బస్సులు కొనుగోలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆర్థిక పరిపుష్టి శక్తి రైతన్న దగ్గరే ఉందని, రైతన్నలకు ఆర్థిక శక్తిగా ఎదగాలని, డిసెంబర్ 3 న గెలిచామని, 7 న మంత్రిగా ప్రమాణం చేశానని, 9న ఆర్టీసిలో మహిళలకు ఉచిత బస్సు అందించామని మంత్రి పొన్నం వివరించారు. ఇప్పటి వరకు 62 కోట్ల మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేశారని, 2100 కోట్లకు పైగా ఆర్టిసికి ప్రభుత్వం చెల్లించిందని, మహాలక్ష్మి పథకంతో ఆర్టిసి నష్టాలు లేకుండా నడుస్తుందని, పెద్దపల్లిలో ఆర్టిసి బస్సు డిపో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గోదావరి ఖని బస్సు స్టాండ్ రూపురేఖలు మారుస్తామని, ఆర్టిసి ఉద్యోగులకు పిఆర్సి ఇచ్చామని, 2013 నాటి పెండింగ్ బాండ్లు చెల్లించామన్నారు. రైతును రాజుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. చెప్పిందే చేస్తాము చేసేదే చెబుతామనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మొదటి విడతలో లక్ష రూపాయల లోపు రుణమాఫీ చేశామని తెలిపారు. దయ్యాలు వేదాలు వల్లించినట్లు బీఆర్ఎస్ నాయకుల మాటలు ఉన్నాయని విమర్శించారు. రైతు ఆదాయం పెరగడానికి ఆయిల్ ఫామ్ సాగు తోడ్పడుతుందని అన్నారు. రూ.170 కోట్ల వ్యయంతో పెద్దరాత్ పల్లిలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 250 మందికి ప్రతేక్షంగా 500మందికి పరోక్షంగా ఉపాధి పొందుతారని అన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మించి టేలండ్ ప్రాంత రైతులకు నీరు అందిస్తామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

## రేవంత్ చిత్రపటానికి ఎమ్మెల్యే పాలాభిషేకం

- ఏకమొత్తంగా లక్ష రుణమాఫీ ఆనందదాయకం

**హైదరాబాద్, జూలై19 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఒకేసారి రూ. లక్ష రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇస్తే మాట కట్టుబడి ఉంటుందని.. గత ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తూ ఆ పార్టీ నాయకులకే ఇచ్చేవారని అన్నారు. అనంతరం కాంగ్రెస్ యూత్ నాయకుడు సంతోష్ యాదవ్ తలపెట్టిన స్కూల్ విద్యార్థులకు బుక్స్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బోయిన్ పల్లి కూరగాయల మార్కెట్, రెజిమెంటల్ బజార్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారులపై స్థానికుల దాడి

- బకాయిలు అడిగనందుకు ఆగ్రహం



**హైదరాబాద్, జూలై 19 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగర పరిధిలోని మోతీనగర్‌లో విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్, మీటర్ రీడర్ పై స్థానికులు దాడి చేశారు. శుక్రవారం మోతీనగర్ లో పెండింగ్ బిల్లులు వసూలు చేసేందుకు లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, మీటర్ రీడర్ వెళ్లారు. పెండింగ్ కరెంట్ బిల్లులు చెల్లించాలని స్థానికులను కోరారు. కరెంట్ బిల్లు చెల్లించకపోతే విద్యుత్ సప్లయ్ నిలిపివేస్తామని చెప్పడం.. లైన్ ఇన్ స్పెక్టర్, మీటర్ కు స్థానికులకు మధ్య వాగ్వాదం జరిగింది. లైన్ ఇన్ స్పెక్టర్ శ్రీకాంత్, మీటర్ రీడర్ సాయిపై స్థానికుడు రాములు, అతని కుమారుడు దాడి చేశారు. ఈ దాడిలో విద్యుత్ అధికారి శ్రీకాంత్ కు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు సనత్ నగర్ పోలీస్ స్టేషన్లలో రాములు, అతని కుమారుడిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఒకేసారి రుణమాఫీ హామీ ఏమయ్యింది

- రైతుల్లో ఆందోళన మిగిల్చిన కాంగ్రెస్
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి




**హైదరాబాద్, జూలై 19 (జనంసాక్షి) :** రైతులకు కేసీఆర్ ఆనందాన్నిస్తే.. కాంగ్రెస్ ఆందోళన మిగిల్చిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని విమర్శించారు. ఒకేసారి రుణమాఫీ చేస్తామన్నా హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతుల రుణమాఫీ కోసం రూ.6 వేల కోట్లు మాత్రమే విడుదల చేశారన్నారు. రైతులకు కాంగ్రెస్ చేసింది గోరంత.. కొండంతలుగా గొప్పలు చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు వివేకానంద, కోవాలక్ష్మితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో మొదటి విడుతలో 35 లక్షల మంది రైతులకు రూ.17 వేల కోట్లు చెల్లించామన్నారు. ఆంక్షల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల రుణమాఫీని కొందరికే పరిమితం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయన్నారు. రైతుభరోసా కింద రైతులకు వెంటనే పెట్టుబడిసాయం అందించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. కాంగ్రెస్ నేతల సంబురాల్లో సిద్దిపేట కలెక్టర్ పాల్గొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. వ్యవసాయాన్ని పండుగ చేసింది కేసీఆర్ మాత్రమేనని వెల్లడించారు. రైతుబంధు కింద కేసీఆర్ రూ.70 వేల కోట్లు ఇచ్చారని గుర్తుచేశారు. 3 కోట్ల టన్నుల ధాన్యాన్ని కేసీఆర్ హయాంలో రైతులు పండించారని తెలిపారు. రైతులకు కేసీఆర్ ఆనందాన్నిస్తే.. కాంగ్రెస్ ఆందోళన మిగిల్చిందని విమర్శించారు. కేసీఆర్ కట్టించిన రైతు వేదికల్లో కాంగ్రెస్ సంబురాలు చేసిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులకు బూతులు తప్ప రైతులపై శ్రద్ధలేదని విమర్శించారు. సీఎం హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి అబద్దాలు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే వివేకానంద విమర్శించారు. ప్రజల గుండెల్లో కేసీఆర్ ఉన్నారని చెప్పారు. కేసీఆర్ ఏం చేశారో రైతులకు తెలుసని వెల్లడించారు. కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. రైతు భరోసా ఎందుకు ఇవ్వడం లేదని ఎమ్మెల్యే కోవాలక్ష్మి ప్రశ్నించారు. ఎమ్మెల్యేలుగా గెలిచిన తర్వాత ప్రభుత్వం నుంచి అభివృద్ధికి ఒక్క పైసా రాలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సీఎంలా వ్యవహరించాలి తప్ప.. పీసీసీ అధ్యక్షుడిగా కాదన్నారు. కేసీఆర్ హయాంలో అందరు ఎమ్మెల్యేలను ఒకేలా చూశారని గుర్తుచేశారు.

# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలల ఏర్పాటు

- భూముల గుర్తింపు, మౌలిక సదుపాయాల కోసం కార్యాచరణ
- అధికారులతో సమీక్షించిన సిఎస్ శాంతికుమారి



**హైదరాబాద్, జూలై 19 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలల ఏర్పాటు కోసం భూముల గుర్తింపు, ఇతర మౌలిక సదుపాయాల కోసం తీసుకోవాల్సిన చర్యలపై సీఎం శాంతి కుమారి శుక్రవారం సచివాలయంలో వివిధ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పాఠశాలల్లో విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు, తల్లిదండ్రులు తమ పిల్లలను కలవడానికి ప్రత్యేక గది ఉండేలా చూడాలని.. భవనాలన్నింటికీ ఏకరీతి డిజైన్‌ను వారంలోగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రభుత్వ సలహాదారుతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఈ ప్రాజెక్ట్‌కి నోడల్ ఆఫీసర్‌గా, ఇతర సంక్షేమ శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారన్నారు. 49 రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలలకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, అందులో ఎనిమిది పాఠశాలలు ఈ ఏడాది గ్రౌండింగ్‌కు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. 31 రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలలకు ఇప్పటికే జిల్లా కలెక్టర్లు భూమిని గుర్తించగా, మిగిలిన పది పాఠశాలలకు సంబంధించి భూమి గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. భూముల గుర్తింపు, ఇతర మౌలిక సదుపాయాల కోసం తీసుకోవలసిన చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి దార్శనికత మేరకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పాఠశాలల్లో విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు, తల్లిదండ్రులు తమ పిల్లలను కలవడానికి ప్రత్యేక గది మొదలైనవి ఉండాలని, ఈ భవనాలన్నింటికీ ఏకరీతి డిజైన్‌ను వారంలోగా సిద్ధం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రభుత్వ సలహాదారుతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఈ ప్రాజెక్ట్‌కి నోడల్ ఆఫీసర్‌గా, ఇతర సంక్షేమ శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. 49 రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలలకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, అందులో ఎనిమిది పాఠశాలలు ఈ ఏడాది గ్రౌండింగ్‌కు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. 31 రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలలకు ఇప్పటికే జిల్లా కలెక్టర్లు భూమిని గుర్తించగా, మిగిలిన 10 పాఠశాలలకు సంబంధించి భూమి గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస్ రాజు, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి అలుగు వర్షిణి, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## లష్కర్ బోనాలకు సిఎం రేవంత్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, జూలై 19 (జనంసాక్షి) :** సికింద్రాబాద్ మహంకాళి బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని సిఎం రేవంత్ రెడ్డిని కమిటీ కోరింది. ఈమేరకు సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సికింద్రాబాద్ మహంకాళి బోనాల ఉత్సవాలకు ఆహ్వానించింది. ఆలయ అర్చకులు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, సిఎంను కలిసిన వారిలో ఉన్నారు.



డ్రగ్స్ ను తరిమేద్దాం.. అంటూ.. సీనియర్ జర్నలిస్ట్ ఏ.కొండల్ గౌడ్ పాడిన పాట.. పోస్టర్ ను ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి. సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ ప్రభుత్వ పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కోడూరు శ్రీనివాస్ రావు.

– హైదరాబాద్, జూలై 19 (జనంసాక్షి)

# ప్రమాదాలు జరుగకుండా చూడాలి!

**(ప్రత్యేక ప్రతినిధి / జనంసాక్షి) :** తరచూ జరుగుతున్న సింగరేణి ప్రమాదాలపై విచారణ జరిపించి బాధ్యులైన అధికారుల పైన చర్యలు తీసుకోవాలని కొత్త కాపు లక్ష్మారెడ్డి బొగ్గు పరిశ్రమల ఇంచార్జ్, సేఫ్టీ ఆన్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ డిమాండ్ చేశారు. సింగరేణి పరిశ్రమలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్ గారిని హైదరాబాదులో కొత్త కాపు లక్ష్మారెడ్డి నేతృత్వంలో బిఎమ్మెస్ పదాధికారులతో కలిసి మాట్లాడుతూ దేశవ్యాప్త బొగ్గు గని కార్మికుల ప్రమాదాల నివారణకు నిర్మూలనకు సేఫ్టీ అన్యువల్ ట్రైపార్టైడ్, సేఫ్టీ బైపార్టైడ్ సమావేశాలలో జాతీయ అంతర్జాతీయ ప్రమాణాలు కొనసాగించాలని నియమ నిబంధనలు ఉన్నప్పటికీ సింగరేణి అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు నిర్లక్ష్యంతో నిబద్ధతలేని విధులు నిర్వహించి అనేక మంది కార్మికుల ప్రాణాలు బలిగొంటున్న సింగరేణి అధికార యంత్రాంగం, భూగర్భ గనులలో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులలో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లు, కోల్ స్క్రీనింగ్ ప్లాంట్లులలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల పని స్థలాలను ముందుగా పర్యవేక్షించిన అనంతరం సురక్షితంగా విధులు నిర్వహించుటకు సరైన వెంటిలేషన్ సురక్షితమైన పని స్థలాలు కల్పించాలని మైనింగ్ స్టాఫ్ సోదరులకు ఏరియా ఫిక్స్ వేషన్ నిర్ణయించాలని లేనిపక్షంలో పర్యవేక్షణ లోపం జరుగుతుందని అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని అభిప్రాయాన్ని వ్యక్తం చేసినారు, రక్షణ విభాగం పూర్తిస్థాయి వైఫల్యంతో ఓసీపీ టూ లో జరిగిన ప్రమాదంలో వెంకటేశ్వర్లు పిట్టర్, జి. విద్య సాగర్ జనరల్ మజ్దూర్ కార్మికులు గని ప్రమాదంలో రక్షణ విభాగం వైఫల్యంతో చనిపోయినారని విచారణ జరిపించి బాధ్యులైన అధికారుల పైన చర్యలు తీసుకోవాలని సూచించినారు, ప్రమాదాల నివారణకు, నిర్మూలనకు జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలు కొనసాగించాలని సూచించినారు. జాతీయ కార్మిక సంఘాల ప్రతినిధులకు సింగరేణి రక్షణ కమిటీలలో ప్రాతినిధ్యం కల్పించాలని సూచించినారు 5వ, 10వ ఆన్యువల్ సేఫ్టీ ట్రైపార్టైడ్ నిబంధనలను సింగరేణిలో తక్షణమే అమలుపరచుటకు చర్యలు తీసుకోవాలని సూచించినారు, అనంతరం నూతన కమిటీని చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కి పరిచయం చేసినారులి 3.2023-24 ఆర్థిక సంవత్సరానికి సంస్థ సాధించిన వాస్తవ లాభాలపైన 40 శాతం బాట జాప్యం లేకుండా కార్మికులకు పంపిణీ చేయాలని సుదీర్ఘమైన చర్చల ద్వారా సింగరేణి అంశాలను చర్చించారు. పాల్గొన్న సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య, అప్పాని శ్రీనివాస్ వర్కింగ్ ప్రెసిడెంట్, యతిపతి సారంగపాణి ప్రధాన కార్యదర్శి, పొన్నమనేని వేణుగోపాలరావు ఉప ప్రధాన కార్యదర్శి, శ్రీరంగ పవన్ కుమార్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.



# చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు..

**నూగూర్ వెంకటాపురం జూలై 19(జనం సాక్షి ):** ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని అలుబాక పంచాయతీ, తానిపర్తి గ్రామం లో చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతైనా ఘటన వెంకటాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది.గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం అలుబాక పంచాయతీ పరిధిలో ని తానిపర్తి గ్రామానికి చెందిన బానారి రాజు(40)తండ్రి ముత్తయ్య కూలి పని చేస్తు జీవనం సాగిస్తున్నారు.గురువారం సాయంత్రం బానారి రాజు తన స్నేహితులతో కలిసి అలుబాక కొండాపురం వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి రాలేదు.. తన స్నేహితులతో మీరు వెళ్ళండి నేను తర్వాత వస్తాను అని అన్నాడు. రెండు మూడు గంటల తర్వాత బానారి రాజు ఇంటికి రాలేదు. తోటి మిత్రులు కుటుంబ సభ్యులు గ్రామస్థులు గాలింపు చర్యలు చేపట్టిన రాజు ఆచూకీ తెలియలేదు ,బానారి రాజు కుమారుడు బానారి సాయిరాం వెంకటాపురం స్టేషన్ లో సమాచారం తెలపగ వెంకటాపురం ఎస్సై కె తిరుపతి రావు పడవ సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. బానారి రాజు కోసం వెతికిన ఆచూకీ లభించ లేదు,పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.కేసు నమోదు చేసి దర్యాప్తు



## గోదావరిలో వరద ఉధృతి

**కోనసీమ, జూలై19(జనంసాక్షి) :** నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కోటిపల్లి రేవులో ప్రయాణాలు నిలిపివేశారు. గౌతమి గోదావరి నది లోను వరద ప్రవాహం పెరగడంతో ముందు జాగ్రత్త చర్యగా మండల అధికారులు రేవు ప్రయాణా లను నిలిపివేశారు. దీనివల్ల కోటిపల్లి నుండి అమలా పురం వెళ్లే వారు యానం వారధి మీదుగా ప్రయా ణాలు కొనసాగించాలని అధికారులు సూచించారు. కోటిపల్లి రేవులో పంటి రాకపోకలు 19 శుక్రవారం నుండి వరద కారణంగా నిలిపివేసినట్లు వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత ప్రయాణాలు తిరిగి పునరుద్ధరిస్తామని ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి కోటిపల్లి రేవులో ప్రయాణాలు విరమించుకోవాలని వారు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

# ఈ జీవన చదరంగం వ్యూహాలు

**ప్రతి కదలిక ఒక వ్యూహం, ప్రతి చర్య ఒక యుద్ధం, మనసులోని నైపుణ్యాలను, మెదడులోని ఆలోచన, కలగలిపే ఒక అద్భుతమైన ఆట చదరంగం. బలమైన రాజులతో, రానులతో, గుర్రాలతో, ఏనుగులతో, పాదాతులతో, రథాలతోతో చదరంగం ఒక యుద్ధ భూమి. రాజుల యుద్ధం రానుల సంరక్షణ మంత్రుల మంతనాలు, గుర్రాల పరుగులు ఏనుగుల దూకుడు వంటల బర్తడే పాదాతుల పోరాటం చదరంగం ఆటలో చాకచక్యాలు ఎన్నో. ఆలోచనల పోరాటం మేధస్సుల పరీక్ష ప్రతి కదలిక ఒక కథ చెప్తుంది ఒక అనుభవాన్ని నేర్పిస్తుంది ఒక నైపుణ్యాన్ని పెంచుతుంది. విజయం వచ్చిన ఓటమి ఎదురైనా స్పోర్ట్స్ మాన్ స్పిరిట్ తో ఆడాలి.**



చదరంగం ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన బోర్డు ఆటలలో ఒకటి, ఇది శతాబ్దాలుగా మానవులను మంత్రముగ్ధులను చేసింది. ఈ వ్యూహాత్మక పోరాటంలో, ఇద్దరు ఆటగాళ్ళు 8x8 చదరంగపు బోర్డుపై 16 చక్రాలతో ఒకరినొకరుఎదుర్కొంటారు. లక్ష్యం చాలా సులభం: ప్రత్యర్థి రాజును చెక్‌మేట్ చేయడం, అంటే దాడి నుండి తప్పించుకోలేని ప్రమాదకరమైన పరిస్థితిలో ఉంచడం. చదరంగం యొక్క మూలాలు భారతదేశంలో 6వ శతాబ్దంలో ఆరంభమైనాయని నమ్ముతారు. అక్కడ నుండి, ఇది పర్షియా, అరబ్ ప్రపంచం మరియు చివరికి ఐరోపాకు వ్యాపించింది. శతాబ్దాల ద్వారా, ఆట నియమాలు, వ్యూహాలు క్రమంగా అభివృద్ధి చెందాయి, నేటికీ ఆడే ఆధునిక ఆటకు దారితీసింది. 1924లో అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్ స్థాపించారు. ఇదే సంవత్సరం జూలై 20న ఏకగ్రీవంగా అంతర్జాతీయ చదరంగ దినోత్సవము జరుపుకోవటం జరిగింది. యునెస్కో ఆలోచన ప్రకారం 1966 నుండి ప్రతి సంవత్సరం జులై 20న అంతర్జాతీయ చెస్ దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా 181 చెస్ సమఖ్యలు ఉన్నాయి. ప్రెసిడెంట్ కిర్సాన్ అల్యూమీజీ నోవ్ ప్రకారం 2013 వ సంవత్సరంలో అంతర్జాతీయంగా 178 దేశాలు చెస్ దినోత్సవం అని జరుపుకున్నాయి. 2019లో ఐక్యరాజ్యసమితి సాధారణ సభ చెస్ దినోత్సవాన్ని గుర్తించి తీర్మానాన్ని చేశాయి. చదరంగం నియమాలు సాపేక్షంగా సరళమైనవి, కానీ ఆటలో నైపుణ్యం సాధించడానికి జీవితకాల అధ్యయనం అవసరం. ప్రతి ఆటగాడు రాజు, రాణి, రెండు రాక్‌లు, రెండు నైట్‌లు, రెండు బిషప్‌లు మరియు ఎనిమిది పాదచారులతో ప్రారంభిస్తాడు. ఆటగాళ్ళు ప్రత్యామ్నాయంగా తమ ముక్కలను బోర్డు చుట్టూ తరలించడం ద్వారా తిరుగుతారు, వారి ప్రత్యర్థి ముక్కలను తీసుకోవ డానికి లేదా వారి రాజును రక్షించడానికి వ్యూహరచనలు చేస్తారు. ముక్కలు వివిధ మార్గాల్లో కదులుతాయి, ప్రతి ఒక్కటి దాని స్వంత ప్రత్యేకమైన కదలిక నమూనాను కలిగి ఉంటుంది.

జనంసాక్షి

చదరంగం కేవలం ముక్కలను కదలించడం కంటే చాలా ఎక్కువ. విజయం సాధించడానికి, ఆటగాళ్ళు ముందు చూడటం, వారి ప్రత్యర్థి ప్రణాళికలను అంచనా వేయడం మరియు వారి స్వంత వ్యూహాలను రూపొందించడం నేర్చుకోవాలి. సాధారణ చదరంగ వ్యూహాలలో కేంద్రాన్ని నియంత్రించడం, మీ ముక్కలను అభివృద్ధి చేయడం, రాజును రక్షించడం మరియు ప్రత్యర్థి బలహీనతలను దాడి చేయడం వంటివి ఉన్నాయి. చదరంగం ఆడటం వల్ల మెదడుకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని తేలింది. ఇది సమస్య పరిష్కార నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచన మరియు ఏకాగ్రతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. చదరంగం ఒక వ్యూహాత్మక బోర్డు ఆట, ఇది ఇద్దరు ఆటగాళ్ల మధ్య ఆడపడుతుంది. ఇది ప్రపంచంలో అత్యంత ప్రజాదారణ పొందిన ఆటల్లో ఒకటి, దీనికి సుమారు 500 మిలియన్ల మంది ఆటగాళ్లు ఉన్నారని అంచనా. చదరంగం మాట వల్ల ఏకాగ్రత పెరుగుతుంది ఆటగాళ్లు ఆలోచన శక్తి నైపుణ్యాలు పెరుగుతాయి మెరుగైన జ్ఞాపకశక్తి ఉంటుంది. ఈ చదరంగం ఆట ద్వారా జీవిత పాఠాలు నేర్చుకోవచ్చు. అందరం కలిసి చేస్తాడు దాం మన మెదడులను పదును పెట్టుకుం దాం. ప్రపంచ శ్రేష్ఠ దినోత్సవం జరుపు కుందాం చెస్ ఆటను ప్రోత్సహించుకుందాం.

**(జులై 20 అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా)**



**పూసపాటి వేదాద్రి**
కవి, సాహితీ విశ్లేషకులు
9912197694

# ఆ పండు చెట్టు ఎవరిది? ఎక్కడిది?

***ఆ జామపండు, ఆ మామిడి, ఆ సీ తాఫలం, ఆ యాపిల్, పండించిన వారు, పండించిన తోట యజమాని,తోటకు అక్కడ కావాలి కాసింది, పండు తెంచింది, లారీ లో లోడ్ చేసింది, ట్రాన్స్పోర్ట్ చేసిన లారీ యజమాని, డ్రైవర్, మార్కెట్ లో అన్లోడ్ చేసిన కూలి, వాటిని కొనుగోలు చేసి, అమ్మే గోడౌన్ యజమాని, చివరికి తోపుడు బండి లో తిరిగి, ఒక చోట కూర్చుని అమ్మే వారి టేలా పేరు, దుకాణం పేరు, కంపెనీ పేరు మనకు అవసరమా? వారి కులం, మతం తో మనకు ఏం పని! మనకు ఇవన్నీ ఇప్పుడు గుర్తు చేస్తున్నారు, మతోన్మాదులు!***






**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

పండ్లను అమ్మే కంపెనీ, లేదా షాప్, తోపుడు బండి పేరు వద్దట అమ్మే అతని ఒరిజినల్ పేరు అది తోపుడు బండి అయినా, కిరాయి బండి అయినా, కేవలం అమ్మడమే బాధ్యత గా అక్కడ కూలి పని లో ఉన్నా, ఆ అమ్మే వాడి పేరు పెట్టాలాట, రాయాలట! ఉత్తర్ ప్రదేశ్‌లోని ముజఫ్ఫర్ నగర్‌లో పోలీసుల ఆదేశమిది! పండ్ల దుకాణాలు, టేలాలు సహజంగానే అక్కడ ఏ నాసర్, అహ్మద్ లవే ఎక్కువ ఉంటాయి. వారు ఒక కార్డు బోర్డు మీద పేర్లు రాసి మరీ పెట్టుకున్నారు. మరో వైపు కొందరు రాజేష్,సంతు లు కూడ పెట్టుకున్నారు. కొనుగోలు చేసే చోట వినియోగ దారుల్లో తేడా సృష్టించే పని ఇది! ఇదేమి పని అని పోలీస్ అధికారులను అడిగితే శ్రావణ్ కావడి యాత్ర ఉంటుంది, దాదాపు 240 కిలోమీటర్ల ప్రభావం అందుకే ఇలా అంటూ విషయాన్ని అసంపూర్తిగా వదిలేస్తారు. చిన్న చిన్న టేలాలు, పండ్ల, కూరగాయల దుకాణాలు బలహీనుడి జీవన ఆధారం గా ఉంటుంది. ఇలాంటి వారితో అసలు ఇబ్బందులు ఏమి ఉంటాయి?ఇది కేవలం ఒక సామాజిక వర్గం ఆర్థిక జీవన పరిస్థితులను దెబ్బ తీసే అతి పెద్ద కుట్ర, ఇదో సామాజికమైన ఆపద అని యూపీ సీఎం అఖిలేష్ యాదవ్ పేర్కొన్నారు.

ఓనర్ల పేర్ల డిస్‌ప్లే ఎందుకు?

ఒక టీ స్టాల్‌కు వకీల్ అహ్మద్ టీ స్టాల్ అని రాసి ఉంటుంది. మరోచోట లక్ష్మణ్ టీ స్టాల్ అని ఉంటుంది. దాని ఓనర్ పేరు దేనికి? పండించే పంట ఎందరి, ఎన్ని కుల, మతాల వ్యక్తుల చేతులు మారుతుంది. ఎవరెవరు ఏమిటి? ఎవరి పేరు, ఏమిటి అని ఎంక్వయిరీ చేస్తమా! పశ్చిమ బెంగాల్ లో రెండు రోజుల క్రితం బీజేపీ నేత సుబెన్దు అధికారి మాట్లాడుతూ సబ్కా సాత్, సబ్కా వికాస్ పక్కన పడేయండి,జో హమారా సాత్, హమ్ ఉస్కె సాత్, అని అంటాడు, ఇలా బీజేపీ నేత ఇంత ఓపెన్గా మాట్లాడడంను ఏమని అర్థం చేసుకోవాలి. పార్లమెంట్ లో ఒక సమాజిక వర్గంకు వ్యతిరేకం గా పీఎం నరేంద్ర మోడీ స్వయంగా ప్రచారం చేస్తారు, తాళిబొట్టు లు లాక్కుంటారు, బర్రె లు తీసుకెళ్లుతారు, ముజ్రా, మట్టన్ లాంటి ప్రచారాలు చేస్తారు. విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా జొర్రుబాటు దారులు అంటూ, బట్టలను చూసి వారిని గుర్తుప ట్టొచ్చు అంటారు. ఒకరు గోలి మారో సాలోంకు అంటారు. రాజ్యాంగం ఇచ్చిన జీవించే హక్కును ఇప్పుడు, విభజన రాజకీయాలు చేసి, దుకాణాలకు, టేలాలకు, పండ్ల దుకాణాలకు సైతం యజమానుల పేర్లు ఓపెన్గా డిస్ప్లే చేసి దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు.

జనంసాక్షి

**50 శాతం మందికి 6 వేలు దాటని సంపాదన!**

50 శాతం మంది భారతదేశం లో నెలకు 6 వేలు సంపాదించే పరిస్థితి లో లేరు. ఇంకా కులం పేరు చూసి పని చేసే వారి ప్లేట్ లను కూడ వేరు పెట్టే యజమానులు ఉన్న పరిస్థితి ఉన్నది.చిన్న చిన్న షాపులు పెట్టుకుని జీవిస్తున్న వారి నుంచి, వారిని పేర్ల ద్వారా గుర్తించడానికి ఆధార్ కార్డులు అడుగుతున్న పరిస్థితి.నిజానికి మాంసం శాఖాహారులు తినరు, తినగూడని రోజుల్లో ముట్టరు, మాంసాహారం తినేవాళ్లు తింటారు. దీనికి ప్రత్యేక హోటల్స్ ఉంటాయి. అయినా ఏదో ఒక నెపం తో ఇదే బిజినెస్ మీద బతికే వారిని దుకాణం బంద్ పెట్టాలని ఆదేశాలు ఇస్తారు. వ్రతాలు చేసే వారు ఎలాగూ తినరు, మరి తినేటోడిని ఆపడం, అమ్మేటో డి మీద ఆంక్షలు పెట్టి కడుపుకొట్టడం ఆర్థికంగా వారిని దెబ్బతీయడం కాదా? పార్లమెంట్ ఎన్నికల్లో ఒక సామాజికవర్గం తమకు ఓటు వేయలేదనే కోపం తో మతోన్మాదులు విచ్చలవిడిగా వ్యవహారం చేస్తున్నారు.

**ఒక్కరినే టార్గెట్ చేస్తూ...**

ఒక సామాజిక వర్గం ను టార్గెట్ చేసి విద్వేషం రెచ్చగొట్టే కుట్రలు చేస్తున్నారు, ముజఫ్ఫర్ పూర్ లో పోలీస్ చర్యలు, బెంగాల్ లో సబెన్దు అధికారి మాటలు చాలా విషయంలను దేశం ముందు ఉంచుతున్నాయి. రాజకీయాలు ఇంత దిగజారి పోవడం, గత పది ఏండ్ల నుంచి చూస్తున్న జనం పార్లమెంట్ ఎన్నికల్లో అయోధ్య లో ఓడగొట్టారు. అటు అసెంబ్లీ ఉపఎన్నికల్లో 11 చోట్ల ఓడగొట్టారు. ఇంత చూసి, అనుభవాలను గుణపాఠం గా తీసుకోకుండా, సకల జనులు ఈసడించుకునే చర్యలకు ముజఫ్ఫర్ పూర్ లో పాల్పడడం దారుణం! ఇంకా విభజన రాజకీయాలు ఎందుకో, ఇంకా ఏమి సాధిస్తారో!ఎవరు ఏమి చేసినా ఈ దేశం లో విభజన రాజకీయాలకు తావు లేదు, అని ఎప్పటికప్పుడు కలిసి మెలిసి ఉంటున్న సకల జనులు రుజువు చేస్తూనే ఉంటారు. మేరా లౌకికక వాద భారత్ మహాన్ హై!

# యూపీ బీజేపీలో ముసలం పుట్టిందా?

***బీజేపీ 2014 సార్వత్రిక ఎన్నికల్లో గెలవగానే మోదీ హవా..ఒక్కసారిగా పెరిగింది. బీజేపీ అగ్రశ్రేణి నాయకులు ఎల్.కే. అద్వానీ,మురళీ మనోహర్ జోషీ లను వయసు పెరిగిందనే నెపంతో పార్టీలోనూ,ప్రభుత్వ కార్యకలాపాల లోనూ వారిని దూరం పెట్టారు.2019లో మెజార్టీ పెంచుకుంటూ మరోసారి బీజేపీకి విజయం దక్కగానే ప్రధానిగా మోదీ పగ్గాలు చేపట్టగానే ఆయనకు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఎదురులేకుండా పోయింది.సుష్మా స్వరాజ్,తరువాత రాజనాథ్ సింగ్ కు మోదీ కీలక పదవులు ఇవ్వడంతో మోదీనీ ఎధిరించే సాహసం ఆయన చేయలేదు. ఇక బీజేపీలో మోదీకి పోటీ ఇవ్వగలిగిన స్థాయి,నితిన్ గడ్కరీ,యోగీ ఆధిత్యానాథ్ పేర్లు బాగా వినపడ్డాయి. రెండవసారి మోదీ ప్రధాని కాగానే వీరిద్దరి ప్రాముఖ్యత తగ్గించటానికి ప్రయత్నాలు జరిగాయి.***



వీరిద్దరికీ పార్టీలనూ, ఆరెస్సెస్ లోనూ బలమైన పునాదులు ఉన్నాయి. అందువల్ల ఆ ప్రయత్నాలు కొనసాగలేదు. మోడోసారీ మోదీ కోరుకున్నట్లు బీజేపీకి తిరుగులేనీ మెజార్టీ వచ్చివుంటే వీరిద్దరికీ ఉద్వాసన తప్పదనీ మొన్న జైలు నుంచి తిరిగి రాగానే తన మొదట ఎన్నికల ప్రసంగంలోనే కేజ్రీవాల్ స్పష్టం చేశారు. 2025లో మోదీకి 75 ఏళ్ళు వస్తున్నందున తన అనుచరుడు,నమ్మకస్తుడు అమిత్ షాను ప్రధానిగా నియమించటానికి అడ్డుగా రాగల యోగీ ఆధిత్యానాద్, నితిన్ గడ్కరీలను ఏదో మిషతో తొలగిస్తారు అని ఆయన బలంగా ప్రచారం చేశారు.ఈ విషయంపై దేశ వ్యాప్తంగా చర్చ జరిగింది.

ఇప్పుడు మూడోసారీ లోకసభ ఫలితాలు ఇచ్చిన షాక్ నుంచి ఉత్తరప్రదేశ్ బీజేపీ ఇంకా బయటపడటం లేదు. ఇంతకాలం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాటే శాసనంగా నడిచిన ఆ పార్టీలో ఇప్పుడు అసంతృప్తి గళాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా యోగి ఆదిత్యనాథ్ కు ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యకు మధ్య విభేదాలు తీవ్రమయ్యాయనే ప్రచారం జరుగుతుంది. ఇటీవల పరిణామాలు ఈ ప్రచారానికి బలం చేకూరుస్తున్నాయి. ఒకవైపు లోక్ సభ ఎన్నికల్లో వ్యతిరేక ఫలితాలకు బాధ్యత వహిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి భూపేంద్ర చౌదరి రాజీనామా చేయాలని నిర్ణయించారు. ఇది ఇలా ఉండగా త్వరలో యూపీలో 10 అసెంబ్లీ స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికలు బీజేపీకి మరో సవాల్ గా మారాయి.

జనంసాక్షి

**సీఎం డిప్యూటీ సీఎం మధ్య వివాదం:** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్,డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య మధ్య విభేదాలు మొదలయ్యాయి. గత నెల రోజులుగా మంత్రులతో యోగి నిర్వహించిన సమావేశాలకు మౌర్య హాజరు కావడం లేదు.ఇటీవల జరిగిన పార్టీ సమావేశంలో మౌర్య మాట్లాడుతూ.."పార్టీ కంటే ఎవరు పెద్దకాదు. ప్రభుత్వం కూడా పార్టీ కంటే ఎక్కువ కాదు" అని చేసిన వ్యాఖ్యలు యోగిని ఉద్దేశించి చేసినవే అనే భావన నెలకొన్నది.మరోవైపు యూపీలో లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ సీట్లు 62 నుంచి 33 కి తగ్గిపోవటం పట్ల బీజేపీ నేతలు వ్యక్తిగత సంభాషణల్లో యోగి వైఖరిని నిందిస్తున్నారు.ఆయన పాలనా తీరువల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపిస్తున్నారు. యోగీ మాత్రం అతి ఆత్మవిశ్వాసం వల్లనే తక్కువ సీట్లు వచ్చాయని పేర్కొన్నారు.

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాజీనామా:** లోక్ సభ ఎన్నికల్లో యూపీలో పార్టీకి వచ్చిన వ్యతిరేక ఫలితాలకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు భూపేంద్ర చౌదరి నిర్ణయించారు. యూపీ వ్యవహారాలు బీజేపీ హై కమాండ్ కు కూడా తలనొప్పిగా మారాయి. దీంతో యోగీ, మౌర్య, భూపేంద్రతో నరేంద్ర మోడీ,అమిత్ షా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వరస సమావేశాలు నిర్వహించారు. బీజేపీలో ఈ పరిస్థితి పై సమాజవాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ స్పందిస్తూ... అంతర్గత కలహాలతో బీజేపీ మునిగిపోతున్నదని పేర్కొన్నారు.ఒక వేళ యోగీ ఆదిత్యానాథ్ ను తొలగించటమే జరిగితే, నితిన్ గడ్కరీకి కూడా ప్రమాదం పొంచి ఉంది. కానీ ఈ విషయం అంత తేలిక కాదు.



**డాక్టర్ కోలాహలం రామ్‌కిశోర్**
9849328496

# కోరికలకు కళ్లెం వేయాలి!



కోరికలే అనర్థానికి హేతవురు. అది కావాలి..ఇది కావాలి అని అనవసరమైన కోర్కెలతో మనిషి జీవితాన్ని నరకప్రాయం చేసుకుంటున్నాడు. ఉన్నంతలో బతకడం అవసరం. అందుకే పెద్దలు గొంగడి ఉన్నంత కాలు చాపుకోవాలని అంటారు. అంటే మన స్థోమతకు తగ్గ ఆలోచనలు మాత్రమే చేయాలి. కోరకిలను అదుపులో పెట్టుకోవాలి. వాటికి కళ్లెం వేయాలి. యవ్వనంలో ఉంటే మసలితనం వచ్చేస్తుందని భయపడతాం. ధనవంతులమైతే అనుకోకుండా పేదవాళ్లమైపోతామేమో అని భయపడతాం. ఏ స్థితిలోనూ భయం కలిగించనిది ఒకే ఒక్కటి. అదే వైరాగ్యం. 'నాకు అక్కర్లేదు!' అనుకునే వాడు ఉన్నంత నిర్భయంగా మరెవ్వడూ ఉండడు. 'నాకిది కావాలి!' అనుకుంటే వంద రకాల తాపత్రయాలు పడాల్సిందే. శివుడు మన్మథుని గర్వాన్ని నిర్మూలనం చేశాడు. మనం కూడా శివ భక్తులమై సంసారంలో ఉంటూనే కామవాంఛలను జయించాలి. అది గ్రహిస్తే యాభై ఏళ్లు దాటే సరికి కాస్త నెమ్మదిగా వైరాగ్య మార్గంలో పడతాం. అప్పుడు నిర్భయంగా ఉండగలుగుతాం. జీవితంలో ఏదైనా భయం కలిగించేదే. పాండిత్యం సంపాదిస్తే, అంతకన్నా ఎక్కువ పాండిత్యం ఉన్న వాడు వస్తాడని భయపడతాం. అందంగా ఉంటే ఈ అందం దెబ్బతింటుందేమోనని భయపడతాం.

జనంసాక్షి

ఆ గర్వాన్ని జయించాలంటే పార్వతీ పరమేశ్వరులిద్దరినీ మనం ఆశ్రయించాలి. నారదుడు మొదలుకుని ముఖ్యమైన మునులందరూ నిరంతరం భగవంతుని ధ్యానంలో గడిపారు. వారి మనః పద్మాలలో శివుడు తుమ్మెదలా విహరిస్తున్నాడు. మనమూ అలా నిరంతరం భగవంతుని ధ్యానంలో గడుపుదాం. మనస్సులో భక్తి తప్ప మరేమీ ఉండకూడదు. 'అంతా నువ్వే!' అని భగవంతుణ్ణి వేడుకోవాలి. దేశం బాగుపడటానికి, జీవితం బాగుపడటానికి ఆధ్యాత్మికతను మించిన మార్గం లేదు. శంకరాచార్యుల నుంచి వివేకానందుల వరకు ఇదే ఆచరించి చూపారు. కావాలను కుంటేనే సమస్యలు వచ్చి పడతాయి. అందువల్ల తాహతుకు మంచి కోరికలను కోరుకుంటే సమస్యలు చుట్టుముడతాయి.

## బడిని గుడిగా మలిచిన (మాస్టర్లు) గురుబ్రహ్మలకు అభినందనలు

పిల్లలే సర్వస్వం
పాఠశాలే దేవాలయం
వృత్తియే దైవం
జ్ఞాన చైతన్యమే
యజ్ఞంగా
విధి నిర్వహణలో
విభిన్నత
పనితీరులో ప్రత్యేకత
చదవని పిల్లలపై
బెత్తమెత్తక
అల్లరి చేస్తే కోప్పడక
క్రమశిక్షణ లేదని
కసురుకోక
చిరునవ్వులనే
నల్లబల్లగా
ఓర్పునే శుద్ధ
ముక్కగా చేసుకొని
ఓపికయే వేదికగా
ఆప్యాయతే
ఆదరణగా
ప్రేమతో
చదువులు చెప్పి
అర్థమయ్యేలా
పాఠాలు బోధించారు
పిల్లల కష్టాలను
తీర్చారు
పేద పిల్లలకు
ఆర్థికంగా అండగా
నిలిచారు
ఆప్యాయతను
పంచి
అనురాగాన్ని
పండించి
గురు శిష్యుల
అనుబంధాల కోటలో
భావి భారతాన్ని
ఆవిష్కరించిన
జ్ఞాన రూప శిల్పులు
ఉపాధ్యాయులు
భావి తరాలకు
దారి దీపం
జ్ఞాన సమాజానికి
రూపశిల్పులు
ఉపాధ్యాయులు
చదువుల్లో
వెనుకబడిన
పిల్లలకు ప్రత్యేక
బోధన ఆటపాటలతో
విద్యా బోధన
విద్య ప్రాధాన్యత
ప్రచార కర్తలుగా
ఆంగ్లం 'గణితం
చార్టులతో
పజిల్స్ తో
సులభ శైలి
బోధనతో
భయాన్ని
పోగొట్టి
ఇష్టాన్ని పెంచి
సంకల్పసిద్ధిని
ప్రబోధించి
ప్రతిభా వికాసానికి
చేయూతనిచ్చిన
గురువర్యులు
సబ్జెక్టుపై భయం
పోగొట్టే కృత్యాలు
బొమ్మల ద్వారా ఆసక్తి
పెరిగేలా పాఠాలు
బోధించిన ఆదర్శ
ఉపాధ్యాయులు
ఆటపాటలతో
అధ్యయనం
అభ్యసనం
ఆప్యాయతను పంచి
విద్యార్థుల్లో
స్నేహ
సౌభ్రాతృత్వాన్ని
ఐక్యతని పెంచి
సమైక్యత భావాలతో
సమన్వయత సంఘీభావం
సహనం సాహసం ధైర్యం
ఆత్మవిశ్వాసానికి తమ
బోధనల ద్వారా బీజం
వేసిన ఉపాధ్యాయులు
ఆదర్శనీయులు
ప్రేమాను రాగాలతో
పిల్లల్లో చెరగని ముద్ర వేసిన
ఉపాధ్యాయులు స్ఫూర్తి
శిఖరాలు
విజ్ఞాన తృష్ణను
పెంచే జ్ఞాన బ్రహ్మ
ఉపాధ్యాయులు
బడిని గుడిగా
మలిచిన మాస్టార్లు
జ్ఞాన శిల్పులు
అంకితభావం ఆదర్శాలే
ధ్యేయంగా సమర్పణయే
లక్ష్యంగా మార్పుయే
మార్గంగా విజ్ఞాన సమాజ
విధాతలుగా వర్ధిల్లుతున్న
ఉపాధ్యాయులకు
అభినందనలు.

జనంసాక్షి

**(రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీల సందర్భంగా గురు శిష్యుల ప్రేమానురాగాలు ఆవిష్కృతమైన సందర్భాన్ని పురస్కరించుకొని రాసిన కవిత)**



**నేదునూరి కనకయ్య**
**రాష్ట్ర అధ్యక్షులు**
**తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం 'సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక**
**కరీంనగర్**
**9440245771**

# ఓరి నీచుడా...! నికృష్టుడా..!

ఓరి నీచుడా...! నికృష్టుడా..!
ఓరి అంధుడా.! కామాంధుడా..!
తెలిసి తెలిసి...ఎందుకురా..?
ఎందుకురా తప్పులు చేస్తావు..?
ఎందుకురా నిప్పుల్లో దూకుతావు..?
అందరికీ చెబుతావు కదరా నీతులు
తప్పుడు పనులెప్పుడూ చెయ్యోరాదని
మరి నీబుద్ధి ఏగడ్డి తిన్నదిరా అడ్డగాడిద?
ఓరి నీచుడా...! నికృష్టుడా..!
ఓరి అంధుడా.! కామాంధుడా..!
ఇంత నీచమైన...
ఇంత ఘోరమైన...
ఇంత నికృష్టమైన...
ఇంత దారుణమైన...
ఇంత దుర్మార్గమైన...
ఇంత అసహ్యకరమైన...
ఇంత అమానవీయమైన...
ఇంత నమ్మశక్యం కాని
ఈ పాపిష్టి పని ఎలా చేశావురా..?
ఓరి నీచుడా...! నికృష్టుడా..!
ఓరి అంధుడా.! కామాంధుడా..!
అందరూ నిన్నేమంటున్నారో తెలుసారా..
ఛీఛీ...ఛీఛీ...కళ్ళు పొరలు కమ్మిన
వీడు మనిషి కాదు ఒక విషసర్పమని...
మానవరూపంలో ఉన్న ఒక మృగమని...
వీడొక గుంట నక్కని...గజ్జి కుక్కని...
వీడు సమాజానికి ఒక చీడపురుగని...
వీడొక పచ్చిగడ్డి మేసే పశువని...
వీడికి క్షణం కూడా ఈ భూమిపై
తిరిగే హక్కులేదని...శపిస్తున్నారురా..!
వాన్ని చంపేయండి..!
వాన్ని ఉరితియ్యండి..!
వాడు నా కడుపున పుట్టలేదు..!
అంటూ...తన రక్తం పంచుకుని
పుట్టిన బిడ్డచావును ఏ తల్లి కోరుకోదు...
కానీ...నీ తల్లి కోరుకుందంటే నిజంగా
నీవు మనిషివి కాదు నరరూపరాక్షసుడివే..!
ఓరి నీచుడా...! నికృష్టుడా..!
ఓరి అంధుడా.! కామాంధుడా..!
ఎందుకురా...? ఎందుకురా...?
ఏం సుఖం పొందాలని...నెలల
బిడ్డను పొట్టన పెట్టుకున్నావురా..?
నిజానికి నీకు యావజ్జీవ కారాగార శిక్ష
వేసి జైలుకు పంపినప్పుడు కాదురా...
నిన్ను నడిరోడ్డులో
ఉరితీసి...లేదా
కాల్చి ఎన్కౌంటర్ చేసి...
డైరెక్ట్ గా
కాటికి...పంపినప్పుడేరా..!
ఆడపిల్లల తల్లిదండ్రులకు
ఆత్మశాంతి..!

జనంసాక్షి



**పోలయ్య కూకట్లపల్లి**
**అత్తాపూర్ హైదరాబాద్**
**9110784502**

## వ్యక్తిత్వదీపాన్ని వెలిగించుకో...

ఓ మనిషీ..!
ఇకనైనా...ఈ కంప్యూటర్
యుగంలోనైనా...
కళ్ళు తెరిచి నిజం
తెలుసుకో...
నీ అవివేకం...నీ
బలహీనత...
నీ అహంకారం...
నీ సంస్కృతీ
సాంప్రదాయం...ఏది?
ఎప్పుడు మారేను నీ
మనస్తత్వం..?
ఎక్కడ దాక్కుంది నీ
సంస్కారం..?
వెతికి వెతికి పట్టుకో...
నీ వ్యక్తిత్వదీపాన్ని
వెలిగించుకో...
నిన్న మరుమల్లెలా
పరిమళించి
నేడు
మటుమాయమైపోయిన
నీ మంచితనం...నీ
మానవత్వం...
నీ సహనం...నీ సమతా నీ
మమత
నీ దయ నీ కరుణ...నీ
ప్రేమ నీ జాలి
ఆ సుగంధభరిత సుగుణాల
సుమాలన్నీ ఏ ధూళిలో
కలిశాయో..?
ఏమైపోయాయో..?
ఎవరికెరుక..? ఓ మనిషీ..!
ఎందుకిలా మోడువారిన
చెట్టులా మిగిలావో..?
ఆలోచించు ఒక్కసారి...

**పోలయ్య కూకట్లపల్లి**
**అత్తాపూర్ హైదరాబాద్**
**9110784502**

## రచనలకు ఆహ్వానం

**సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణలపై రచనలకు, సాహిత్యం, కవిత్వం, పుస్తక సమీక్షలు రాసే కవులకు జనంసాక్షి ఆహ్వానం పలుకుతోంది. మీ రచనలను hydjanamsakshi @gmail.com కు పంపగలరు. మీ రచనలు క్లుప్తంగా, సూటిగా పేజీమేకర్ ఫైల్‌లోగానీ, యూనికోడ్ ఫార్మేట్‌లోగానీ పంపించగలరు.**

# రైతు రుణమాఫీతో రైతు కుటుంబాల్లో సంతోషం

కలెక్టర్ గౌతం

శామీర్పేట జూలై 19 (జనంసాక్షి):

రైతు రుణమాఫీ తో రైతు కుటుంబాల్లో సంతోషం నెలకొందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం చెప్పారు. గురువారం శామీర్పేట మండలం అలియాబాదు గ్రామ పరిధిలోని మార్కెట్ కమిటీలో గల రైతు వేదికలో రైతు రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ లో జరిగిన రైతుల సంబురాలలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆలియాబాదు రైతులందరికీ శుభాకాంక్షలు చెప్పారు. రైతు రుణమాఫీ అనేది రైతులకు ఒక పండగ లాంటిదని, రైతులకు రుణ భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం గొప్పనిర్ణయం తీసుకుందని తెలిపారు. మొదటి విడతలో లక్ష రూపాయలు రుణమాఫీ రైతు ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. లక్ష లోపు రుణం ఉన్న రైతులకు జీరో అవుతుందన్నారు. లక్ష కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతులు, రుణమాఫీ కాలేదని అధైర్య పడవద్దని, రెండో విడత, మూడో విడతలో రుణమాఫీ చేయడం జరుగుతుందని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున వ్యవసాయం చేసే రైతులు రుణాల కోసం రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. రైతులకు ఏమన్నా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి జిల్లా వ్యవసాయ, మండల వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారన్నారని, వారిని సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట మండల ప్రత్యేకాధికారి సైదులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మేరీ రేఖ, శామీర్ పేట తాసిల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీడీవో మమతాబాయి, వ్యవసాయ అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### మూడు చింతలపల్లి మండలంలో

అలాగే మూడు చింతలపల్లి రైతు వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీ నిధుల విడుదల వీడియో కాన్ఫరెన్సును అధికారులు రైతులు పాల్గొని వీక్షించారు. రైతు సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలి

### ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం, జూలై 19 ( జనం సాక్షి ) :

పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగులూరు గంగానగర్ కాలనీలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి పర్యటించారు. అనంతరం ఇండ్ల మధ్యలో ఉన్న చెత్తను, చెదారాన్ని మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా చైర్మన్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ...రానున్నది వర్షా కాలమని పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని అన్నారు. ప్రజలందరూ కూడా వీధులు పరిశుభ్రంగా ఉంచుకునేందుకు సహకరించాలన్నారు. కాలనీలలో దోమల బెడదను నివారించేందుకు ఫాగింగ్ (స్ప్రే) చేయాలని, వర్షపు నీరు, చెత్తా, చెదారం, మురుగును ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. బొంగులూరు గేట్ నుండి పటేల్ గూడా వరకు వెళ్లే ప్రధాన రహదారి పనులను బోనాల పండుగ వరకు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి ప్రతి ఒక్కరికీ సూచించారు. కాలనీలలో ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్ కుంట్ల మౌనిక ఉదయపాల్ రెడ్డి, ఏఈ వీరాంజనేయులు, వర్క్ ఇన్స్పెక్టర్ జాన్సన్, సురేష్, కాలనీ పెద్దలు రామారావు, ప్రవీణ్, శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

### కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్



ఎల్బీనగర్ జూలై 19 (జనం సాక్షి)

దోమల నివారణ కోసం ప్రతి నివాసగృహస్తులు జాగ్రత్తలు పాటించాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ కోరారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా జిహెచ్ఎంసి ఎంటమాలజీ సిబ్బంది ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ కాలనీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాత నాయక్ మాట్లాడుతూ ప్రతి గృహస్తులు తమ ఇంటి ముందు పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు ఎక్కువగా ఉంటాయి అన్నారు. ఖాళీ స్థలాలలో చెత్త చెదారాన్ని వేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత కాలనీవాసులపై ఉందన్నారు .ఇంటి ముందు చెట్ల మధ్యలో కవర్లు పేపర్లు పడి నీరు ఉండడం వల్ల దోమలు అభివృద్ధి చెందుతాయని అలాంటి పరిస్థితి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సతీష్ గౌడ్ ,నరసింహ, గంధం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యకు, ఆరోగ్యానికి నిలువెత్తు నిదర్శనం అంగన్వాడీ కేంద్రాలు



కుత్బుల్లాపూర్ జూలై 19 (జనం సాక్షి)

విద్యుత్‌తో పాటు ఆరోగ్యానికి ప్రాముఖ్యత కేంద్రాలుగా అంగన్వాడీ కేంద్రాలు నిలుస్తాయని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇన్చార్జి కొలను హనుమంత రెడ్డి అన్నారు. శుక్రవారం అమ్మ మాట, అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా బాచుపల్లిలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం హనుమంత రెడ్డి మాట్లాడుతూ చిన్నారులు అంగన్వాడి కేంద్రాల వైపు ఆకర్షితులయ్యేలా కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలను తీర్చిదిద్దుతుందన్నారు. చిన్నారులకు విద్యతోపాటు ఆరోగ్యం మానసిక ఉల్లాసం కోసం ఆటలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలను రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కొలను కృష్ణారెడ్డి, సీతారామరెడ్డి, యుద్ధం రెడ్డి, జీతయ్య, సత్తిరెడ్డి, శంకర్, కే నారాయణ, బాల్ రెడ్డి, రామచందర్ నాయక్, హరి నాయక్, శంకర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, వీరారెడ్డి, వెంకటేష్ పటేల్, గొంగుల నవీన్, పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోకండి



### కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే

వనపర్తి బ్యూరో జులై 19( జనంసాక్షి)

కళ్యాణ లక్ష్మి షాది, ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల మంజూరి కోసం దళారులను నమ్మి మోసపోకూడదని ఎక్కడ ఎలాంటి పైరవీ లేకుండా నేరుగా వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం వనపర్తి పట్టణం, వనపర్తి మండలంలోని. షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు. వనపర్తి పట్టణానికి సంబంధించి 119 సీఎం సహాయనిది వనపర్తి మండలానికి సంబంధించి 69,వనపర్తికి 38 కళ్యాణ లక్ష్మి షాదీ, ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుములా రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అవినీతి రహిత పాలన కొనసాగుతుందని ఆయన అన్నారు.గత పాలకుల లాగా షాది ముబారక్ కళ్యాణ్ లక్ష్మి చెక్కుల కోసం వేచి చూడాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ఇంటి వద్దకే చెక్కులను తీసుకు వచ్చి అందజేస్తారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపాలిటీ చైర్మన్ పుట్టపాకల మహేష్ పట్టణ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

### కార్పొరేటర్ కొలుకుల జగన్

కుత్బుల్లాపూర్ జూలై 19 (జనం సాక్షి)

ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని సోమయ్య నగర్‌లో శ్రీ నల్లపోచమ్మ తల్లి ఆలయానికి మైక్ సెట్ ను విరాళంగా ఇచ్చిన దాతను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ బోనాల పండుగను పురస్కరించుకొని ఆయా బస్తీలలో అమ్మవారి ఆలయాలను కమిటీ సభ్యులు ముస్తాబు చేయటాన్ని ఆయన అభినందించారు. ఆలయాల అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సోమయ్య నగర్ బస్తీ కమిటీ అధ్యక్షులు యాదగిరి, ఆలయ అధ్యక్షుడు సతీష్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు వి గణేష్, పి నరసింహారెడ్డి, జి విటల్ ముదిరాజ్, ప్రభాకర్, ప్రకాష్ ముదిరాజ్, మహేష్, నవీన్, ప్రభువు ముదిరాజ్, సత్యం చారి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.




## కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోండి

### సిపిఐ కార్యదర్శి ఉమామహేష్

కుత్బుల్లాపూర్ జూలై 19 (జనం సాక్షి)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో కబ్జాదారులు రోజురోజుకు రెచ్చిపోతున్నారని నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. శుక్రవారం షాపూర్ నగర్ లోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పత్రిక సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమా మహేష్ మాట్లాడుతూ గాజులరామారంలోని లాల్ సాబ్ కూడా కు చెందిన ధారా పద్మావతికి చెందిన స్థలంలో కేఎల్ యూనివర్సిటీ యాజమాన్యం ఆక్రమించుకొని వారిని భయభ్రాంతులకు గురిచేస్తుంది అన్నారు. సర్వేనెంబర్ 344/1, 345/1 లోని వారి సొంత భూమి లోకి వెళుతుంటే సెక్యూరిటీ సూపర్వైజర్లు ఆమె కుమారుడు నర్సింగ్ రావు పై భౌతికంగా దాడి చేసి గాయపరిచారని ఆయన ఆరోపించారు. గతంలో కబ్జాదారులు పత్రికా విలేకరులపై, రెవెన్యూ సిబ్బందిపై దాడులు చేసిన కేసులు నమోదు కాకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా బాధితురాలు ఫిర్యాదును స్వీకరించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేఎల్ యూనివర్సిటీ యాజమాన్యంపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాధితురాలు దారం పద్మావతి, దారం నర్సింగరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, హరినాథ్ రావు, సదానంద, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మళ్లీ మోస పూరిత పాలన

- గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనువుగానే కాంగ్రెస్ పాలన
- పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు దేశానికి గర్వకారణం
- తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయం
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచారు
- చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



తాండూరు జులై 19(జనంసాక్షి)

తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ మోస పూరిత పాలన కొనసాగుతోందని భారతీయ జనతా పార్టీ చేవేళ్ల పార్లమెంట్ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని తులసీ గార్డెన్స్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్ కుమార్, పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం, పట్టణ శాఖ ఆధ్వర్యంలో చేవేళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజేపి నియోజక వర్గ శ్రేణులతో కలిసి పండితుల సమక్షంలో వేదమంత్రోచ్ఛరణాలతో అశీర్వదించి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా పలువురు నేతలు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గజమాల, పూల మాలలు, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు దేశానికి గర్వకారణమన్నారు. తెలంగాణలోని 8 పార్లమెంట్ స్థానాల్లో బూతు స్థాయి నుంచి శక్తి, మండల, అసెంబ్లీ, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు పనిచేయడంతో అభ్యర్థుల గెలుపు సాధ్యమ య్యిందన్నారు. తాండూరులో గడచిన ఎంపీ ఎన్నికల్లో 4వేలు వస్తే పార్లమెంట్‌లో 80 వేలు ఓట్లు రావడం చారిత్రాత్మకమన్నారు. తాండూరులో స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ, కుల సంఘాల మద్దతు మరువలేని దన్నారు.తన గెలుపుకు కృషి చేసిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం ఎన్నికలకు ముందే ఓటర్లు నిర్ణయించారని అన్నారు. ప్రతిపక్షాలు, కొందరు స్వార్థ రాజకీయాల కోసం రిజర్వేషన్ల మార్పు అంటూ బీజేపీపై దుష్ప్రచారం చేయడంతో తక్కువ సీట్లు వచ్చాయని అన్నారు. అయినా ప్రధాని నరేంద్రమోడి పాలనతో బీజేపీ అధికారం చేపట్టిందని, అమిత్ షా, నడ్డాల పాత్ర కూడా ఉందన్నారు. రాష్ట్రంలో మళ్లీ మోస పూరిత పాలన పురుడు పోసుకుందని కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న తప్పును కొత్త ప్రభుత్వం కూడా చేస్తుందన్నారు. గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసినా కూడా ప్రజలను, రైతులను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ఒకేసారి రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందన్నారు.దశల వారికి కొంత కొంత రుణమాఫీ చేయడం దోకా చేయడమే అన్నారు. 40లక్షల మందికి రుణమాఫీ కావాల్సి ఉండగా 10 లక్షల మందికి మాత్రమే అమలు చేస్తుందని విమర్శించారు. ఈ మోస పూరిత పాలనను ప్రజలు నమ్మరని అన్నారు. రైతులకు మోసం చేస్తే బీజేపీ అండగా ఉంటుందన్నారు. తెలంగాణలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అప్పటి వరకు నేతలు, కార్యకర్తలు రాజకీయాలకు అతీతంగా పనిచేయాలన్నారు.నిబద్ధతో పనిచేస్తే స్థానిక సమయంలో కమలం విజయం ఎవ్వరు ఆపలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, యాలాల ఎంపీపీ బాలేశ్వర్ గుప్త, నాయకులు ఎం. నరేష్, గాజుల శాంతుకుమార్, బంటారం భద్రేశ్వర్, బొప్పి శ్రీహరి, రజనీకాంత్, కౌన్సిలర్లు అంతారం లలిత, బంటారం లావణ్య, బాలప్ప, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మహిళల అభివృద్దే కాంగ్రెస్ ధ్యేయం

### మంత్రి జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల, జులై 19 (జనంసాక్షి)

మండల కేంద్రంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక మరియు సాంస్కృతిక మంత్రి కృష్ణారావు పర్యటించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా గ్రామాలలో పర్యటించారు. మండల కేంద్రం లోని బాలికల కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. చదువు ఎలా చదువుతున్నారు ? అని ఉపాద్యాయులు అన్ని పాఠ్యాంశాలను బోధిస్తునారా ? అని తెలుసుకున్నారు. పాఠశాలలో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. చదువు ఒక్కటే జీవితాన్ని మార్చుతుందని మంచి ఉద్యోగం సాధించి మీ తల్లితండ్రుల ను బాగా చూసుకోవాలని అన్నారు. మహిళలతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత మీకే ఇస్తుందని ఉచిత బస్ ప్రయాణం, గృహ జ్యోతి, గృహలక్ష్మి వంటి పథకాలు అమలు చేస్తుందని తెలిపారు.సంగినేని పల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రకంటి వెంకటేష్, మీసాల మోహన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## మర్పల్లి తహసిల్దార్ కార్యాలయంలో (రియల్)దాడి..!!

**అధికారుల ముందే పరస్పరం రాళ్లతో దాడి**

**పోలీసులకు తెలియచేసిన తహసిల్దార్**

**కొంతసేపు తసిల్ కార్యాలయంలో ఉద్రిక్త పరిస్థితి**

వికారాబాద్ జిల్లా బ్యూరో జూలై 19 (జనం సాక్షి):

భూముల రేట్లకు రెక్కలు రావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య పోటీ పెరిగింది. తక్కువ ధరకు భూమి అందుబాటులో లేకపోవడంతో ఒకే భూమికోసం పరస్పరం పోటీపడి ఇరువురు పరస్పరం దాడి చేసుకుని స్థాయికి చేరింది ఇనాం భూముల భూముల విషయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య గొడవ జరిగి తాసిల్దార్ కార్యాలయంలోని అధికారుల సాక్షిగా ఇరువురు పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ సంఘటన మరుపల్లి మండల తాసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఎలా ఉన్నాయి. మర్పల్లి మండలం సిరిపురం గ్రామానికి చెందిన దళితుల ఇనాం భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య చిచ్చు పెట్టాయి. సిరిపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దళితుల ఇనాం భూముల విషయమై క్రయవిక్రయాలు చేస్తున్నారు దళితుల భూములకు ఓ ఆర్ సి వచ్చిన అనంతరం రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగిస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుండగా మర్పల్లి తాసిల్దార్ కార్యాలయంలో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగింది. సిరిపురం గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పొలిటికల్ లీడర్ సీఎం నర్సింలు మరో వర్గం మధ్య గొడవ జరిగింది. దళితుల ఇనాం భూములకు సంబంధించి ఒక వర్గం దళితుల నుంచి ఒక రేటు ఖరారు చేసి అగ్రిమెంట్ చేసుకుంది. అదే భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారి పొలిటికల్ లీడర్ సీఎం నర్సింలు అంతకుముందు కొందరు రైతుల చేత ఒక రేట్ ఖరారు చేసి అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ నామ్ భూముల విషయమై ఇరువురు కలెక్టర్ కార్యాలయంలో ఓఆర్ఎస్ ల కోసం అప్లై చేసుకోవడంతో రెండు వర్గాల వారికి ఓఆర్సి విచారణ కోసం తాసిల్దార్ కార్యాలయానికి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో స్థానిక తహసిల్దార్ గణేష్ ఆర్ ఐ ఈయన భూమిలో విషయమై రైతుల వివరాలు సేకరించి పంచనామలు నిర్వహించారు. ఇదే భూములకు సంబంధించి ఒక వర్గానికి ఓఆర్సీలు జారీ అయ్యాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారి పొలిటికల్ లీడర్ నరసింహులు కొనుగోలు చేస్తున్న భూములకు కూడా ఓఆర్సి కోసం విచారణ జరపడానికి ఆదేశాలు వచ్చాయి. దీంతో రెండు వర్గాల వారు ఒకేసారి తాసిల్దార్ కార్యాలయంలో ఎదురుప డడంతో ఒకరినొకరు దూషించుకుంటూ పరస్పరం దాడి చేసుకున్నారు. ఇనాం భూముల విషయమై రెండు వర్గాల మధ్య మాట మాట పెరిగి తాసిల్దార్ కార్యాలయంలోనే తాసిల్దార్ గణేష్ ఆర్ఐ దశరథ్ సాక్షిగా పరస్పరం దాడులు చేసుకున్నారు దీంతో కొద్దిసేపు మర్పల్లి తాసిల్దార్ కార్యాలయంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తాసిల్దార్ కార్యాలయం బల్లలపై ఉన్న రాళ్లు తీసుకొని పరస్పరం కొట్టుకోవడంతో ఇరువురికి రక్త గాయాలయ్యాయి. పరిస్థితి చేయి జారిపోతుందని మర్పల్లి తాసిల్దార్ మర్పల్లి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సకాలంలో చేరుకొని ఇరువురిని చెదరగొట్టారు. అనంతరం పరస్పరం మర్పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ విషయమై మోమిన్పేట సీఐ విచారణ జరుపుతున్నారు. సిసి ఫుటేజ్ ఆధారంగా ఇరువురుపై కేసు నమోదు అయ్యే అవకాశం ఉంది. కాగా ప్రజల ముందు తాసిల్దార్ కార్యాలయం అధికారుల ముందు కార్యాలయంలోనే ఇరువురు కొట్టుకోవడం కొసమెరుపు దీంతో తాసిల్దార్ కార్యాలయంలో అధికారుల పనితీరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల జోక్యంపై రకరకాల చర్చ జరుగుతుంది.




## శంషాబాద్ విమానాశ్రయంలో పలు విమానాల సర్వీస్‌లు రద్దు

శంషాబాద్, జూలై 19 (జనంసాక్షి)

ప్రపంచవ్యాప్తంగా ఏవియేషన్ సిగ్నల్ కు అంతరాయం కలగడంతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పలు దేశాలకు రాష్ట్రాలకు వెళ్లవలసిన దాదాపు 35 విమానాల రాకపోవులకు అంతరాయం కలిగింది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో వివిధ దేశాలకు రాష్ట్రాలకు వెళ్లవలసిన ప్రయాణికులు ఆందోళన చెందారు. వాతావరణం అనుకూలించకపోవడంతో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని వాతావరణ శాఖ తెలిపారు.



## అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలందాలి: కలెక్టర్

మహమ్మదాబాద్ ,జులై 19 (జనంసాక్షి):

అంగన్వాడి సెంటర్లలో పిల్లలకు, గర్భిణీ అలాగే బాలింతలకు మెరుగైన సేవలందాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం మహమ్మదాబాద్ మండల పరిధిలోని కంచనపల్లి అంగన్వాడి కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సందర్బంగా కలెక్టర్ అంగన్వాడి సెంటర్లలో పిల్లలకు, గర్భిణీ అలాగే బాలింతలకు వండి పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. అలాగె అంగన్వాడీ కేంద్రంలో గల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులచే గోడల మీద ఉన్న బొమ్మలను చూపించి వాటి పేర్లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు గోడలపై వ్రాసిన అక్షరాలను బొమ్మలను దారాళంగా చదివి చెప్పడంతో ఆమె ఆ చిన్నారులను అభినందించారు. గోడలపై బొమ్మలు వేయడం వలన విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపడతాయని అన్నారు. అక్కడ సెంటర్లో టీచర్ లేకపోవడం ఆయానే పిల్లలను చదువులు చెప్పడం, వంట చేసి పెట్టడంతో ఆయాను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ రాఘవేంద్రరావు, పంచాయతీ కార్యదర్శులు సుభద్ర , రాఘవేందర్ రెడ్డి, అంగన్వాడి ఆయా తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
20 జూలై 2024

# రూ.22 కోట్లతో ఐటీ టవర్





- నిరుద్యోగ నిర్మూలనకై ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి ప్రత్యేక దృష్టి
- 600 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణాలకు ప్రతిపాదనలు

**శ్రీరంగాపూర్ జూలై 19 (జనం సాక్షి)**

సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు ఎంపీ డాక్టర్ మల్లు రవి మొదటి నుంచి విద్యా పర్తిగా ఎంతో ప్రాశస్త్యం కలిగిన వనపర్తి నియోజకవర్గం నేడు నిరుద్యోగుల పాలిట వర ప్రధాయినిగా మారుతుందని చెప్ప వచ్చు. ఉన్నత చదువులను అభ్యసించి ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులను, నిరుద్యో గలను దృష్టిలో ఉంచుకొని వనపర్తి నియోజకవర్గ పరిధిలో రూ. 22 కోట్లతో ఐటి టవర్ నిర్మాణానికి శ్రీరంగాపురం మండలం కంబల్లాపురం, తాటిపా ముల గ్రామ శివారులలో 600 ఎకరాలలో ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణాలకు సంబంధిత శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకి ఎంపీ డాక్టర్ మల్లురవికి ప్రతిపాదనలు అందించారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అందుకు సానుకూలంగా స్పందించిన వనపర్తి నియోజకవర్గ పరిధిలో చేపట్టే నిర్మాణాలను వేగవంతంగా మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. వనపర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల అభివృద్ధిలో రాష్ట్రస్థాయిలోనే ముందు వరసలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని ఏ వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి పేర్కొన్నారు.

# ధరణి సమస్యలు వెంటనే పరిష్కరించండి

- విద్య, ఆరోగ్య, రైతుల సమస్యల పైన అధికారులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు
- మంత్రి జూపల్లి కృష్ణారావు

**వీపనగండ్ల, జులై 19 (జనం సాక్షి).**

వీపనగండ్ల మండల కేంద్రంలో రైతు వేదిక లో వివిధ శాఖల ఉన్నత అధికారులతో తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక పురావస్తు మరియు సాహిత్యం ద్వారా శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణ తల్లి సోనియమ్మ తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం రాజ్యాంగపరంగా తెలంగాణను ఏర్పాటు చేసిందని కానీ 10 సంవత్సరాలుగా కేసీఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల సంక్షేమం గాలి వదిలేసి తన కుటుంబ వరకే బాగుపడిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానం మేరకు ఆరు గ్యారంటీ పథకాలలో భాగంగా రైతుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని ఒక నెల ముందుగానే రైతు రుణమాఫీ చేయడం జరిగిందని అన్నారు. ఒకేసారి రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసే ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో రైతులకు రుణమాఫీ చేస్తాను అని చెప్పి విడతల వారిగ చెల్లిస్తూ చివరకు రైతులకు వడ్డీలు మాత్రమే చెల్లించారు అని అన్నారు. రైతులు తీసుకున్న అసలు మాత్రం రైతులే బ్యాంకులకు చెల్లించాల్సి వచ్చినది అన్నారు. విద్యార్థుల త్యాగాలతో వచ్చిన తెలంగాణను కెసిఆర్ కుటుంబం రాజ్యభోగాలు అనుభవించిందని అన్నారు. మరోసారి కేసీఆర్ మాయ మాటలో పడిపోకుండా ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించి ప్రజాపాలన తెచ్చుకున్నారు. కావున వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు ప్రజా సమస్యల పైన వెంటనే స్పందించి పరిష్కరించాలని చెప్పడం జరిగింది. ఈ ప్రజా పాలనలో అవినీతికి ఆస్కారం లేకుండా అధికారులు నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగిన వెంటనే ప్రజలను ఉద్దేశించి అన్నారు. సమస్యలు ఉన్నటువంటి ప్రజలు తమ సమస్యలను దరఖాస్తు రూపంలో అందజేస్తే వాటి పరిష్కారం చేస్తానని దరఖాస్తు దారులకు గుర్తు చేశారు. ప్రజల నుండి ఎక్కువగా భూమికి సంబంధించిన సమస్యల గురించి వస్తున్నాయని రెవిన్యూ అధికారులు రికార్డును చూసి పూర్వాపరాలు పరిశీలించి పూర్వం నుంచి మోకా మీద ఎవరు సాగు చేస్తున్నారో చూసి నిష్పక్షపాతంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని తహసిల్దార్ వరలక్ష్మికి సమావేశంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టమైన సూచనలు చేశారు. మండలం లో బావి మోటార్లకు 5500 కరెంట్ కనెక్షన్లు ఇవ్వడం జరిగిందని విద్యుత్ అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు ఏ కనెక్షన్లు ఇచ్చిన ట్రాన్ఫారం మంజూరు చేసిన రైతుల తో లంచాలు తీసుకుంటే కఠిన చర్యలు ఉంటామని విద్యుత్ అధికారులను హెచ్చరించారు. అదే విధంగా విద్యుత్ కాంట్రాక్టర్లు తన వర్క్ ఆర్డర్లో ఉన్నటువంటి మొత్తం పనులు పూర్తి చేయాలని రైతులతో పునాది పనులు చేయించుకొని బిల్లులు పొందడం సరికాదని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి చెప్పారు. సాగునీటి ప్రాజెక్టు బీమా, జూరాల కు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే పరిష్కరించాలని ఎలాంటి నీటి కొరతలు లేకుండా చూడాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష చేసి పరిష్కారం కానీ సమస్యలను పరిష్కరించాలని అందుకు తగు అంచనాలను పంపాలని అధికారులకు మంత్రి సూచించారు. ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్, ఏ.పీ.ఎం బిచ్చన్న, ఎంపిటిసిల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్, మండల అధ్యక్షుడు గోదల బీరయ్య యాదవ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, సుదర్శన్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు నక్క విష్ణు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, పుట్ట గంగిరెడ్డి, సుదర్శన్ రెడ్డి, రఘునాథరెడ్డి, బాల్ రెడ్డి, ఎత్తం కృష్ణయ్య, ఎద్దుల చిన్నారెడ్డి, వైఎస్ వెంకటయ్య, ఎస్ రవీందర్ రెడ్డి,గోపి,కావలి మహేష్, ముంత రాజు, వివిధ గ్రామాలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.



# కోస్గి మండలంలో పర్యటించిన కలెక్టర్

**నారాయణపేట జిల్లా బ్యూరో( జనం సాక్షి):**

నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం జిల్లాలోని కోస్గి మండలంలో విస్తృతంగా పర్యటించారు.పర్యటనలో భాగంగా ఆమె గుండుమల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న రోగులు, గర్భిణీలతో మాట్లాడి అక్కడ అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలతో ఉన్న మాత శిశు సంరక్షణ కార్డులను పరిశీలించి, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కేంద్రంలోని స్త్రీల వార్డులో మంచాలపై బెడ్ షీట్లు లేకపోవడం, వార్డు అంతా అపరిశుభ్రంగా ఉండడం చూసిన కలెక్టర్ అక్కడి మెడికల్ ఆఫీసర్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆస్పత్రికి అవసరమైన మందులు ఉన్నాయా ? లేదా అని అడిగి ఏఏ మందులు అవసరమో ఇండెంట్ రాసి ఉన్నతాధికారులకు పంపించాలని సూచించారు.ఆసుపత్రికి సంబంధించిన ఔట్ పేషెంట్,ఇన్ పేషెంట్ల రిజిస్టర్ లను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ఆసుపత్రికి నిర్దేశించిన ప్రసవాల జాబితాను కలెక్టర్ పరిశీలించి చిన్న చిన్న కారణాలతో జిల్లా ఆసుపత్రులకు రెఫర్ చేయరాదని మెడికల్ ఆఫీసర్ కు చెప్పారు. కాన్పుల సంఖ్య ఎందుకు తక్కువ ఉన్నాయని వైద్యురాలిని, వైద్య సిబ్బందిని నిడదీశారు. ఈడీడీ క్యాలెండర్ ను ఫాలోఅప్ చేసుకోవాలన్నారు. పాముకాటు బాధితులను కూడా జిల్లా ఆస్పత్రికి ఎందుకు రెఫర్ చేశారని,అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకుంటే రిఫర్ చేసే పరిస్థితి ఉండదన్నారు.రిజిస్టర్ల నిర్వహణతో పాటు మెడికల్ వ్యర్థాల నిర్వహణ తీరు కూడా సక్రమంగా లేక పోవడానికి గమనించిన కలెక్టర్ వైద్య సిబ్బందిపై మండిపడ్డారు.డాటా ఎంట్రీని క్రమం తప్పకుండా చేయాలన్నారు.అనంతరం మండలంలో రైతు రుణమాఫీ పొందుతున్న రైతుల జాబితాపై మండల వ్యవసాయ అధికారితో చర్చించి, ఎంతమంది రైతులకు రుణమాఫీ డబ్బు జమ అయిందని అడిగి తెలుసుకున్నారు.వన మహోత్సవంలో భాగంగా ఆస్పత్రి ఆవరణలో మొక్కను నాటిన కలెక్టర్ కోస్గి మార్గంలో రోడ్డు పక్కన అవెన్యూ ప్లానింగ్ టేషన్ ను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. లక్ష్యం ప్రకారం మొక్కలు నాటకుండా నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని సంబంధిత సిబ్బందిని సున్నితంగా హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కోసిగి మండలంలోని బోగారం జిల్లా పరిషత్ పాఠశాలను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. 8, 9, 10వ తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. 8వ తరగతి విద్యార్థులతో సాంఘిక శాస్త్రంలోని ధ్రువ ప్రాంతాల పాఠ్యాంశాన్ని విద్యార్థులతో చదివించారు.కొంతమంది విద్యార్థుల అనుపస్థితి (అబ్సెంట్)పై ఆరా తీశారు. విద్యార్థులు పాఠశాలకు ఎక్కువ రోజుల పాటు హాజరు కాకపోతే క్లాస్ టీచర్ వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను పాఠశాలకు రప్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొందరు విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ లేకపోవడాన్ని చూసి అందరికీ యూనిఫామ్ లు ఇవ్వలేదా అని పాఠశాల హెచ్ఎం ను ప్రశ్నించారు. ఒకరిద్దరు విద్యార్థులు తమ సైజు కు సరిపడా యూనిఫామ్‌లు లేవని కలెక్టర్‌కు తెలపడంతో స్పందించిన ఆమె వెంటనే వారి కొలతలు తీసుకుని యూనిఫామ్ లు కుట్టించి ఇవ్వాలని ఆదేశించారు.6 వ తరగతి గదిలోకి వెళ్ళిన కలెక్టర్ అక్కడి డిజిటల్ తెరపై పాఠ్యాంశాలు బోధించే తీరును, విద్యార్థుల హెూంవర్క్ ను పరిశీలించారు.గతేడాది పదో తరగతి పరీక్షల్లో 82 శాతం ఉత్తీర్ణత ఉందని, ఈసారి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, పదో తరగతిలో కనీసం నలుగురు విద్యార్థులైనా 10 జీ పీ ఏ సాధించాలని ఆమె పదో తరగతి విద్యార్థులకు సూచించారు.తర్వాత పాఠశాల ఆవరణలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన కొళాయి, పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. మద్దూర్, కోస్గి మండలాల్లోని పాఠశాల లన్నింటిలో వారం రోజులలోపు నిర్మాణ పనులన్నీ పూర్తిచే యాలని ఏఈని ఆదేశించారు. అదే పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. కాగా జిల్లా పరిషత్ పాఠశాలలోనే ప్రాథమిక పాఠశాలను కొనసాగించడం వల్ల విద్యార్థులకు ఇబ్బందులు ఏర్పడుతు న్నాయని అక్కడే ఉన్న గ్రామ పెద్దలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఎస్సీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు.మన ఊరు – మనబడి ద్వారా ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులు జరిగాయని, ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా కొత్త పనులు చేస్తున్నారని, ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయించేందుకు ప్రయత్నిస్తానని గ్రామ పెద్దలకు కలెక్టర్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కోస్గి ఎంపీడీవో జయలక్ష్మి, గుండుమల్ తహసిల్దార్ భాస్కర స్వామి, పిఆర్ఏఈ విలోక్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



# హామీలను వెంటనే అమలు చేయాలి

- ఆరు గ్యారంటీలు, అందులోనే 13 హామీలు, ఎన్నిటిని అమలు చేశారు..?
- ఏం సాధించారని కాంగ్రెస్ సంబరాలు జరుపుకుంటుంది..?
- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సోంశేఖర్ గౌడ్

**కృష్ణ జూలై 19 (జనం సాక్షి)**

కృష్ణ మండల బిజెపి నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విడుదల చేసిన రుణ మాఫీలో కోతపెట్టి రైతులను మోసం చేసినందుకా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఎకరాకు 15 వేలు రైతు బందు ఇస్తామని చెప్పి రభీ, ఖరీఫ్‌లో రైతు బందు ఎగొట్టినందుకా, వరికీ 500 బోనస్ ఇస్తామని ఇవ్వకుండా పంట నష్ట పరిహారం ఇవ్వకుండా రైతులను మోసం చేసి సంబరాలు చేస్తారా అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సోంశేఖర్ గౌడ్ అన్నారు. 100 రోజుల్లో 6 గ్యారెంటీలు 13 హామీలు, అమలు చేస్తామని చెప్పి అటకెక్కించారు. మహిళలకు నెలకు 500 గ్యాస్ లేదు, మహిళలకు 2,500 ఇవ్వలేదు,వృద్దులకు 4 వేలు పెన్షన్ ఇవ్వలేదు,ఇంటికి ఉచిత విద్యుత్ లో మోసం ప్రజపాలనలో దరఖాస్తులు తీసుకోని ఆన్లైన్ లో నమోదు చేయకుండా ఎంపీడీఓ ఆఫీస్ ల చుట్టూ తిప్పుతూ ఇలా అన్నింటా మోసం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ది పొందెందుకే రైతు సంబరాలని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త డ్రామాకు తేరలేపరని చెప్పారు. మహిళలకు, నిరుద్యోగులకు, రైతులకు ఇలా అన్ని వర్గాల వారికీ ఇచ్చిన హామీలను నెరవేర్చక పోతే ప్రజా క్షేత్రంలో బీజేపీ తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడతామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి. అవినీతి అక్రమాలకు, వ్యతిరేకంగా బిజెపి పని చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మజ్జిగ సురేష్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.శ్రీనివాస్ లు, నల్లే నర్సప్ప, దండు రాఘవేంద్ర, నారాయణ బట్ పాల్గొన్నారు.



## సమస్యల వలయంలో కోటకొండ సబ్ సెంటర్

**నారాయణపేట జిల్లా బ్యూరో( జనం సాక్షి)**

నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యల వలయంలో కోటకొండ సబ్ సెంటర్ ఉంది అని గ్రామ ప్రజలు అన్నారు.సబ్ సెంటర్ కి మహిళలు గర్భిణీలు పిల్లల వ్యాక్సిన్లు వేసుకోవడానికి వస్తుంటారు. కానీ వర్షాకాలం వచ్చిందంటే అక్కడికి వెళ్లాలంటేనే భయమేస్తుంది, సబ్ సెంటర్ మొత్తం నీళ్లతో తడిచిపోయి విద్యుత్ షాక్ వస్తుంది. అక్కడ పనిచేసే ఆశ వర్కర్లు భయంతో పిల్లలని బాలింతలని భయంతో వ్యాక్సిన్లు చేస్తున్నారు. ఎన్నిసార్లు జిల్లా వైద్యాధికారులకు చెప్పిన పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోని సబ్ సబ్ సెంటర్ బాగు చేయాలని లేదా కొత్త సెంటర్ కట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## కాంగ్రెస్‌లోకి బారీ చేరికలు

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

కాంగ్రెస్ అమలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మహబూబ్ నగర్ పట్టణంలోని 37వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఖాలీద్, షకీల్‌ల ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు శుక్రవారం మ హబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే హామీల అమలను చూసి ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాం గ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రదాన కార్యదర్శి వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయిబాబా, ఐఎన్టియుసి రాములు యాదవ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రైతు రుణమాఫీ అంటూ లింకులు వస్తే ఓపెన్ చేయకండి
- డిఎస్పీ లింగయ్య

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

సైబర్ నేరగాళ్ల మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఇటీవల కాలంలో సైబర్ మోసాలు అధికమవడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒక ప్రకటనలో నారాయణపేట డీఎస్పీ ఎన్ లింగయ్య తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం నేపథ్యంలో కొందరు సైబర్ నేరస్థులు ఎదో ఒక బ్యాంకు పేరిట, వాట్సప్ ప్రొఫైల్ బ్యాంకు పేరు మరియు బ్యాంక్ పిక్చర్ లోగోతో వాట్సాప్‌లో ఎపిక్ ఫైల్స్ పంపిస్తున్నారనీ తెలిపారు. దీన్ని మనము ఆమోదం చేస్తే మన వాట్స్ యాప్ వాళ్ళ కంట్రోల్‌కీ వెళ్లి పోతుందన్నారు. అంతే కాకుండా మన కాంటాక్ట్స్‌లో వున్న ప్రతి ఒక్కరికి మెసేజ్ వెళ్ళున్నదన్నారు. దీని ద్వారా సైబర్ నేరస్థులు మన గూగుల్ పే,ఫోన్ పేయుపీఐ ద్వారా డబ్బులు దోచేస్తున్నారనీ వివరించారు. ట్రేండింగ్‌లో వున్న టాపిక్ ద్వారా ఎపికే ఫైల్స్ పంపి డబ్బులు కొట్టేస్తున్నారన్నారు. దాంతో అందరికి మనవి చేసేది ఏమంటే ఏదయినా గుర్తించదగని ఎపికే ఫైల్స్ వస్తే మీరు ఎట్టి పరిస్థితిలో ఓపెన్ చెయ్యకూడదన్నారు. మీ వాట్స్ యాప్ పనిచేయకుంటే వెంటనే రిఇంస్టాల్ చేసి రిపోర్ట్ ఆప్షన్‌లో రిపోర్ట్ చెయ్యండనీ సూచించారు. ఎవరైనా ఏదయినా నేరానికి గురి అయితే వెంటనే ఎలాంటి ఆలస్యం చెయ్యకుండా 1930కీ కాల్ చెయ్యండి రిపోర్ట్ చెయ్యండి. ఎవరైనా సైబర్ నేరానికి గురి అయినట్లయితే వీలైనంత తొందరగా దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కి రిపోర్ట్ చేయడం ద్వారా మీరు కోల్పోయిన డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.





## సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు మత్స్య కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే మెగా రెడ్డి

**పెబ్బేరు జూలై 19 (జనం సాక్షి)**

పెబ్బేరు మండల కేంద్రంలోని మత్స్య కళాశాలను శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సందర్శించారు. కళాశాల అధ్యాపక బృందం పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సమస్య డంపింగ్ యార్డ్, విద్యార్థులకు రాకపోకలకు సంబంధించి బస్ స్టాప్ కళాశాలకు రహదారి కి ఇరువైపుల వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కళాశాలకు సంబంధించిన సమస్యలకు సంబంధించిన ప్రతిపాదనలను తయారుచేసి ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు ఉద్యోగం కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మత్స్య కళాశాలలో చదువుకున్న విద్యార్థులకు సైతం ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆయన వారికి సూచించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన చేపలు పెంపకం పాండ్స్‌ను ఆయన సందర్శించి చేపల పెంపకం వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, రంజిత్ కుమార్, సురేందర్ గౌడ్, వెంకటేష్, రాజశేఖర్, వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఐఐటీ విద్యార్థిని సన్మానించిన నిరంజన్ రెడ్డి

**వనపర్తి, జూలై19 (జనంసాక్షి):**

ఉత్తరాఖండ్ రాష్ట్రం రూర్కి పట్టణంలో ఐఐటీ (సివిల్ ఇంజినీరింగ్)లో సీటు సాధించిన తాటిపాములకు చెందిన కె.గోపాల్ అనే విద్యార్థి ని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శుక్రవారం సన్మానించారు. ప్రోత్సాహకంగా 3000 రూపాయలు అందజేశారు. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడి చదవి ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు మన ప్రాంతానికి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి పాల్ పాట్లాడుతూ కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుకులాల్లో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పడం వల్లనే తాను సీటు సాధించినానని అందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందిమల్ల అశోక్, ప్రేమ్ నాథ్ రెడ్డి, నందిమల్ల సుబ్బు, అరుణ్ యాదవ్, చిట్యాల రాము, యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**బిజినేపల్లి జులై 19 (జనం సాక్షి)**

బిజినపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ శుక్రవారం నాడు ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలోనే సాంఘిక గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి తల్లి పెద్దాపురం నుండి తన కొడుకును చూసేందుకు రెండు సంవత్సరాల ఆమె మనుమడు సహస్రతో కళాశాలకు వచ్చిన సందర్భంగా రెండు సంవత్సరాల బాలుడికి ఆకస్మికంగా ఫీడ్స్ రావడంతో బిజినపల్లి ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. అదే సమయంలో జిల్లా కలెక్టర్ అక్కడే ఆసుపత్రి తనిఖీ చేస్తూ విద్యార్థిని గమనించి వివరాలు అడగక తన అక్క కొడుకుకు ఫిట్స్ రావడంతో ఇక్కడికి తీసుకురావడం జరిగిందని, జర్నల్ ఆసుపత్రిలో స్కానింగ్ నిర్వహించి వెంటనే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అదే సమయంలో అందుబాటులో ఉన్న అంబులెన్స్ గంగారం వెళ్లడంతో బిజినపల్లి ఎమ్మార్వో కారులో నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడ చికిత్స అందించేందుకు బాలుడి వెంట వైద్య సిబ్బందిని పంపించారు. వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ 1000 రూపా యల నగదును ఆ మహిళకు అందజేశారు. పూర్తి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నాగర్ కర్నూల్ జర్నల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

# ఆదాయ పన్ను రిఫండ్ అక్రమ మార్గాలొద్దు

- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు
- ఐటీ అదనపు కమిషనర్ సుమిత పరమట, ఐఆర్ఎస్

**వనపర్తి బ్యూరో జులై 19 (జనంసాక్షి)**

ఆదాయ పన్ను రిఫండ్ కు అక్రమ మార్గాలను అనుసరించొద్దని, సక్ర మంగా పన్ను చెల్లించి దేశాభివృ ద్ధికి సహకరించాలని ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్ సుమిత పరిమట అన్నారు. శుక్రవారం ఐడిఓసి వనపర్తి కార్యాలయంలో ఉద్యోగులకు ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు అంశంపై ఏర్పాటు చేసిన ఒకరోజు వర్క్ షాప్‌కు ఆమె జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె వివరిస్తూ ఆదాయ పన్నులో మినహాయింపులకు ప్రభుత్వం వివిధ పథకాలతో ఉద్యోగులకు అవకాశం కల్పించినా సద్విని యోగం చేసుకోవటం లేదన్నారు. చాలా మంది 500 ఉద్యోగులు పన్ను మినహాయింపు పొందేందుకు రిటర్నుల్లో తప్పుడు సమాచారం నమోదు చేస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. ఢిల్లీ. మహారాష్ట్ర రాష్ట్రాల్లో 20 శాతం, 30 శాతం రిఫండ్ తీసుకుంటుంటే, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో మాత్రం చాలామంది 90 నుంచి 100 శాతం రిఫండ్ చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ రేంజ్-5 పరిధిలో తప్పుడు వివరాలు సమర్పించిన రిటర్నులు 14వేలు గుర్తిస్తే అందులో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో 10,635 ఉన్నాయని తెలిపారు రిపండ్ ఇప్పించి 5, 10 శాతం కమీషన్లు పొందేందుకు ఐటీ ప్రాక్టీషనర్లు తప్పుడు పత్రాలు సమర్పిస్తున్నారని, ఇలాంటివి పట్టుబడితే ఉద్యోగులే తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. ఉద్యోగులకు వచ్చే మూల వేతనం వివరాలన్నీ తమ వద్ద ఉన్నాయని, పలు వురు తమ వేతనాలను తక్కువ వేసి రిటర్న్) ఫైల్ చేస్తున్నారని, ఇలాంటి వారిపై చర్యలు తప్ప వని పేర్కొన్నారు. వారంతా తమ ఆదాయ పన్ను వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, లేక పోతే అక్రమంగా రిఫండ్ చేసిన సొమ్ముతో పాటు 1.30 వరకు వడ్డీ, 200 శాతం జరిమానా విధిస్తామని హెచ్చరించారు. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఆదాయ పన్ను శాఖకు సమర్పించిన పత్రాల్లో తప్పులు ఉంటే సవరించి మళ్లీ సమర్పించాలని సూచిం చారు. ఇందుకు వచ్చే ఏడాది మార్చి 31 వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తప్పుడు వివరాలు సమర్పించిన చాలా మంది ఉద్యోగులను గుర్తించి నోటీసులు, ఎస్ఎంఎస్ పంపించామని చెప్పారు. ఏటా ఆదాయ పన్ను వివరాలను జులై 31వ తేదీ వరకు సమర్పించాలన్నారు. ఐటీ ప్రాక్టీ షనర్స్ నమ్మి మోసపోవద్దని, సందేహాలు ఉంటే తమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ప్రభు త్వానికి సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ వర్క్ షాప్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్, ఆదాయ పన్ను శాఖ జిల్లా అధికారి మంగళవారపు మనోజ్ కుమార్, జిల్లా అధికారులు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.





# 'నైపుణ్యతే' పెన్నిధి



ఉదయం నిద్ర లేచి , రాత్రి పడుకునే వరకు మనకు ఎన్నో అవసరాలు ఉంటాయి. మానవుడు సంఘజీవి. మనతో సమాజానికి సమాజంతో మనకు అవినాభావ సంబంధం ఉంది. ఈ మానవ సంబంధాలు వసుధైక కుటుంబం గా ఉండడానికి సహకరిస్తున్నాయి.ఏ ఇంటి ప్రత్యేకత ఆ ఇంటికి ఉండేది. పలానా వారు పలానా ఊరు అని చెప్పుకునే స్థాయికి కొందరి పేర్లతో, ఇంటి పేర్లు, ఊర్ల పేర్లు ,జిల్లా పేర్లు, నిలిచాయి. అది వారిలో ఉండడం ప్రత్యేకత. వారిలో ఉండే కళా పోషణ .సామర్థ్యం.ఆ కలనే నెడు నైపుణ్యం స్కిల్ అని పిలుస్తున్నాం. ఉదయం లేవగానే చేసే ప్రాణాయామం మొదలు రాత్రి పడుకునే వరకు ఏదో ఒక వ్యక్తిగత కార్యక్రమాలు నిర్వహించాలి. కుటుంబ పోషణ చేసుకుంటూ మన వల్ల సమాజానికి ఎంతో కొంత సేవ చేయడం అనేది "మానవసేవయే మాధవసేవగా" గుర్తింపు తెచ్చింది. వస్తు వినియోగం మొదలు ఆర్థిక వినియోగము సర్దుబాటు వరకు అంతా ఒక కళా నైపుణ్యం. మన ఇష్టంతో చేసే పనుల్లో అవి ఎంతటి కష్టానైనా మనం చూడము. వాటికి ఎలాంటి సాధన అవసరం లేదు. ఇష్టం లేని పనులను కూడా ఇష్టంగా మార్చుకోవాలి అంటే అందుకు ఒక సాధన అవసరం. సాధనమున పనులు సమకూరు ధరలోన అన్నట్లుగా, నేటి యువతకు సాధన గురించి వారి వారి వృత్తి పనుల్లో నైపుణ్యాన్ని కలిగించడం కోసము× యూత్ స్కిల్ డే గా జులై 15 ని ప్రపంచ



యువజన నైపుణ్య దినోత్సవం గా జరుపుకుంటుంది.×మిషన్ 20 22 నాటికి భారతదేశంలో 30 కోట్ల మందికి పైగా వివిధ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేందుకు 2015 నరేంద్ర మోడీ ప్రారంభించారు."అందరికీ న్యాయమైన మరియు విస్థిరమైన భవిష్యత్తు కోసం (టీవీ ఈ టి )ఈ సంవత్సరం థీమ్. శాంతి మానవహక్కులు మరియు సుస్థిర అభివృద్ధి కోసం విద్యపై సిఫార్సు,ఇది దాదాపు 50 సంవత్సరాల క్రితం యునైటెడ్ దేశాలు ఐక్యం చేసిన మునుపటి 1974 సిఫార్సుని నవీకరిస్తుంది. యువతులు మరియు పురుషులకు జ్ఞానం నైపుణ్యాలు మరియు, విలువలతో శాంతియుతంగా, నిర్మాణాత్మకంగా, జీవించడానికి వీలు కల్పించడం,ఉత్పాలక జీవితాలు వారిని బాధ్యతాయుతమైన ప్రపంచ పౌరులుగా నిమగ్నం చేయడం మరియు తీవ్రవాదం మరియు

హింసాత్మకత, తీవ్రవాదంతో సహా ఏ విధమైన దుర్వినియోగం, లేదా అవకతలను ఎదుర్కొనేలా చేయడం××నేటి యువత డైనమిక్ మరియు ముందుకు ఆలోచించేతరం వివిధ రంగాలలో మార్పు మరియు ఆవిష్కరణలు నడిపిస్తున్నారు నేటి యువతను నిర్వచించే అంశాలను వారి విలువలు ఆసక్తులు మరియు ఆధునిక ప్రపంచాన్ని వారు ఎలా నావిగేట్ చేస్తారు అని అర్థవంతంగా నిమగ్నం కావడానికి సహాయపడుతుంది.నైపుణ్యంనైపుణ్యం అనేది కార్యాచరణ. పనులను నిర్వహించడానికి జ్ఞానం ,సామర్థ్యాలు, మరియు సామర్థ్యాలను కలిగి ఉన్న పదం.జీవితం మరియు పని అనుభవాల ద్వారా నైపుణ్యాల అభివృద్ధి చెందుతాయి. కొన్ని

తెలివితేటలు ,శారీరక సామర్థ్యాలు ఆధారంగా, ఇతరుల కంటే సులభంగా వ్యక్తపరచుకుంటారు. నైపుణ్యాలను కూడా కొ లవవచ్చు. మరియు నైపుణ్య పరీక్ష ద్వారా స్థాయిలను నిర్ణయించవచ్చు. చాలా ఉద్యోగా లకు బహుళ నైపుణ్యాలు అవసరమవుతాయి.

**నైపుణ్యాలకు ఉదాహరణలు:**

ఉద్యోగ నైపుణ్యాలు,నాయకత్వ నైపుణ్యాలు,సంస్థాగత నైపుణ్యాలు,జీ వనపుణ్యాలు,అశాబ్దిక కమ్యూనికేషన్,శాబ్దిక కమ్యూనికేషన్,ఒప్పించడం ,చర్చలు,సాంకేతిక నైపుణ్యాలు, సంస్థ,అకౌంటింగ్,ఆర్థిక నైపుణ్యాలు,వినియోగదారుల సేవ,మెంటరిం గ్,కోచింగ్,పరిపక్వత,సహనం,నీతి శాస్త్రం ,విశ్వాసం ,విశ్వసనీయత,నిజాయితీ, సమగ్రత, దౌత్యం,గడువులను తీర్చగల సామర్థ్యం,నివేదించడం, మొదలైనవి.నిర్ణయం తీసుకోవడం, వినియోగించడం

క్లిష్టమైన ఆలోచన వ్యూహాత్మక ప్రణాళిక సంఘర్షణ పరిష్కారం. నిర్వహించే వ్యక్తులు సమస్యలు పరిష్కరించడం మంచి సలహాలను అందించడం శ్రద్ధగా వినడం శ్రద్ధ ఉత్పాదక సమావేశ నిర్వహించడం. డేటాను వర్గీకరించడం,సమన్వయం చేయడం,ప్రాజెక్టు నిర్వహణ,లక్ష్య నిర్ధారణ,సమాచార విశ్లేషణ,డిజిటల్ యోగ్యత,సూచనలను అనుసరించే సామర్థ్యం,రీజనింగ్ నైపుణ్యాలు,తర్కం,పట్టణం యొక్క అవగాహన ,మల్టీ టాస్కింగ్ ,అమలు నైపుణ్యాలు ,ఉత్పాదకత ,నియామక నిర్వహణ ,ఈవెంట్ సమన్వయం,ఆలోచనల సంస్థ ,ఫైలింగ్ రికార్డ్ షాపింగ్ ,వనరుల ప్రతినిధి బృందం,ఇన్వెంటరీ ,డేటా ప్రాసెసింగ్,సహకారం,ఉత్సుకత,పట్టుదల ,కమ్యూనికేషన్,అనుకూలత,డ్రైవింగ్ ,అభ్యసించడం,గృహ బడ్జెట్ తయారుచేయడం ,బ్యాలెన్స్ ఖాతాలు,ప్రాథమిక ఆర్థిక నైపుణ్యాలు ,శుభ్రపరచడం, భద్రపరచడం ×ఇంటిని నిర్వహించడం ,లాండ్రి ,మీకోసం ఇతరుల కోసం షాపింగ్ చేయడం, పేరెంటింగ్ ,పెయింటింగ్ ,చొరవ ,సఖ్యత ,ప్రేరణతో ఉండుట ,ఒత్తిడిని నిర్వహించడం ,సెన్స్ ఆఫ్ హ్యూమర్

నైపుణ్యాలను ఎలా మెరుగుపరుచుకోవాలి

ఎందులో నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలో మనకు మనమే గుర్తుంచుకోవాలి. నిజాయితీ గల లక్ష్యాలు మరియు మైలురాలను గుర్తించుకోవాలి. కోచ్ లేదా మెంటల్ ని గైడ్గా తీసుకోవాలి. మెరుగుపరచుకోవడానికి ప్రణాళికను తయారు చేసుకోవాలి. పురోగతిని పర్యవేక్షించుకోవాలి. ఉద్యోగానికి వెళ్ళినప్పుడు మన నైపుణ్యాలను హైలెట్ చేసుకోవాలి. వృత్తిపరమైన ప్రపంచంలో మీ నైపుణ్యాలు మీ ఆస్తులుప్రారంభం కోసం వర్క్ ఫోర్ట్ లోకి ప్రవేశించడానికి ముఖ్యంగా ఈ నైపుణ్యాలు వృద్ధి చేసుకోవాలి. కమ్యూనికేషన్ స్కిల్స్ లీడర్షిప్ స్కిల్స్ సమస్య పరిష్కార నైపుణ్యాలు టైం మేనేజ్మెంట్ ఇంటర్ పర్సనల్ స్కిల్స్ యాక్టివ్ లిజనింగ్ స్కిల్స్టీం వర్క్ క్రియేటివిటీ వివరాల శ్రద్ధ ×బాధ్యత కంప్యూటర్ నైపుణ్యాలు కస్టమర్ సర్వీస్ స్కిల్స్ డేటా విశ్లేషణ ప్రాజెక్టు మేనేజ్మెంట్ మార్కెటింగ్ ఎమోషనల్ ఇంటెలిజెన్స్ నెట్వర్కింగ్ క్రిటికల్ థింకింగ్ నెట్వర్కింగ్ సామర్థ్యాలు..ఇలా అన్నింటినీ సమన్వయ పరుచుకుంటూ మనలో ఉన్నటువంటి కళా నైపుణ్యాన్ని వెలికితీస్తూ, సమాజంలో ఒక బాధ్యతగల పౌరుడిగా, దేశ అభివృద్ధికి కృషి చేయాలి.



**- ఉషారాణి((పీజీటీ తెలుగు )**

# 'అల్ఫోర్స్'లో బోనాల జాతర



**కరీంనగర్ బ్యూరో, జులై 19 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రం సంస్కృతికి బంగారు నిలయం అని పండుగల పట్ల ఉత్సాహాన్ని పెంపొందించేది తెలంగాణ రాష్ట్రమేనని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్లో నిర్వహించినటువంటి బోనాల జాతరకు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు మహంకాళి మాతకు పూజా కార్యక్రమాన్ని ఆచరించారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి శ్రీదుర్గా దేవి చిత్రపటానికి బంగారు బోనానికి ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ... బోనాలు అమ్మవారి రూపాలుగా భావిస్తారని వారి అన్ని సమస్యలను పరిష్కరించుకుంటారని తెలుపుతూ మన రాష్ట్రంటోనే కాకుండా వివిధ రాష్ట్రాలలో బోనాలకు ప్రత్యేకత కల్పించారని చెప్పారు. నేటి కాలంలో చాలా మంది బోనాల పట్ల ఆసక్తిని ప్రదర్శించడమే కాకుండా వాటిలో పాల్గొనేందుకు చాలా శ్రద్ధ వహిస్తారని చెప్పారు. ప్రత్యేకంగా మన రాష్ట్రంలో బోనాల ఉత్సవాలు శాంతి శోభను విస్తరింపచేస్తుందని చెప్పారు. విద్యార్థులకు మన రాష్ట్ర సంస్కృతిని, కళలను ప్రత్యక్షంగా తెలియజేయటానికై నేడు బోనాల ఉత్సవాలను చాలా ఉత్సాహం, భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరిగిందని చెప్పారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి తల్లి పెద్దమ్మ దయ ఉంచమ్మ, దీవనలు ఇవమ్మ, అంబాభవాన్ని... జగదాంబ భవాన్ని శారదే, పోతరాజుల విన్యాసాలు ఆకర్షింపచేశాయి. పాఠశాల ప్రాంగణాన్ని వివిధ పూలతో, బెలున్లతో చాలా ఆకర్షనీయంగా అలంకరించారు. సుమారు 150 మంది వివిధ వేషాలతో విచ్చేసి పండుగ వాతావరణాన్ని తలంపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చొప్పదండి నవోదయ ఉత్తమ ప్రతిభ

**దక్షిణ భారతదేశంలో మూడో స్థానంలో నిలిచి రికార్డు సృష్టించిన విద్యాలయం**



**చొప్పదండి(జనంసాక్షి):** 2024- 2025 విద్యాసంవత్సరానికి చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయ దక్షిణ భారతదేశంలో మూడవ స్థానం సాధించి రికార్డ్ సృష్టించిందని నవోదయ ప్రిన్సిపల్ మంగతాయారు పేర్కొన్నారు. జూన్ 24 తేదీ నుండి జూన్ 26వ తేదీ వరకు జరిగిన దక్షిణ భారతదేశ ప్రిన్సిపాల్ కాన్ఫరెన్స్లో నవోదయ విద్యాలయ సమితి జాయింట్ కమిషనర్ రీజినల్ స్థాయి అవార్డును ప్రిన్సిపాల్ శ్రీమతి పి మంగతాయారు కి బహుకరించారు. ఈ సందర్భంగా మంగతాయారు మాట్లాడుతూ నవో దయ విద్యాలయంలో 10 12 తరగతుల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి మొదటి వరుసలో నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థులు సాధించిన అత్యుత్తమ ఫలితాలతోనే రీజినల్ స్థాయిలో చొప్పదండి నవోదయ విద్యాలయం మూడవ స్థానంలో నిలిచిందని ఆనందం వ్యక్తం చేశారు.ఈ ఫలితాలను సాధించిన అధ్యాపకులకు, సహకరించిన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు వెన్నంటి ఉండి ప్రతినిత్యం మమ్ములను ప్రోత్సహిస్తూ ముందుకు నడిపిస్తున్న విద్యాలయ చైర్మన్, జిల్లా కలెక్టర్ శ్రీమతి పమేల సత్పతి ఐఏఎస్,ఇతర జిల్లా అధికారులకు, పాత్రికేయ మిత్రులకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**ఎమ్మెల్యే మక్కన్ సింగ్ • ఫాం ఆయిల్ పారిశ్రామిక సముదాయానికి శంకుస్థాపన**

**గోదావరిఖని, జనంసాక్షి:** ఫాం ఆయిల్ సముదాయానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు ,శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి ఎం పి గడ్డం వంశి కృష్ణ ఎమ్మెల్యే లు విజయ రమణా రావు, ఎంఎల్ సి బానుప్రసాద్ ,కలెక్టర్ కోయ శ్రీ హర్ష ,ప్రోటోకాల్ చైర్మన్ హరహర వేణుగోపాల్, రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాగూర్ శంకుస్థాపన చేశారూ.రెడ్డి గార్డెన్స్ లో ఆయిల్ ఫామ్ రైతులతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ వ్యవసాయాన్ని చిన్న చూపుచూసిన గత ప్రభుత్వం..రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన టిఆర్ఎస్ ప్రభుత్వం..ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేస్తున్నాం.రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు ఆర్థికంగా బలపడతారు.భారతదేశంలో అత్యధికంగా ఆయిల్ ఫామ్ సాగు చేసే రాష్ట్రాలలో తెలుగు రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయి. ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం సహకరిస్తుంది. ఏటువంటి వాతావరణంలోనైనా ఆయిల్ ఫామ్ సాగు అనుకూలంగా ఉంటుంది. పది లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేయడానికి ప్రభుత్వం టార్గెట్గా నిర్ణయించింది.ఈ సందర్భంగా రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్ ను బి పవర్ హౌస్ స్థానంలో ఏర్పాటు చేయాలి మంత్రివర్యులను కోరిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్. ఈ కార్యక్రమంలో రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్పొరేటర్లు వివిధ విభజన అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు



## పరామర్శ

మంథని, (జనంసాక్షి): పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని వేంపాడు గ్రామములో మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐలి ప్రసాద్ తల్లి ఐలి కమల ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి శుక్రవారం దుద్దిల్ల శ్రీను బాబు హాజరై, చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## 8 కోట్ల ఉద్యోగాల సృష్టి.. మరో మోసం

అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం తీవ్రంగా విమర్శించారు. ప్రధాని మోడీ 'ఒకదాని తరువాత ఒకటిగా అబద్ధం చెప్పడం' ద్వారా యువత 'పుండుపై కారం చల్లుతున్నారు' అని ఖర్గే ఆరోపించారు. గడచిన మూడు నాలుగు సంవత్సరాల్లో ఎనిమిది కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించడం నిరుద్యోగితపై తప్పుడు కథనాలు వ్యాప్తి చేసేవారి నోళ్లు 'మూతపడ్డాయి' అని ప్రధాని మోడీ క్రితం వారం ఉద్ఘాటించిన నేపథ్యంలో ఖర్గే ఈ విమర్శ చేశారు. ఉపాధి కల్పనపై ఆర్బిఐ ఇటీవల విడుదల చేసిన నివేదికను ప్రధాని ఉటంకిస్తూ, ఎన్డిఎ ప్రభుత్వం సుస్థిరత, వృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని నొక్కిచెప్పారు.చిన్న, పెద్ద స్థాయి మదుపరులు ఎన్డిఎ మూడవ హయాంను ఎంతో ఉత్సాహంతో స్వాగతించారని ఆయన తెలిపారు. 'నరేంద్ర మోడీజీ! ఉద్యోగాలపై ఒకదాని తరువాత ఒకటిగా అబద్దాలు చెబుతూ మీరు యువత పుండ్లపై కారం చల్లుతున్నారు' అని ఖర్గే 'ఎక్స్' పోస్ట్లో విమర్శించారు. 'అందుకే ఆర్బిఐ ప్రశ్నార్థక డేటాపై మిమ్మల్ని ప్రశ్నించాలని మేము అనుకుం టున్నాం/ మీరు పది సంవత్సరాల్లో 20 కోట్ల ఉద్యోగాలు వాగ్దానం చేసి 12 కోట్లకు పైగా ఉద్యో గాలను ఎందుకు పరిహరించారు?' అని పేర్కొన్నారు.

# నిరాడంబరత, చిత్తశుద్ధి గల నేత చొక్కారావు

**రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.**



**కరీంనగర్ బ్యూరో, జులై 19 (జనంసాక్షి):** దివంగత మాజీ ఎంపీ ,మాజీ మంత్రి జువ్వాడి చొక్కారావు జయంతిని పురస్కరించుకొని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చొక్కా రావు చిత్రపటానికి పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపుభాస్కర్ రెడ్డి గార్లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి నివాళులు అర్పించినారు. అనంతరం నగరంలోని చొక్కా రావు విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ పార్లమెంటు ఇంచార్ వెలిచాల రాజేందర్ రావు, నియోజకవర్గ ఇన్చార్జి పురుమల్ల శ్రీనివాస్, నాయకులు వైద్యుల అంజన్ కుమార్ తదితరులు చొక్కా రావు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... చొక్కా రావు నాకు రాజకీయ గురువు అని కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్మన్ గా, కరీంనగర్ జిల్లా రీజియన్ కమిటీ చైర్మన్ గా ఈ జిల్లా అభివృద్ధికోసం కృషి చేసిన వ్యక్తి అనిచిరస్మరణీయులు, వారు నిరాడంబరత, చిత్తశుద్ధితో ఎక్కడా అవినీతికి తావు లేకుండా ప్రజా సేవ చేసి రాజకీయ జీవితంలో పూర్తి పారదర్శకత ప్రదర్శించిన వ్యక్తి అన్నారు. వారు అమరులై అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, చర్ల పద్మ, బోనాల శ్రీనివాస్, వెన్న రాజ మల్లయ్య, పడాల రాహుల్, చాడ గొండ బుచ్చిరెడ్డి ,కొరివి అరుణ్ కుమార్, గంట శ్రీనివాస్, కాడే శంకర్, గడ్డం విలాస్ రెడ్డి, పురం రాజేశం, ఎలగందుల మల్లేశం, లింగంపల్లి బాబు,మూల రవీందర్ రెడ్డి, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, కామెడ్డి రాంరెడ్డి, పడిశెట్టి భూమయ్య, బత్తిని చంద్రయ్య గౌడ్, దీకొండ శేఖర్, కోడూరి హరికృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖానా కు డాక్టర్ నియామకం

రామగిరి, జనంసాక్షి:మండలంలోని కల్వచర్ల పల్లె దవాఖానా డాక్టర్ గా మూల దేవేందర్ రెడ్డి ను నియమించారు. గతంలో పనిచేస్తున్న దీరజ ఐదు నెలల క్రితం ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్ళిపోయింది. గ్రామంలో డాక్టర్ లేక ఇబ్బందులు పడుతున్నామని తాజా మాజీ సర్పంచ్ గంట పద్మ వెంకట రమణా రెడ్డి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు దృష్టి కి తీసుకువెళ్ళారు. సంబధిత అధికారులను ఆదేశించగా నూతన డాక్టర్ గా మూల దేవేందర్ రెడ్డి నీ నియమించారు. ఈ సందర్బంగా తాజా మాజీ సర్పంచ్ గంట పద్మ వెంకట రమణా రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ వేము కనకయ్య లు శాలువా కప్పి సన్మానం చేశారు. గ్రామస్తుల ఇబ్బందులు తెలిపిన వెంటనే స్పందించి నూతన డాక్టర్ నియమానికి కృషి చేసిన మంత్రి శ్రీధర్ బాబు కు సర్పంచ్ గంట పద్మ వెంకట రమణా రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## మంత్రి శ్రీధర్‌బాబుకి ప్రత్యేక కృతజ్ఞతలు



రామగిరి, జనంసాక్షి: రామగిరి మండలం లద్నాపూర్ గ్రామం లోని రేణుక ఎల్లమ్మ దేవాలయం కు కరెంట్ సరఫరా చేయగలరని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తో లద్నాపూర్ గ్రామానికి చెందిన గౌడ సంఘం సభ్యులు మంత్రి కి విన్నవించగా,వెంటనే స్పందించి రామగిరి మండలం ఎన్ పి డీ డి ఎల్ ఇ ఈకి ఫోన్ చేసి మాట్లాడి కరెంట్ సరఫరా చేయగలరని ఆదేశించారు.వెంటనే స్పందించి రామగిరి మండలం శ్రీ రేణుక ఎల్లమ్మ గుడి కి కరెంట్ ఇప్పించిన శ్రీధర్ బాబుకు లద్నాపూర్ గౌడ సంఘం సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్..**

గోదావరిఖని, జనంసాక్షి:భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సి హెచ్ శ్రీ కాంత్ ఒక ప్రకటనలో కోరారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. మిగిలిపోయిన ఆహార పదార్థాలు బయట పడవేయకుండా ఇంటి ముందుకు వచ్చే పారిశుద్ధ్య వాహనానికి అందించాలని కోరారు. ఆహార పదార్థాలు బయట పడవేయడనీ వల్ల పందులు , కుక్కలు , దోమలు , ఈగలు పెరిగి అంటువ్యాధులు వ్యాపించడానికి ఆస్కారం ఏర్పడుతుందని అన్నారు. ఇంటి ఆవరణతో పాటు పరిసరాల్లో నీళ్ళు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎయిర్ కూలర్లు , టైర్లు , కొబ్బరి చిప్పలలో నిలువ ఉన్న నీటిని వెనీటనే తొలగించాలని సూచించారు. కాచి వడబోసి చల్లార్చిన సురక్షిత నీటినే త్రాగాలని కోరారు. జ్వర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యున్నిసంప్రదించాలని కోరారు. వర్షాకాలం దృష్ట్యా రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు . స్పెషల్ డ్రైవ్ లో భాగంగా కాలువల్లో పూడిక తొలగించి నీళ్ళు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకునీటున్నట్లు తెలిపారు.డివిజన్లలో చెత్త ఎప్పటికప్పుడు తొలగిస్తుండడంతో పాటు బ్లీచింగ్ , స్ప్రేయింగ్ , ఫాగింగ్ చేయిస్తున్నట్లు తెలిపారు. మురుగు నీటి గుంతలు , కుంటల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్నట్లు తెలిపారు. భూగర్భ మురుగు నీటి కుండీలు శిధిలమైన చోట మరమ్మత్తు చేయించి కొత్త మూతలు అమరుస్తున్నట్లు తెలిపారు. మూతలు లేని మురుగు నీటి కుండీలను గమనిస్తే నగర పాలక సంస్థ కార్యాలయంలో లేదా హెల్ప్ లైన్ ఫోన్ నెం : 9603666444 కు తెలపాలని కోరారు.



## హర్షవర్ధన్‌కు ఘన సన్మానం.

మల్లాపూర్ (జనంసాక్షి):మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన గణపతి హర్షవర్ధన్ రాజు అండర్ 12 రన్నింగ్ పోటీ లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రం స్వీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు అనంతరం వారు మాట్లాడుతూ హర్షవర్ధన్ లాంటి విద్యార్థి నేటి యువతరానికి ఆదర్శప్రాయమని మారుమూల గ్రామమైన చిట్టాపూర్ నుండి రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరచడం చాలా సంతోషించదగ్గ పరిణామమని రాబోయే రోజుల్లో అత్యుత్తమంగా ఆటలాడి తల్లిదండ్రులకు గ్రామానికి పేరు తేవాలని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు సురిగి శ్రీనివాస్ గౌడ్ రాజేష్ బంటి షెను భాయ్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు

## అమ్మ మాట అంగన్వాడి బాట

**మల్లాపూర్జులై19(జనంసాక్షి):** అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా వెంకటరావుపేట గ్రామంలో అంగన్వాడి ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు మూడు సంవత్సరాల పిల్లల నుండి ఐదు సంవత్సరాల పిల్లలను మన గ్రామంలోని అంగన్ వాడి సెంటర్లకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్ సెంటర్లో బాలింతలకు పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి శైలజ ఏఎన్ఎం కోమల అంగన్వాడి టీచర్లు సంధ్యారాణి జమున పద్మ ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
20 జులై 2024
తెలంగాణ

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**మెడికల్ ఆఫీసర్లు విద్యార్థులకు వైద్య సేవలు అందించాలి**

**జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వసతి గృహాలలో గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో మెడికల్ ఆఫీసర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి మెడికల్ ఆఫీసర్ ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి, జ్వరం వచ్చిన వారిని గుర్తించి వెంటనే చికిత్స అందించాలన్నారు. వైద్యాధికారులు తమ పరిధిలోని వసతి గృహాలను, గురుకుల పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వెంటనే వారికి చికిత్స అందించాలన్నారు. తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పరిశుభ్రత పాటించాలని, ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి పూల మొక్కలు, ఔషధ మొక్కలు పెంచాలన్నారు. జిల్లాలో సిజేరియన్ కాన్పుల యొక్క శాతం ఎక్కువగా ఉందని, కావాలని ప్రైవేట్ ఆసుపత్రులలో సిజేరియన్ సెక్షన్లు చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని అన్నారంఆసుపత్రుల యొక్క అనుమతులను రద్దు చేస్తామని, వైద్య ఆరోగ్యశాఖ వెంటనే అధిక సిజేరియన్ సెక్షన్ కాన్పులు నిర్వహిస్తున్న ఆసుపత్రులను గుర్తించుటకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి తనిఖీ నిర్వహించాలన్నారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి, చట్ట విరుద్ధ అబార్షన్ నిర్వహించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమీక్షలో వైద్య ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలను సమీక్షించి వైద్యాధికారులకు తగు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఇన్చార్జ్ డిఎంహెచ్ఓ డాక్టర్ డి.చంద్రశేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కోటి రత్నం, డాక్టర్ నాజియా తబస్సుమ్, మీడియా అధికారి అంజయ్య గౌడ్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి జిల్లాలో కుండపోతగా వర్షాలు

- పొంగి పొర్లుతున్న వాగులు వంకలు
- అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని అధికారుల సూచన





**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో (జూలై 19) జనంసాక్షి :**
గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు భద్రాద్రి కొత్తగూడెం తడిసి ముద్దయింది. జిల్లా వ్యాప్తంగా వానలు పడుతుండడంతో వాగులు వంకలు, డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. వర్ష కాలం ప్రారంభం అయిన నెల రోజుల తరవాత వరుణ దేవుడు కరుణించడంతో రైతుల మోములో ఆనందం కనిపిస్తుంది. పలు చోట్ల చెరువులు నిండడంతో తొలకరి వరి నాట్లు వేసేందుకు సిద్ధం అవుతున్నారు. మరో వైపు భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం అంతకంతకూ పెరిగి పోతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు నది ప్రవాహం పోటెత్తుతుంది. మరో మూడు రోజులు ఈ జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించడంతో ఇప్పటికే రెడ్ అలెర్ట్ జారీ చేశారు అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు బయటకు రావద్దని హెచ్చరికలు జారీ అయ్యాయి. గురువారం అశ్వరావుపేట నియోజక వర్గంలో కూలీలు వరద ప్రవాహంలో చిక్కుకుని తృటిలో పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ నేతృత్వంలో ప్రత్యేక హెలికాప్టర్ ఆ ప్రాంతానికి చేరుకుని ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహాయంతో బాధితులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఈ సంఘటనతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం నది పరివాహక ప్రదేశాల్లో నివసిస్తున్న స్థానికులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. అధికారులు పూర్తిగా సహాయక చర్యల్లో నిమగ్నం కావాలని జిల్లా కలక్టర్ పాటిల్ ఆదేశాలు జారీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్యం, దోమలు, పందుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.. ఆసుపత్రుల్లో సరైన బెడ్లు అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు ఇతర సిబ్బంది సేవలు నిరంతరం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. వరద ఉధృతి పెరిగే ప్రాంతాల్లో ప్రజలు సందర్శనకు వెళ్లకూడదని, సెల్ఫీల కోసం ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు...

# ప్రభుత్వ నిర్ణయం వల్ల అర్హులైన పేద రైతులకు తీవ్రంగా నష్టం..

**మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి**




**నిడమనూర్ జులై 19 జనంసాక్షి :**
రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల వల్ల అర్హులైన పేద రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని షరతులు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ వర్తింపజేయాలని మాజీ శాసనసభ్యులు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం నిడమనూరు మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధరణిలో లోపాల వల్ల రైతులకు పాసు పుస్తకాలు అందలేదని, ఇది ప్రభుత్వ లోపం అని దీని కారణంగా రుణమాఫీ వర్తింప చేయకపోవడం రైతుకు నష్టమేనని ఆయన అన్నారు. వ్యవసాయం కోసం తీసుకున్న అన్ని రకాల పంట రుణాలను ప్రభుత్వం చిత్తశుద్ధితో రుణమాఫీ చేస్తేనే ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంబమైంది కాబట్టి రైతు భరోసా డబ్బులు కూడా ప్రజల అకౌంట్లో వేసి పెట్టుబడులకు సాయపడాలని, రైతులు మరల దళారుల వద్దకు ప్రైవేటు వడ్డీ వ్యాపారు దగ్గర వెళ్లి దగాకు గురి కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యవసాయ రంగం అభివృద్ధికి నిపుణులతో సంప్రదించి సరైన వ్యవసాయ ప్రణాళికను రూపొందించి సమగ్రంగా పకడ్బందీగా అమలు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరు కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపల్లెకు పక్కా రహదారులనిర్మాణానికి కృషి

- ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నాం
- కనీస మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యత
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- రూ.4కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన
- జోరు వానలోనూ ఉల్లాసంగా శంకుస్థాపన కార్యక్రమాలు
- లక్ష్మీదేవిపల్లి ఏజెన్సీ గ్రామాల్లో అధికారులను పరుగెత్తించిన ఎమ్మెల్యే

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో (జూలై 19) జనంసాక్షి :**
మారుమూల గ్రామాలకు సైతం రహదారి సౌకర్యం కల్పించి, గ్రామీణులకు ప్రయాణ సౌకర్యం మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నానని, కొద్ది రోజుల్లోనే రహదారుల సమస్య లేని గ్రామాలు ఆవిష్కృతం అవుతాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం లక్ష్మిదేవిపల్లి మండల పరిధిలోని రేగళ్ల గ్రామ శివారులో రూ.3.50కోట్ల వ్యయంతో నిర్మించనున్న హైలెవల్ వంతెన నిర్మాణం, లోతువాగు-మాదిగపోలు గ్రామాల మధ్య రూ.12.00లక్షల వ్యయంతో నిర్మించనున్న చప్టా నిర్మాణానికి, రూ.25.00లక్షల వ్యంతో నిర్మించనున్న పెద్దతండా-మన్యతాండా కాజ్ వే నిర్మాణానికి , హేమచంద్రాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.13.50లక్షల వ్యయంతో నిర్మించనున్న సైన్సు ల్యాబ్ భవనానికి కూనంనేని శంకుస్థాపన చేశారు. జోరువానను సైతం లెక్క చేయకుండా అయన ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఏర్పాటైన సభల్లో మాట్లాడుతూ గ్రామీణ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇప్పటికే ఎన్ఆర్ఈజిఎస్, డిఎంఎఫ్టి, సిఎస్ఆర్ పథకాలు, వివిధ గ్రాంట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుతుతున్నాయని, త్వరలోనే గెలుపు ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గ సమగ్రాభివృద్దికి కట్టుబడి పనిచేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, పిఎసియస్ డైరెక్టర్, సీపీఐ మండల



కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాసరావు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఎమ్.వసంత, జగన్మోహన్ రావు, ధర్మరాజు, బోయిన విజయకుమార్, గోవిందు, కుంజా రాంబాబు, ఏఈ మోహన్, డీఈ రామకృష్ణ, ఈఈ వెంకటేశ్వర్లు, ఎంపిడివో చలపతిరావు, తహసీల్దార్ కే ఆర్ కే ప్రసాద్, ఎమ్ఈవో జుంకిలాల్, ఏఈ రఘురాం, హెచ్ఎం శ్రీనివాసరావు, స్థానిక నాయకులు దీటి లక్ష్మీపతి, ధనుంజయ్, జలీల్ పాషా, కోడి లింగయ్య, అమర్సింగ్, ఉదయ్ కుమార్, రాంబాబు, కంటెం శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, పూర్ణయ్య, బైకానీ కృష్ణ, ఉపేందర్, అర్జున్ రావు, గుండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతు రుణమాఫీకి సంబంధించి ఏవైనా మెసేజ్ లు,ఏపీకే ఫైల్స్ వస్తే ఓపెన్ చేయవద్దు

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**నల్గొండటౌన్, జులై 19(జనంసాక్షి):**
తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మకమైన రైతు రుణమాఫీ కార్యక్రమం నేపథ్యంలో ఇదే అదునుగా చూసుకొని కొంత మంది సైబర్ నేరస్థులు వివిధ బ్యాంకుల లోగోస్ వాట్సాప్ ప్రొఫైల్ పిక్స్ పెట్టి రైతు ఋణమాఫీ అంటూ ఏపీకే ఫైల్స్ లాంటి లింకులను పంపుతున్నారు, మరియు రైతు ఋణమాఫీ అంటూ ఫోన్ కాల్ చేసి ఓటీపీ లు అడిగి కూడా రైతుల అకౌంట్లో ఉన్న డబ్బులు ఖాళీ చేస్తున్నారు. కావున ఇలాంటి వాటిని నమ్మి మోసపోవద్దనీ మరియు ఎలాంటి వ్యక్తి గత సమాచారాన్ని అనుమానితు లకు తెలపకూడని,ఇటువంటి సమాచారం సంబంధిత బ్యాంక్ వారిని సంప్రదించి తెలుసుకోగలరని జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ఇటువంటి సైబర్ నేరానికి గురి అయితే వెంటనే హెల్ప్ లైన్ నంబర్ 1930 కీ కాల్ చేయడం. లేదా www.cybercrime.gov.inలో రిపోర్ట్ చేయడం లేదా సంబంధిత పోలీసు స్టేషన్లో రిపోర్ట్ చేయగలరని అన్నారు.

# పి.హెచ్.సి.లలో మెరుగైన వైద్యం అందించాలి..

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్..**



**మేళ్లచెరువు (జనంసాక్షి):**
సీజనల్ వ్యాధులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. శుక్రవారం మేళ్లచెర్వు లోని పి.హెచ్.సి.ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు పడుచున్నందున మలేరియా, డెంగ్యూ జ్వరాలు ప్రభలకుండా పి.హెచ్.సి.కి వచ్చే వారికి టెస్టు చేపట్టి రిపోర్ట్ ఆధారంగా చికిత్స అందించాలని, పి.హెచ్.సి ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. పి.హెచ్.సి లలో మందుల కొరత ఉండకూడదని మందుల స్టోర్ తో పాటు స్టాక్ వివరాలను పరిశీలించారు. తదుపరి సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించి ప్రతి ఒక్కరు హాస్పిటల్ లో అందుబాటు లో ఉండాలని సిబ్బంది కి సూచించారు. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పంప్ హౌజ్ నిర్మాణ స్థలంను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చింతలపాలెం మండలం వెల్లటూరు రెవిన్యూ పరిధిలో నిర్మించే ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పంపు హౌజ్ నిర్మాణానికి అవసరమయ్యే 68.28 ఎకరాల భూమిని పరిశీలించి త్వరిగతిన భూసేకరణ చేపట్టి పంపు హౌజ్ నిర్మాణంకు కృషి చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో హుజూర్నగర్ ఆర్.డి.వో. శ్రీనివాసులు,డాక్టర్ వేణు గోపాల్, మేళ్లచెర్వు తహసీల్దార్ జ్యోతి, చింతల పాలెం తహసీల్దార్ సురేందర్ రెడ్డి, అధికారులు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు పారదర్శకంగా పని చేయాలి

- ఇరిగేషన్ అధికారులు లిఫ్టు ,కాలువలు, లైనింగ్ పనులు పూర్తిచేయాలి
- మున్సిపల్ ఆదికారులు పారిశుధ్య పనులకు ప్రాముఖ్యతనివ్వాలి
- అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం
- ముత్యాల బ్రాంచ్ కెనాల్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్





**హుజూర్ నగర్ జూలై 19 (జనంసాక్షి):**
హుజూర్ నగర్ లో నీటిపారుదల, పురపాలక, రెవెన్యూ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. శుక్రవారం కలెక్టర్ విస్తృత పర్యటనలో భాగంగా ఎన్ హెచ్ పి కెనాల్ మునగాల రెగ్యులేటర్ బ్రాంచ్ పరిశీలించిన అనంతరం హుజూర్ నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో నీటిపారుదల, పురపాలక, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగష్టు నెల చివర కల్లా ఎన్ ఎస్ పి కెనాల్, లైనింగ్ పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ప్రతిపాదించిన 4 లిఫ్ట్ ఇరిగేషన్ పనుల మ్యాప్లను పరిశీలించారు. రెండు నియోజకవర్గాలలో నీటిపారుదల శాఖ పరిధిలో జరుగుతున్న పనులను వాటి పురోగతిని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఇంజనీరింగ్ అధికారులు లిఫ్ట్, కాలువ, లైనింగ్ పనులను సకాలంలో పూర్తిచేసి ఆయకట్టుకు నీరు అందించేలా కృషి చేయాలని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో విష జ్వరాలు ప్రభలుతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీలలో టాక్స్ కనెక్షన్ వేగం చేయాలని, షాపుల పరిధిని పెంచాలని కలెక్టర్ సూచించారు. టి యు ఎఫ్ ఐ డి సి వి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. అనంతరం హుజూర్ నగర్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తుల వివరాలను పరిశీలించి, దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా ఎప్పటికప్పుడు ఆన్లైన్ చేయాలని సిబ్బందికి సూచించారు. అంతకుముందు హుజూర్ నగర్ ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించి సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, ఇరిగేషన్ ఎస్ ఇ నరసింహారావు, తహసీల్దార్ నాగార్జున రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఇంచార్జ్ ఎంపీడీవో గిరిధర్, డిఈలు రవికాంత్, బిక్షం, రఘు, స్వామి, అమరేందర్, డిపిఓ శివ, మేనేజర్ యాకుబ్ పాషా, మున్సిపల్ ఏఈ మీరా, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హాలియ పి హెచ్ సి సీనియర్ అసిస్టెంట్ సస్పెండ్

**నల్గొండ బ్యూరో,జులై 19,(జనంసాక్షి) :**
ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైనందుకుగాను హాలియా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సీనియర్ అసిస్టెంట్ ఎస్.సురేందర్ ను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. విద్య వైద్య రంగాల ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని,విధుల పట్ల ఉద్యోగులు నిర్లక్ష్యం వహించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా హాలియా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయన హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొని సిబ్బంది హాజరు రిజిస్టర్,ఇతర రిజిస్టర్లు, వార్డు,ల్యాబ్ తదితరాలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారితో పాటు ఉప ఆరోగ్య కేంద్రాల ఇన్చార్జిలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాలకు ప్రతిరోజు వస్తున్న ఔట్ పేషెంట్ల వివరాలు,గర్భిణీ స్త్రీల నమోదు, ప్రసవాలు,మాత,శిశు సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు,తదిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామ ప్రాంతాలలో సీజనల్ వ్యాధులు వచ్చేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నందున వీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని,ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీటి పై ప్రజలకు అవగాహన కల్పించాలని,ఎవరైనా వ్యాధులకు గురైనట్లయితే తక్షణమే వైద్య సేవలందించేలా ఉండాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో మంచి వైద్యం అందించినట్లయితే ప్రజల మనసుల్లో స్థిరస్థాయిగా ఉండిపోతారని అన్నారు. ఆశ, ఏఎన్ఎంలు గ్రామస్థాయి లో బాగా పనిచేయాలని,ప్రతి గ్రామాన్ని తిరగాలని,అక్కడ శానిటేషన్,తాగునీటి పరిస్థితులు గమనించాలని, ప్రతి గ్రామంలో అంగన్వాడి ద్వారా గర్భిణి స్త్రీలు, బాలింతలు,చిన్నపిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, ఐరన్ మాత్రలను పరిశీలించాలని చెప్పారు. అలాగే ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వ ఆసుపత్రులలో నమోదయ్యేలా చూడాలని,వారు రెగ్యులర్గా ఆసుపత్రులకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఆరవ తరగతి విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో తెలుగు,ఇంగ్లీషును చదివించారు. అందరికీ రెండు జతల యూనిఫామ్ వచ్చాయా? పాఠ్య పుస్తకాలు ఇచ్చారా అని అడిగారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఎలా ఉందని..?గుడ్లు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. పిల్లలు బాగా చదువుకోవాలని సమాజంలో మంచి స్థానానికి రావాలని,ఇందుకు చదువు ఒక్కటే ఆయుధమని అన్నారు. తర్వాత ఆయన పదవ తరగతి గదిలోకి వెళ్లి పదవ తరగతి విద్యార్థులతో ఫిజిక్స్,ఇంగ్లీష్ పాఠ్యాంశాలను చదివించి అర్థాలను చెప్పమని అడిగారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్య ఇస్తున్నదని,డీఎస్సీ ద్వారా జిల్లాలోని పాఠశాలలకు మరింత మంది టీచర్లు వచ్చే అవకాశం ఉందని,అదేవిధంగా మనఊరు- మనబడి కింద పాఠశాలల్లో పనులు చేపట్టడం జరిగిందని,ఈ పనులన్నీ పూర్తయి పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు వస్తే నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించే అవకాశం కలుగుతుందని, అదేవిధంగా ఆస్పత్రుల ద్వారా సైతం మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం షెడ్డును,అలాగే భోజనాన్ని



తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం షెడ్ ను తాగునీరు సరఫరా చేసే కులాయిల వద్దకు మార్చాలని, అదేవిధంగా కొత్త కిచెన్ షెడ్డు కట్టించేందుకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా యూనిఫాంలో రావాలని,క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని,బాగా చదివి ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ వెంట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామకృష్ణ,జిల్లా పరిషత్తు హాలియా ఉన్నత పాఠశాల ఇంచార్జ్ హెడ్ మాస్టర్ శైలజ తదితరులు ఉన్నారు.



# ప్రతి ఎకరాకు నీరు అందేలా చూడాలి పునరుద్ధరణ పనులను కొనసాగించాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**



**హుజూర్నగర్ జూలై 19 (జనంసాక్షి):**
ప్రతి ఎకరాకు నీరు అందేలా చూడాలని అధికారులను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం నీటిపారుదల శాఖ, కోదాడ సర్కిల్ పరిధిలోని వివిధ నీటిపారుదల వనరుల పునరుద్ధరణ పనులపై సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్ నరసింహ రావు అధ్యక్షతన హుజూర్ నగర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పాల్గొని పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రెండు నియోజకవర్గాల పరిధిలో ఒక ఎకరా కూడా బీడు భూమిగా ఉండకుండా చూసుకోవాలని, నీటిపారుదల వనరులను పునరుద్ధరించి క్షేత్రస్థాయి అధికారులు నిత్యం పర్యవేక్షణ చేస్తూ పునరుద్ధరణ పనులను కొనసాగించాలని ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్య ధోరణి వహించొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే శ్రీనివాస్, డి ఈ ఈ, ఏఈ లు, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ పంట సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలి



- జిల్లాలో ఆయిల్ పామ్ సాగు 10 వేల ఎకరాలకు విస్తరించాలి
- ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలపై ప్రజా ప్రతినిధులు విస్తృతంగా ప్రచారం చేయాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



**సుల్తానాబాద్,జూలై 19(జనంసాక్షి) :** గత ప్రభుత్వం రైతులకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గిట్టుబాటు ధర కూడా కల్పించలేదని మండిపడ్డారు. రైతులు కాలర్ ఎగరేసుకున్న రోజు రావాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పెద్దపల్లిలో పర్యటించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు తదితరులు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు ఆర్థికంగా బలపడతారని అన్నారు. భారతదేశంలో అత్యధికంగా ఆయిల్ ఫామ్ సాగు చేసే రాష్ట్రాల్లో తెలుగు రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని వివరించారు. ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. దేశంలోనే మొదటిసారి రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసింది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశంసించారు. రైతు రుణమాఫీ చేయడానికి నాయకత్వం వహించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు. భారత దేశ చరిత్రలో మే 6 వ తేది 2022 లో ఇచ్చిన హామీని రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో అనంతరం రెడ్డి పంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన రైతుల సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రసంగించారు. ఇది కలనా నిజమా అని రైతులు అనుకుంటున్నారని, గత ప్రభుత్వం లక్ష రూపాయలు రుణమాఫీని నాలుగు, ఐదు విడుతలలో చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష రూపాయలు రుణమాఫీ ఒకసారి తరువాత లక్ష 50 వేలు, తరువాత 2 లక్షల రుణమాఫీ ఒకేసారి జరుగుతుందన్నారు. ఆయిల్ ఫామ్ కు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఉన్న అన్ని ఖర్చులూ పోగ లక్షల్లో ఆదాయం వస్తుందని, ఆయిల్ ఫామ్ లో అంతర పంటలు వేసుకోవచ్చని సూచించారు. 2 లక్షల 103 మెట్రిక్ టన్నుల ఆయిల్ మార్కెట్ జరుగుతుంటే బయటి దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నామని, రాష్ట్రంలో 2 లక్షల ఎకరాల పైన ఆయిల్ ఫాం పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, పెద్దపల్లి జిల్లాలో 45 వేల ఎకరాల్లో ఆయిల్ ఫాం పెట్టడానికి ఇక్కడ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరినీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్త బస్సులకు పెద్ద ఎత్తున డిమాండ్స్ వస్తున్నాయని, చాలా చోట్ల కొత్త బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, రేవంత్ రెడ్డి నాయకత్వంలోమూడు వేలకు పైగా నియామకాలకు ఆదేశాలు జారీ చేశామని, ఇప్పటికే వెయ్యికి పైగా బస్సులు కొనుగోలు చేశామని, మరో 1500 బస్సులు కొనుగోలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆర్థిక పరిపుష్టి శక్తి రైతన్న దగ్గరే ఉందని, రైతన్నలకు ఆర్థిక శక్తిగా ఎదగాలని, డిసెంబర్ 3 న గెలిచామని, 7 న మంత్రిగా ప్రమాణం చేశానని, 9న ఆర్టీసిలో మహిళలకు ఉచిత బస్సు అందించామని మంత్రి పొన్నం వివరించారు. ఇప్పటి వరకు 62 కోట్ల మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేశారని, 2100 కోట్లకు పైగా ఆర్టీసికి ప్రభుత్వం చెల్లించిందని, మహాలక్ష్మి పథకంతో ఆర్టీసి నష్టాలు లేకుండా నడుస్తుందని, పెద్దపల్లిలో ఆర్టీసి బస్సు డిపో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గోదావరి ఖని బస్సు స్టాండ్ రూపురేఖలు మారుస్తామని, ఆర్టీసి ఉద్యోగులకు పిఆర్సి ఇచ్చామని, 2013 నాటి పెండింగ్ బాండ్లు చెల్లించామన్నారు.

రైతును రాజుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. చెప్పిందే చేస్తాము చేసేదే చెబుతామనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మొదటి విడతలో లక్ష రూపాయల లోపు రుణమాఫీ చేశామని తెలిపారు. దయ్యాలు వేదాలు వల్లించినట్లు బీఆర్ఎస్ నాయకుల మాటలు ఉన్నాయని విమర్శించారు. రైతు ఆదాయం పెరగడానికి ఆయిల్ ఫామ్ సాగు తోడ్పడుతుందని అన్నారు. రూ.170 కోట్ల వ్యయంతో పెద్దరాత్ పల్లిలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 250 మందికి ప్రతేక్షంగా 500మందికి పరోక్షంగా ఉపాధి పొందుతారని అన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మించి టేలండ్ ప్రాంత రైతులకు నీరు అందిస్తామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.



## ఓసీపీ-2 గని మృత కార్మికులకు ఓసీపీ-1లో సంతాపం

**యైటింక్లయిన్ కాలని జూలై 19 (జనంసాక్షి):** సింగరేణి సంస్థ రామగుండం-3 ఏరియాలోని ఓపెన్ కాస్ట్-2 గనిలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఉప్పు వెంకటేశ్వర్లు, విద్యాసాగర్ కుటుంబాలకు సానుభూతి ప్రకటిస్తూ, రెండు నిమిషాలు మౌనం పాటించారు. శనివారం ఓసీపీ-1 ప్రాజెక్టు ఆవరణలో జరిగిన సంతాప సభలో కేంద్ర కమిటి సభ్యులు గడ్డం తిరుపతి యాదవ్ పాల్గొని మాట్లాడారు. ఇటువంటి ప్రమాదాలు భవిష్యత్తులో జరగకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. ఈ సంతాప సభలో గని మేనేజరు ఉదయ్ హరిజన్, రక్షణాధికారి కురపాటి శ్రీనివాసు, కార్మిక నాయకులు మల్లేష్ యాదవ్ (ఏఐటీయూసీ) పింగిళి సంపత్ రెడ్డి (టిబిజికేయస్), అధికారులతోపాటు గని ఉద్యోగులు పాల్గొన్నారు.

## కట్నపల్లిలో ఉచిత వైద్య శిబిరం

- ఇంటింటికి ఫీవర్ సర్వే
- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వైద్యురాలు పరహా మక్ నూన్



**సుల్తానాబాద్,జూలై 19(జనంసాక్షి) :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీటి నిలువలు ఇంటి ఆవరణలో లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యురాలు ఫరః మఖ్ నూన్ అన్నారు. శుక్రవారం మండలంలోని కాట్నపల్లి గ్రామంలో గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు అనుదీప్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా వైద్యురాలు ఫరః మాక్ వైద్య సిబ్బంది హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి దాదాపు 86 మంది ప్రజలకు వివిధ రకాల పరీక్షలను నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అంతేకాకుండా ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శంకర్ ,సూపర్వైజర్ వెంకట్ రెడ్డి ,ఏఎన్ఎంలు కవిత ,భారతి, ఆశా కార్యకర్తలు విజయలక్ష్మి ,లావణ్య ,అంగన్వాడి కార్యకర్తలు కనక లక్ష్మి ,స్వప్న గ్రామపంచాయతీ కారోబార్ వెంకటేశ్వర్లు తోపాటు తదితరులు ,పాల్గొన్నారు.

## అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది : జిల్లా కలెక్టర్





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 19 (జనంసాక్షి):** అంగన్వాడి కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు.కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కట్టకింది తండా అంగన్వాడి కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పిల్లలకు అక్షరాలు, అంకెలు, ఆటపాటలతో కూడిన విద్యను బోధించాలని సూచించారు. ఐదేళ్ల పూర్తయిన పిల్లలకు ప్రీస్కూల్ ధ్రువీకరణ పత్రాలు అందించాలని కోరారు. అంగన్వాడి కేంద్రంలో మరమత్తుల కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. గణితం, ఆంగ్లంలో విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పడంతో వారిని అభినందించారు. విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కట్టకింది తండాలో సురాయి చెరువు గతంలో 86 ఎకరాల శిఖం భూమి ఉండగా ప్రస్తుతం 40 ఎకరాలు మాత్రమే ఉందని 46 ఎకరాలు కబ్జాకు గురైందని రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. శిఖం భూమిని సర్వే చేసి హద్దులు పాతాలని వేడుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తక్షణమే చెరువు భూమిని సర్వే చేసి శిఖం భూమి అక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని ఎల్లారెడ్డి ఆర్డిఓ ప్రభాకర్ ను ఆదేశించారు. శిఖం భూమి సర్వే పూర్తి చేసి హద్దులు పాతాలని సూచించారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. విద్యార్థులతో మొక్కలు నాటించారు. మొక్కలు నాటడం వల్ల భావితరాలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా శిశు, మహిళా, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి బావయ్య, ఇంచార్జ్ జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్, ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బెంగళూరు-చెన్నై ఉపాధ్యాయ వర్క్ షాపులకు దూసి కౌండిన్య..



**రామగిరి, జనంసాక్షి:** వాణి సెకండరీ పాఠశాల ,సెంటినరీ కాలనీ, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు దూసి కౌండిన్య గారికి, కేంద్ర శాస్త్రీయ,పారిశ్రామిక పరిశోధన పరిషత్ రీజనల్ హెడ్ క్వార్టర్స్ -బెంగళూరు వారి ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఈనెల 23, 24 తేదీలలో నిర్వహించే ఉపాధ్యాయుల వర్కుషాప్ కు హాజరు కావలిసినదిగా ఆహ్వానం అందింది. ఈ వర్కుషాప్ లో కౌండిన్య గారు ఆటలు మరియు బొమ్మల సహాయంతో భౌతిక శాస్త్రాన్ని సులభంగా బోధించే పద్ధతులపై అక్కడి ఉపాధ్యాయులకు మరియు జూనియర్ లెక్చరర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇదే అంశం పై ఈనెల 25 ,26వ తేదీల్లో చెన్నైలో నిర్వహించనున్న ఉపాధ్యాయ కార్యశాలకు కూడా శిక్షకుడిగా తమిళనాడు ప్రభుత్వం నుండి ఆహ్వానం అందుకున్నారు.రెండు రాష్ట్రాల్లో నిర్వహించే ఉపాధ్యాయ కార్యశాలలకు, శిక్షకుడిగా ఆహ్వానం అందుకున్నందుకుగాను , పాఠశాల వ్యవస్థా పకులు దాసరి మనోహర్ రెడ్డి , ప్రధానో పాధ్యాయులు శ్రావణ్ కుమార్, పి.ఇ.టీ బొద్దుల.తిరుపతి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

## అంతటి అన్నయ్య గౌడ్ పుష్పలత ఆధ్వర్యంలో మంత్రులకు ఘన స్వాగతం..



**సుల్తానాబాద్, జూలై 19 (జనంసాక్షి) :** వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ఓదెల మండలం కాల్వ శ్రీరాంపూర్ మండలాలకు వెళ్తున్న రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ఆర్టీసీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ లకు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ ఉమ్మడి జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు అంతటి అన్నయ్య గౌడ్ పుష్పలత ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంతటి పుష్పలత అన్నయ్య గౌడ్ మాట్లాడుతూ రానున్న రోజులలో మంత్రుల సహకారంతో ఎంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారెంటీ పథకాల అమలులో భాగంగా విడతల వారీగా అమలు చేయడం జరుగుతుందని రైతు రుణమాఫీ లక్షలోపు నిధులు విడుదల చేసి సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారని కొనియాడారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆధ్వర్యంలో పెద్దపల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు మినుపాల ప్రకాష్ రావు ,దన్నాయక్ దామోదర్ రావు ,పన్నల రామన్న ,తిరుపతి, కుమార్, కిషోర్, వేగోళం అబ్బయ్య గౌడ్ ,చిలుక సతీష్ ,అమి రీ శట్టి రాజలింగం ,మోబి రఫీక్ చింతల రాజు ,రాజయ్య ,నన్ను ,దుగ్యాల సంతోష్ రావు ,గజ బీమ్ కార్ శ్రీనివాస్ ,కట్కూరి సుధాకర్ రెడ్డి ,మాజీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కల్వల శ్రీనివాస్ ,భూషణ వేణి సురేష్ గౌడ్, రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధి జైపాల్ రెడ్డి ,ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ ,గాదె సంపత్ రెడ్డి ,సాయి ది మహేందర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సాయంత్రం ఆరు తర్వాత ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు

తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎస్సై శ్రావణ్ కుమార్



**సుల్తానాబాద్,జూలై 18 (జనంసాక్షి) :** ఇకనుండి సాయంత్రం 6 దాటిన తర్వాత మానేరు పరివాహక ప్రాంతాల నుండి ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి ,ఎస్సై శ్రావణ్ కుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఇసుక ట్రాక్టర్ యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ప్రజల అవసరాల కోసం ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా జరుగుతుందని, కానీ ఇదే అదునుగా భావించి కొంతమంది రాత్రి వేళల్లో అక్రమ ఇసుక వ్యాపారం చేస్తున్నారని దృష్టికి వచ్చిన దృష్ట్యా, అక్రమ ఇసుక వ్యాపారాన్ని అడ్డుకట్ట వేసేందుకు సంబంధిత జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేసి ఇసుక ట్రాక్టర్లు యజమానులకు ఆదేశాలు జారీ చేసినట్లు వారు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో ఇసుక రవాణా చేస్తే ట్రాక్టర్ సీజ్ చేస్తామని తెలిపారు. నిబంధనలు అతిక్రమించొద్దని హెచ్చరించారు. మండలంలోని నీరుకుల్లా ,కదంబపూర్ ,గట్టేపల్లి ,గొల్లపల్లి ,తొగర్రాయి ,గర్రెపల్లి ,బొంతకుంట పల్లి గ్రామాల మానేరు పరివాహక ప్రాంతాల నుండి ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా కొనసాగుతోంది. పలు గ్రామాల ట్రాక్టర్ యజమానులు గమనించాలని తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ తిరుపతి తో పాటు రెవెన్యూ సిబ్బంది ఇసుక ట్రాక్టర్ల యజమానులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**ఎల్లారెడ్డిపేట, జూలై 19, (జనంసాక్షి) :** ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిన సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ ద్వారా పాదయాత్ర చేసి, టపాకాయలు కాల్చి, రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రైతుల కోసం అహర్నిశలు పాటుపడుతున్న రేవంత్‌రెడ్డి రైతులకు ఆపద్బాంధవుడని అన్నారు. రైతులను ధనవంతులుగా చేయడానికి వ్యవసాయం దండగ కాదు పండుగ అని నిరూపించడానికి ముఖ్యమంత్రి శతవిధాల ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ సాహెబ్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, లింగంగౌడ్, జిల్లా కిసాన్‌సెల్ ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గంట బుచ్చాగౌడ్, చెన్ని బాబు, రవీందర్‌రెడ్డి, సూడిది రాజేందర్, రాజునాయక్, వంగ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, అనవేని రవి, బాలగౌడ్, ఎండి ఇమామ్, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రఫీక్, నర్సయ్య, హైమద్ పాల్గొన్నారు.

## మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..

మహిళా సాధికారిత జిల్లా కోఆర్డినేటర్ రోజా



**ఎల్లారెడ్డిపేట, జూలై 19, (జనంసాక్షి) :** మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, అన్ని రంగాల్లో ముందుకురావాలని, ఆడపిల్లల రక్షణ కోసం మహిళలు కృషి చేయాలని మహిళ సాధికారిత జిల్లా కోఆర్డినేటర్ రోజా అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్‌లో శుక్రవారం మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో 100 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా మగ్గం వర్క్ ఉచిత శిక్షణ కేంద్రంలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా మహిళ సాధికారిత కేంద్రం కోఆర్డినేటర్ రోజా మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన చట్టాల గురించి, లింగ సమానత్వం, ఆడపిల్లల రక్షణ చట్టాల గురించి, బాల్య వివాహ నిరోధక చట్టం, పని ప్రదేశంలో మహిళలపై వేధింపులను ఆరికట్టే చట్టం, మహిళా హెల్ప్ లైన్ 181, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, భేటి బచావ్ భేటి పడావో గురించి వివరించారు. సఖి కేంద్రం నిర్వహకురాలు పద్మ మాట్లాడుతూ బాధిత మహిళలు గృహహింస, వరకట్న వేధింపులు, లైంగిక దాడులు, అక్రమ రవాణా, పని ప్రదేశాలలో లైంగిక దాడులు వంటి హింసలకు గురవుతున్నారన్నారు. మహిళలకు సఖి కేంద్రం ద్వారా అందిస్తున్నటువంటి వైద్య, న్యాయ కౌన్సిలింగ్, పోలీస్, తాత్కాలిక నివాసం, వంటి ఐదురకాలైన సేవలు ఉచితంగా 24 గంటలు అందుబాటులో ఉంటాయని సూచించారు. భరోసా కేంద్రం నిర్వాహకురాలు శిల్ప మాట్లాడుతూ భరోసా కేంద్రం యొక్క సేవలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మగ్గం వర్క్ శిక్షణ పొందుతున్న ఎల్లారెడ్డిపేట మహిళలు, డిహబ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మానసిక వికలాంగులకు అన్నదానం

**సుల్తానాబాద్,జూలై 19(జనంసాక్షి) :** మండల కేంద్రం లోని గాంధీనగర్ కు చెందిన కామ స్రవంతి కుమారస్వామి,రెండో కుమారుడు కామ సాయి దత్ జన్మదినాన్ని పురస్కరించుకొని మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో అన్నదానం నిర్వహించారు. మండల కేంద్రంలోని పునరావాస కేంద్రంలో విద్యార్థుల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించి పిల్లలకు చికెన్ తో అన్నదనం చేపట్టారు.ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, అన్నయ్య సన్విష్, తాత అమ్మమ్మ ఇందిరా సత్యనారాయణ, మామయ్య లు రమేష్, వెంకటేష్, సంజీవ్, సందీప్, యువ సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపకులు తుమ్మ రాజ్ కుమార్, సెంటర్ సిబ్బంది మిత్రులు పాల్గొన్నారు.





# సత్తా చాటిన పారా అథ్లెట్స్

**16 పతకాలు కైవశం**

**హైదరాబాద్, జూలై 19 (జనంసాక్షి) :** ఆదిత్య మెహతా ఫౌండేషన్‌లో శిక్షణ పొందిన నవోదయ విద్యాలయ సమితి పారా అథ్లెట్స్ సత్తా చాటారు. బెంగళూరులోని శ్రీ కంఠీరవ స్టేడియంలో జరిగిన 13వ జాతీయ జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో 16 పతకాలు సాధించారు. ఈ ఈవెంట్ జూలై 15 నుంచి 17వ తేదీ వరకు జరిగాయి. భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్వీ) సహకారంతో ఆదిత్య మెహతా ఫౌండేషన్‌లో శిక్షణ పొందారు. వీరు ఎక్సలెన్స్ జేఎన్వీ రంగారెడ్డి సెంటర్‌లో ఉంటున్నారు. ఆదిత్య మెహతా ఫౌండేషన్‌కు చెందిన ఇన్ఫినిటీ పారాస్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా ఆదిత్య మెహతా ఫౌండేషన్ కోచ్, వ్యవస్థాపకుడు ఆదిత్య మెహతా మాట్లాడుతూ ఈ విజయం అపూర్వమైనదన్నారు. యువ పారా-అథ్లెట్ల అంకితభావానికి నిదర్శనమన్నారు. ఆదిత్య మెహతా ఫౌండేషన్ పారాథ్లెట్‌లను గుర్తించి.. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణించేందుకు అవసరమైన వనరులు, శిక్షణను అందించడానికి కట్టుబడి ఉందన్నారు. ఇప్పటివరకు సాధించిన పురోగతిపై గర్వంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తామని తెలిపారు. ఆదిత్య మెహతా ఫౌండేషన్ శ్రేయోభిలాషులు, స్పాన్సర్‌లు - యూఎస్టీ, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్, జీఎంఎంసీఓ, ఎన్ఎండీసీ, ముద్రా ట్రస్ట్, నిర్మాణ్, ఆల్కాన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంకెన్నాళ్లు..బాధను దిగమింగి

# నవ్వుతూ పోరాడాలి?



**న్యూఢిల్లీ, జూలై 19 (జనంసాక్షి) :** హార్దిక్ పాండ్య! అతనికి టైమ్ ఏ మాత్రం కలిసిరావట్లేదు. ఒక్కసారిగా కెరీర్, వ్యక్తిగత జీవితంలో కష్టాలు చుట్టుముట్టాయి. తానే భవిష్యత్ భారత్ కెప్టెన్ అని మొన్నటివరకు చెప్పిన బీసీసీఐ ఇప్పుడు రోహిత్‌కు కొత్త వారసుడిని ప్రకటించింది. అంతేకాదు, హార్దిక్‌ను కనీసం వైస్‌కెప్టెన్‌గా కూడా ఎంపికచేయలేదు. మరోవైపు తన భార్య నటాషాతో విడిపోవాల్సి వచ్చింది. టీ20 వరల్డ్ కప్ విజయంతో తిరిగి తన లైఫ్ మళ్లీ చక్కపడుతుందని అనుకున్న సమయంలో హార్దిక్‌కు వరుసగా ఇలా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. హార్దిక్ కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించట్లేదు. దీంతో హార్దిక్ ధైర్యంగా ఉండాలని నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. అయితే ఇప్పుడే కాదు, గత కొన్ని నెలలుగా హార్దిక్ పాండ్యనే హాట్ టాపిక్‌గా మారాడు. మీడియా, సోషల్ మీడియాలో అతని గురించే చర్చ సాగింది. వన్డే వరల్డ్ కప్-2023లో గాయపడటంతో సాఫీగ సాగే అతని జీవితం మలుపు తిరిగింది. ఈ స్టార్ ఆల్‌రౌండర్ టీమిండియాకు దూరమయ్యాడు. ఆ తర్వాత శస్త్రచికిత్స చేసుకోవడంతో తిరిగి పోటీ క్రికెట్ ఆడటానికి నెలలు పాటు వేచి ఉన్నాడు. ఎట్టకేలకు తిరిగి ఫిట్‌నెస్ సాధించుకున్నాడు. మరోవైపు గుజరాత్ టైటాన్స్‌ను రెండు సార్లు ఫైనల్‌కు చేర్చి, ఓ సారి ఛాంపియన్‌గా జట్టును నిలిపిన హార్దిక్ పాండ్య గుజరాత్ ఫ్రాంచైజీని వీడాడు. తిరిగి ముంబై ఇండియన్స్ గూటికి చేరాడు. అంతేగాక రోహిత్ శర్మ స్థానంలో ముంబై జట్టు పగ్గాలు అందుకున్నాడు. ఇది పూర్తిగా క్రికెట్‌కు సంబంధించిన విషయమైనప్పటికీ రోహిత్, ముంబై అభిమానులు హార్దిక్‌ను దారుణంగా మైదానంలో, బయటా అవమానించారు. ఇదిలా జరుగుతుండగా తన వ్యక్తిగత జీవితంతో ప్రకంపనలు మొదలయ్యాయి. అయినప్పటికీ ప్రేక్షకుల హేళనలు, అవమానాలు తట్టుకుంటూ మైదానంలో నవ్వుతూ ముందుకు సాగాడు. ముంబై జట్టులో సహచరుల నుంచి ఆశించినంత సహకారం లభించకపోయినా మౌనంగా ఉండిపోయాడు. టీ20 వరల్డ్ కప్‌లో తిరిగి టీమిండియా జెర్సీ ధరించాడు. తానంత విలువైన ఆటగాడు ప్రపంచ వేదికపై నిరూపించాడు. బౌలింగ్, బ్యాటింగ్‌తో భారత జట్టును ఎన్నో మ్యాచ్‌ల్లో గెలిపించాడు. 13 ఏళ్ల ప్రపంచకప్ నిరీక్షణకు తెరదించడంలో హార్దిక్ కీలకపాత్ర పోషించాడు. మొత్తంగా విమర్శించిన వాళ్లతోనే జైకొట్టించుకున్నాడు. ఈ క్రమంలో ఫైనల్‌లో విజయానంతరం హార్దిక్ భావోద్వేగానికి గురయ్యాడు. కన్నీళ్లతో తన బాధను వెల్లగక్కాడు. మరోవైపు రోహిత్ శర్మ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించడంతో హార్దిక్ పూర్తిస్థాయిలో పొట్టి ఫార్మాట్‌లో టీమిండియా బాధ్యతలు అందుకుంటాడని భావించారంతా. కానీ బీసీసీఐ షాక్ ఇచ్చింది. నయా కోచ్ గంభీర్, సెలక్టర్లు, రోహిత్ శర్మ లేదా జట్టులోని సభ్యుల ఆటగాళ్ల నిర్ణయమో తెలియదు కానీ.. హార్దిక్‌పై వేటు వేశారు. సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. దీంతో హార్దిక్ మరోసారి బాధను దిగమింగుతూ మళ్లీ నవ్వుతూ పోరాడాల్సిన సమయం వచ్చిందని స్టార్ ఆల్‌రౌండర్‌కు మద్దతుగా నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు.

# ఓ ఇంటివాడైన క్రికెటర్ దీపక్ హుడా



**న్యూఢిల్లీ, జూలై 19 (జనంసాక్షి) :** టీమిండియా క్రికెటర్ దీపక్ హుడా ఈనెల 15న ఓ ఇంటివాడయ్యాడు. దాదాపు నాలుగు రోజుల తర్వాత శుక్రవారం (19-07-2024) తన పెళ్లి ఫొటోలను ఇన్‌స్టాగామ్‌లో షేర్ చేశాడు. బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల మధ్యలో వివాహం జరిగినట్లుగా పేర్కొన్నాడు. కానీ తన భార్య పేరును మాత్రం బయటపెట్టలేదు. ఫొటోల్లో మాత్రం కొత్త జంట సంతోషంగా కనిపించారు. రెడ్ కలర్ డ్రస్‌లో నవదంపతులిద్దరూ మెరిసిపోయారు. హిందూ సంప్రదాయం ప్రకారం ఇద్దరి వివాహం జరిగింది. 29 ఏళ్ల దీపక్ హుడా హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన వాడు. ప్రేమికురాలిని వివాహం చేసుకునేందుకు దాదాపు తొమ్మిదేళ్లు నిరీక్షించాడు. తొమ్మిదేళ్ల నిరీక్షణ తర్వాత తమ కల నెరవేరిందని దీపక్ పేర్కొన్నాడు. కుటుంబ సభ్యులు, స్నేహితుల ఆశీర్వాదాలతో మా హృదయాలు నిండిపోయాయని హుడా వెల్లడించాడు. ఇక దీపక్ హుడా.. భారత్ తరఫున 21 టీ20లు, 10 వన్డేలు ఆడాడు. ఐపీఎల్‌లో ఎల్ఎస్‌జీలో ఆల్‌రౌండర్‌గా ఉన్నాడు. మొత్తానికి జూలై 15న ప్రేమ వివాహంతో ఓ ఇంటివాడయ్యాడు. హిమాచల్ అమ్మాయిను తన ఇంటిలోకి ఆహ్వానిస్తున్నానని తెలిపాడు.

# సూర్యకే ఓటేసిన ప్లేయర్స్!

**న్యూఢిల్లీ, జూలై 19 (జనంసాక్షి) :** రోహిత్ శర్మ టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలకడంతో వైస్ కెప్టెన్ అయిన హార్దిక్ పాండ్యా జట్టు పగ్గాలు అందుకోవడం ఖాయం అని అందరూ అనుకున్నారు. కానీ రోహిత్ స్థానంలో టీ20 సారథిగా సూర్యకుమార్ యాదవ్ ఎంపికయ్యాడు. దాంతో ప్రతి ఒక్కరు షాక్ అయ్యారు. అయితే ఇద్దరిలో ఎవరిని ఎంపిక చేయాలనే విషయంపై బీసీసీఐ సెలెక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ చాలా కసరత్తులు చేసిందట. రెండు రోజుల పాటు గంటలతరబడి సుదీర్ఘ చర్చలు అనంతరం నిర్ణయం తీసుకున్నారట. ప్లేయర్స్ అభిప్రాయం కూడా తీసుకున్నారట. భారత్ మరో వారం రోజుల్లో శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. జట్ల ఎంపిక కోసం బీసీసీఐ సుదీర్ఘంగా చర్చలు జరిపిందట. ముఖ్యంగా టీ20 ఫార్మాట్‌కు కెప్టెన్ విషయంలో. ప్లేయర్లలో ఎక్కువ మంది సూర్యకుమార్ యాదవ్ వైపే మొగ్గు చూపారని వార్తలు వస్తున్నాయి. 'శ్రీలంక పర్యటన కోసం జట్లను ప్రకటించేందుకు బీసీసీఐ తీవ్ర కసరత్తులు చేసింది. ఆటగాళ్ల అభిప్రాయాలు కూడా తీసుకుంది. ఎక్కువమంది హార్దిక్ పాండ్యా కంటే సూర్య సారథ్యంలో ఆడేందుకు ఆసక్తి చూపారు. రెండు రోజుల పాటు గంటలతరబడి సెలక్షన్ కమిటీ చర్చించింది. వాడీవేడిగా చర్చ జరిగింది.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో 23,779 మందికి రుణమాఫీ

- ఈ నెల చివరిలో రూ. 1.50లక్షల లోపు రైతులకు..
- ఆగస్టులోపు రూ. 2 లక్షలలోపు ఉన్నవారికీ రుణ మాఫీ



**మండలాలవారీగా లబ్ధిదారుల వివరాలు**

| మండలం | రైతులు |
|---|---|
| బోయినపల్లి | 1839 |
| చందుర్తి | 1687 |
| గంభీరావుపేట | 2820 |
| ఇల్లంతకుంట | 2732 |
| కోనరావుపేట | 2844 |
| ముస్తాబాద్ | 2404 |
| రుద్రంగి | 628 |
| సిరిసిల్ల | 375 |
| తంగళ్ళపల్లి | 2257 |
| వీర్నపల్లి | 1295 |
| వేములవాడ | 787 |
| వేములవాడ రూరల్ | 1228 |
| ఎల్లారెడ్డిపేట | 2477 |

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 18 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా రైతులకు రూ 2 లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం రైతుల రుణమాఫీ పై ప్రత్యేక దృష్టి సారించింది. రుణమాఫీ ఎప్పుడెప్పుడని రైతులు ఎదురు చూసారు. రుణమాఫీని ప్రభుత్వం గురువారం నాడు ప్రారంభించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలనూ ప్రభుత్వం జారీ చేసింది. తొలి విడతగా గురువారం రూ లక్ష లోపు రుణాలున్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమకానున్నాయి. రూ 1.50 లక్షలు వున్న వారికి జులై చివరి లోగా, మిగతా రూ.2 లక్షల లోపు వున్న రుణాలను ఆగస్టు 15 లోపు మాఫీ కానున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మండలాల వారీగా రైతుల వివరాలు సేకరించిన ప్రభుత్వం మండలాల వారీగా నోడల్ అధికారులను నియమించింది. వ్యవసాయాధికారుల ధ్రువీకరణతో తమ పరిధిలోని బ్యాంకుల్లో రుణాలు మాఫీ కాబోతున్నాయి. ఈ క్రమంలో రైతు రుణమాఫీ సంబురాలను కాంగ్రెస్ నాయకులు చేశారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 23779 వేల మందికి తొలి విడతలో రూ లక్షలోపు ఉన్న రైతులను గుర్తించారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు ఆయా మండలాల లోని రైతు వేదికలు, గ్రామపంచాయతీ భవనాల వద్ద రైతుల రుణ మాఫీ వివరాల జాబితాను ప్రకటించారు.రుణమాఫీ పొందే రైతులు వారి గ్రామాల్లోని ఆయా ప్రదేశాల వద్ద జాబితా సరిచూసుకోవాలని వ్యవసాయాధికారులు కోరారు. ఈ లబ్దిదారుల గుర్తింపునకు పలు మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రధానంగా 2019 ఫిబ్రవరి లోపు పట్టాదారు పాసుపుస్తకం జారీ అయిన వారికి మాత్రమే పీఎం కిసాన్ వర్తిస్తుంది. ఆ తరువాత భూమి కొన్న వారికి వర్తించదు. 2018 డిసెంబర్ 12 నుండి 2023 డిసెంబర్ 9 వరకు తీసుకున్న పంట, స్వల్పకాలిక రుణాలకు మాత్రమే మాఫీ వర్తిస్తుంది. గత ప్రభుత్వం కేవలం అసలు మాత్రమే మాఫీ చేసింది. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నిబంధనల ప్రకారం అసలు, వడ్డీ కలిపి ఒక కుటుంబానికి గరిష్టంగా రూ 2 లక్షలు మాఫీ చేయనుంది. ఒక కుటుంబంలో ముగ్గురు రైతులు తీసుకున్న రుణాలు, వడ్డీతో కలిపి రూ 2 లక్షల లోపు ఉంటే వారిలో ఎవరి ఖాతాలో నగదు బదిలీ చేస్తారని రైతులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే కొందరు రైతులు అప్పులు తెచ్చి మరీ రూ 2 లక్షల పైన రుణని బ్యాంకుల్లో చెల్లిస్తున్నారు. లబ్దిదారుని పేరిట భూమి ఉండాలని, రైతులు ఎలాంటి రాజ్యాంగబద్ధమైన పోస్టులైన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రులు, మేయర్, మున్సిపల్ చైర్పర్సన్ తదితర పోస్టుల్లో ఉన్నవారిని అనర్హులుగా తేల్చారు.

**ప్రభుత్వ నిబంధనలు ఇలా..**

భూమి ఉన్న ప్రతి కుటుంబానికి రూ 2 లక్షల వరకు రుణమాఫీ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుంది. స్వల్పకాలిక పంట రుణాలకు మాత్రమే మాఫీ వర్తించనుంది. కటాఫ్ తేదీ నాటికి బకాయి ఉన్న అసలు, వడ్డీ మొత్తం ఈ పథకానికి అర్హత ఉంటుంది. కుటుంబంలో ఇంటి యజమాని,జీవిత భాగస్వామి, పిల్లలను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఒకరిని నోడల్ అధికారిగా నియమించారు.నోడల్ అధికారులు తమ బ్యాంకు పంటల రుణాల డేటాపై డిజిటల్ సంతకంతో అర్హతగల రుణమాఫీ మొత్తాన్ని నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది.

# అరుణాచల దర్శనానికి బస్సును ప్రారంభించిన డిప్యూటీ ఆర్ఎం





**ఖమ్మం, (జనం సాక్షి):** అరుణాచల శివుని దర్శనం కోసం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్సును ఖమ్మం కొత్త బస్టాండ్ లో శుక్రవారం సాయంత్రం డిప్యూటీ ఆర్ఎం పవిత్ర జెండా ఊపి ప్రారంభించారు. బస్సు 36 మంది ప్రయాణికులతో ఖమ్మం నుంచి బయలుదేరి వెళ్లింది. ఈ బస్సు లో భక్తులు అరుణాచలం తో పాటు గోల్డెన్ టెంపుల్, కాణిపాకం తదితర పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటారు. ఈ పుణ్యక్షేత్రాలను దర్శించుకుని భక్తులు తిరిగి సోమవారం సాయంత్రానికి ఖమ్మం చేరుకుంటారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తులకు డిప్యూటీ ఆర్ఎం మిఠాయిలు అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఆర్ఎం పవిత్ర మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ అన్ని జాగ్రత్తలు తీసుకుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ రామయ్య, ఎంఎఫ్ ప్రవీణ్ , వెల్ఫేర్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, సిబ్బంది ఎం రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లబెల్లం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

**మహబూబ్‌నగర్, జూలై19 (జనంసాక్షి) :** నాటుసారా తయారీకి ఉపయోగించే నిషేధిత నల్లబెల్లాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటక నుంచి ఇద్దరు వ్యక్తులు చాల కాలంగా నాగర్ కర్నూల్, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు నాటుసారాకు వినియోగించే బెల్లం, పటికను సరఫరా చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మేరకు శుక్రవారం మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు కర్ణాటక నుంచి వచ్చిన వాహనాన్ని నిలిపి తనిఖీలు నిర్వహించగా ఓ వాహనంలో 15 క్వింటాళ్ల బెల్లం, 40 కిలోల పటిక, నాలుగు లీటర్ల నాటు సారాను పట్టుకున్నారు. మూడు జిల్లాలకు బెల్లాన్ని సరఫరా చేస్తున్న గొల్ల రవి ఉపేంద్ర చారిలని అరెస్ట్ చేశారు. పట్టుబడిన బెల్లం విలువ సుమారు రూ.8.60లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. బెల్లం సరఫరాదారులను పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీకమలహాసన్ రెడ్డి అభినందించారు.

# ఇరు తెలుగు రాష్ట్రాల అధికారుల నిర్లక్ష్యం

- నిధుల కేటాయింపులో ముందుకు రాని ప్రభుత్వాలు
- పెద్దవాగు కట్ట తెగడంతో భారీగా నష్టం



**ఖమ్మం, జూలై19 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లాలో పెద్దవాగు ప్రాజెక్టు భద్రత, నిర్వహణ విషయంలో గోదావరి బోర్డు చాలా రోజులుగా అప్రమత్తం చేస్తూన్నా నాటి ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఇప్పుడు పెద్ద విపత్తే జరిగింది. వాగు కట్ట తెగి పోవడంతో నీరు కిందికి పోవడంతో పాటు భారీ నష్టం వాటిల్లింది. పూర్తిస్థాయి మరమ్మతులు, ఆధునికీకరణకు నిధులు కేటాయించాలంటూ పలుమార్లు లేఖలు రాసినా ఆంధ్రప్రదేశ్‌లోని అప్పటి జగన్ ప్రభుత్వం పూర్తిగా పెడచెవిన పెట్టింది. నేడు 14 గ్రామాల ప్రజల జలదిగ్బంధానికి కారణమైంది. పూర్తిస్థాయిలో ఆధునికీకరణకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. తెలంగాణ, ఏపీలు 15:85 నిష్పత్తిలో నిధులు కేటాయించాలని గోదావరి బోర్డు సమావేశాల్లో పలుమార్లు చర్చకు వచ్చింది. 2021 ఫిబ్రవరిలో రెండు రాష్ట్రాల జలవనరుల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అయినా ముందడుగు పడలేదు. సంబంధిత దస్త్రాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆమోదించినా, ఆంధ్రప్రదేశ్‌లోని అప్పటి వైకాపా సర్కారు పెడచెవిన పెట్టింది. గతేడాది తెలంగాణ ప్రభుత్వం రూ.2కోట్లతో కొత్త క్రస్ట్‌గేట్లను అమర్చింది. వాటికి ఏటా గ్రీజు పెట్టకపోవటం, గేట్లు సరిగ్గా ఉన్నాయా లేదో ముందస్తుగా పరిశీలించకపోవడంతో ఈ దుస్థితి దాపురించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి ఒకటిన జరిగిన బోర్డు సమావేశంలోనూ రెండు రాష్ట్రాలు ఉమ్మడి సమావేశం నిర్వహించి పెద్దవాగు ప్రాజెక్టు నిర్వహణపై తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించాయి. అంతలోనే వరదలకు ఆనకట్టకు గండిపడింది. తెలంగాణ, ఏపీల నుంచి గోదావరి బోర్డు పరిధిలోకి వచ్చిన ఉమ్మడి ప్రాజెక్టుల్లో ఇదొకటి. పశ్చిమగోదావరి జిల్లాలో పుట్టే పెద్దవాగు... భద్రాద్రి జిల్లాలోకి ప్రవేశించి... తిరిగి ఏపీలోకి వెళుతుంది. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లిలో ఈ వాగుపై 1977-78లో నాటి సీఎం జలగం వెంగళరావు హయాంలో రూ.1.50 కోట్లతో మూడు క్రస్టు గేట్లు, రెండు తూములతో ప్రాజెక్టును నిర్మించారు. నీటి నిల్వ సామర్థ్యం 0.50 టీఎంసీలు. తెలంగాణలోని భద్రాద్రి జిల్లా పరిధిలో 2,700 ఎకరాల ఆయకట్టుకు, ఏపీలోని వేలేరుపాడు మండలానికి కుడి కాలువ, కుక్కునూరు మండలానికి ఎడమ కాలువ కింద నీళ్లు పారుతాయి. రెండు కాలువల కింద 13,300 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు మూడు గేట్లలో ఒకటి పని చేయకపోవడంతో 1989లో కట్టకు భారీగండి పడింది. అప్పట్లో ఏపీలోని కమ్మరిగూడెం కొట్టుకుపోయింది. అల్లూరినగర్, ఒంటిబండ, వసంతవాడ గ్రామాలు దెబ్బతిన్నాయి. అప్పట్లో గండిపడిన చోటే క్రస్ట్ గేట్ల భాగం పక్కనే రమణక్కపేట వైపు మరోసారి గురువారం గండిపడింది. 1998లో అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో రూ.15 కోట్లతో మరమ్మతు చేశారు.

# ప్రకటనల పేరుతో ప్రజాధనం వృధా

- బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకా, కోవా లక్ష్మి

**హైదరాబాద్,జూలై19(జనంసాక్షి) :** రేవంత్ ప్రభుత్వం ప్రకటనల పేరుతో ప్రజా ధనాన్ని ఎందుకు వృథా చేస్తోందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ ప్రశ్నించారు. ఒకే సారి 2లక్షలు రుణ మాఫీ చేస్తామని చెప్పి మాట తప్పినందుకు కాంగ్రెస్ సంబరాలు చేసుకుంటుందా అని నిలదీశారు. దేవుడి మీద ఒట్టేసి కూడా మాట తప్పుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ మీడియాతో మాట్లాడుతూ... రుణమాఫీ చేసి ఎందుకు ఆర్భాటాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. ఎవరి జాగీరని గతంలో తమను ప్రశ్నించిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎవరి జాగీరని ఖర్చు పెడుతున్నారని ప్రశ్నించారు. ఇచ్చిన హామిలన్నీ అమలు చేసేదాకా రేవంతరెడ్డిని నిద్రపోనివ్వమని అన్నారు. బౌరంపేటలో 600మంది రైతులున్న ఓ సొసైటీలో కేవలం 11మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయిందని.. దీనికే సంబరాలు చేసుకోవాలా? అని నిలదీశారు. లక్షలోపు ఇంత మందికి ఎగ్గొడితే మరి రెండు లక్షల్లో ఎంతమందికి ఎగ్గొడతారని ప్రశ్నించారు. కేసీఆర్‌పై ఏడుస్తున్నారని.. అలా చేయొద్దని హితవు పలికారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
20 జూలై 2024

# రుణమాఫీ సరే.. దళారుల సంగతేంటి?



- బ్యాంకుల వద్ద కాపు కాస్తున్న మధ్యవర్తులు
- ఇక టార్గెట్ అన్నదాతే

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి, (జనం సాక్షి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే రైతు రుణమాఫీ చేస్తామని గతంలో హామీ ఇచ్చారు. నూతనంగా ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడవకముందే లక్ష లోపు రుణాలను ఏకకాలంలో మాఫీ చేశారు. ఇక ఆగస్టు 15లోగా 2 లక్షల లోపు రుణాలను మాఫీ చేసేందుకు ఇప్పటికే అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మొత్తం 87,191 మంది రైతుల ఖాతాల్లోని రూ. 396.30 కోట్ల రుణాలను ఏకకాలంలో ప్రభుత్వం మాఫీ చేసింది. వీటిలో ఖమ్మం జిల్లాలో 59,172 మంది రైతులకు చెందిన రూ. 264.23 కోట్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 28,019 మంది రైతులకు చెందిన రూ. 132.09 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రెండు జిల్లాల్లోని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**దళారుల హడావుడి షురూ..!**

రుణమాఫీ పొందిన రైతులకు త్వరలోనే కొత్త రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఈ మేరకు బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు సైతం జారీ చేసింది. దీంతో త్వరలోనే రుణాలను రీ షెడ్యూల్ చేయనున్నారు. గత పది ఏళ్లుగా బ్యాంకు ఫీల్డ్ సిబ్బందిని మచ్చిక చేసుకుని రైతులకు రుణాలు ఇప్పించిన మధ్య దళారులు తిరిగి రంగ ప్రవేశం చేస్తున్నారు. బ్యాంకు సిబ్బందికి ముందే తాయిలాలు ప్రకటిస్తూ రుణ మంజూరిలో కొంత మొత్తం కాజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. రైతుకు రుణ మంజూరిలో చిన్న చిన్న సాంకేతిక అంశాలను సాకుగా చూపి రైతులను అయోమయానికి గురిచేసి వారి నుండి డబ్బులు గుంజడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో లక్ష రూపాయల రుణం ఇస్తే పదివేల వరకు మధ్యవర్తులు కమిషన్ రూపంలో తీసుకునేవారు. ప్రస్తుతం అదే తరహా తంతు కొనసాగే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే మధ్య దళారులు కొంతమంది బ్యాంకుల వద్ద హడావిడి చేస్తూ బ్యాంకు అధికారులతో మాట్లాడేందుకు వారి క్యాబిన్ లోకి చొచ్చుకొని వెళ్తున్నారు. రైతు కన్నా ఈదళారులకే బ్యాంక్ అధికారులు కొంతమంది ఫీల్డ్ సిబ్బంది ప్రాముఖ్యత ఇవ్వడం కనిపిస్తోంది.

**దత్తత గ్రామాల్లోనూ...**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి గ్రామానికి ఒక దత్తత బ్యాంకు ఉంటుంది. ఈ గ్రామాల్లో ఎలాంటి బ్యాంకింగ్ సేవ అయినా ఆ బ్యాంకుల నుండి అందాల్సిందే. దీంతో బ్యాంకు సిబ్బందితోపాటు దళారులు కొన్నేళ్లుగా ఇక్కడే పాతుకుపోయారు. ఇదే అదనుగా దళారులు కొంతమంది బ్యాంకు సిబ్బంది సహకారంతో రైతులను దోచుకునేందుకు సిద్ధమయ్యారు. రుణమాఫీని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రభుత్వం రుణాల రీ షెడ్యూల్లోను ఎటువంటి దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుకి రుణం అందించేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

# ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం

- మద్దులపల్లిలో శాశ్వత భవనం ఏర్పాటుకు మంత్రి పొంగులేటి కృషి
- కాంటూర్ సర్వే పూర్తి చేసిన జెఎన్టీయూ అధికారులు
- త్వరలోనే శంకుస్థాపనకు ఏర్పాట్లు



ఖమ్మం, (జనం సాక్షి) :మంత్రి పొంగులేటి చొరవతో పాలేరు నియోజకవర్గంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి రెవెన్యూ పరిధిలో కళాశాలకు కేటాయించిన ముప్పై ఎకరాల్లో శాశ్వత భవనం నిర్మాణం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గత ప్రభుత్వం ఎన్నికల స్టంట్ లో భాగంగా జెఎన్టీయూ కళాశాల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించినప్పటికీ దాని నిర్మాణంపై శ్రద్ధ పెట్టలేదు. ప్రస్తుతం కళాశాలను అద్దె భవనంలోనే కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే, తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని కళాశాలకు శాశ్వత భవనం ఉండేలా కృషి చేస్తున్నారు. తాజాగా రెండు రోజుల క్రితం జెఎన్టీయూ అధికారులు కాంటూర్ సర్వేను పూర్తి చేశారు. భవన నిర్మాణానికి కావాల్సిన అన్ని ప్రణాళికలను రూపొందించారు. జెఎన్టీయూహెచ్ డైరెక్టర్లు, ప్రొఫెసర్లు డాక్టర్ వి.వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ బి. రవీంద్ర రెడ్డి, డాక్టర్ డి.రమేష్ ఆధ్వర్యంలో ఖమ్మం రూరల్ సర్వేయర్ సతీష్ రెడ్డి పర్యవేక్షణలో ఈ సర్వే నిర్వహించారు. త్వరలోనే శంకుస్థాపన చేసేందుకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు జెఎన్టీయూహెచ్ ఉన్నతాధికారులు తెలిపారు.

# ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ

- సిఎం రేవంత్ చిత్రపటానికి లాయర్ల క్షీరాభిషేకం



హైదరాబాద్, జూలై19 (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ పథకానికి గురువారం శ్రీకారం చుట్టింది. రూ. 2 లక్షల లోపు బ్యాంకు రుణాలున్న రైతులకు ఏక మొత్తంలో మాఫీ చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మాటను నిలబెట్టుకున్నారు. అనుకున్న దానికంటే ముందే మొదటి విడత రుణమాఫీ నగదును ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఎన్నికల హామీలో భాగంగా రైతులకు రూ. 2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలకు బషీర్‌బాగ్ చౌరస్తాలో హైకోర్టు న్యాయవాదులు క్షీరాభిషేకాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ నగదు జమ చేయడంతో సంబరాలు అంబరాన్నంటాయి. తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ జేఏసీ కోఆర్డినేటర్ వెంకటేష్ ఇంద్రపల్లి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటోకి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ చేస్తున్నందుకుగాను సీఎం రేవంత్ రెడ్డికి, హైకోర్టు అడ్వకేట్లు, సామాజిక కార్యకర్తలు, ఉద్యమకారులు కలిసి రేవంత్ ఫొటోకి పాలాభిషేకం చేశారు. ఇది ప్రజల ప్రభుత్వం, రైతు ప్రభుత్వం అంటూ రేవంత్ రెడ్డికి న్యాయవాదులు జేజేలు కొడుతూ కొనియాడారు. అయితే.. రూ. 2 లక్షల లోపు బ్యాంకు రుణాలున్న రైతులకు ఏక మొత్తంలో మాఫీ చేస్తామన్న ప్రభుత్వం తన మాటను నిలబెట్టుకుంది. అనుకున్న దానికంటే ముందే మొదటి విడత రుణమాఫీ నగదును గురువారం రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు రూ. 2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ మధ్య కాలంలో తీసుకున్న రుణాల మాఫీకి రేవంత్ సర్కారు కట్టుబడింది. ఆగస్టు 15వ తేదీలోపు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామన్న ఇప్పటికే ప్రకటించగా, ఆ దిశగా మొదటి అడుగు వేసింది. సర్కారు చొరవతో

# పథకాలు ప్రజల భాగస్వామ్యంతో క్షేత్రస్థాయిలో అమలు

- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి
- అభివృద్ధి సంక్షేమ సమీక్షలో అధికారులను ఆదేశాలు




భువనగిరి ప్రతినిధి, జూలై 19 (జనం సాక్షి) : అభివృద్ధి సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అందరికి అందేలా చర్యలు తీసుకోవాలని, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి మందుల సామేలుతో కలిసి కలెక్టరేటు సమావేశ మందిరంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ ఈనెల 22 నుండి పార్లమెంట్ మొట్టమొదటి బడ్జెట్ సమావేశాలు మొదలవుతున్నందున పార్లమెంట్ సభ్యుడినైన నా నుండి ప్రజలు ఎన్నో ఆశిస్తారని, వారి అంచనాలకు అనుగుణంగా ప్రశ్నోత్తరాల సమయంలో జిల్లా ప్రజల సమస్యలపై వివరించడానికి ఇలాంటి సమీక్ష కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అందరికి అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఇన్ పుట్ అందించి అందుకు అనుగుణంగా అభివృద్ధి నిధులు పొందాల్సి ఉందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి 31 వేల కోట్లతో ఆగష్టు చివరిలోపు 2 లక్షల రైతు రుణ మాఫీ చేసి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నారని అన్నారు. రైల్వే శాఖ గురించి మాట్లాడుతూ జనగాం యాదాద్రి స్టేషన్ పనుల నిధులు శాంక్షన్ అయ్యాయని, జనగాం స్టేషన్ 50 శాతం, యాదాద్రి స్టేషన్ 20 శాతం పనులు కావడం జరిగిందని, డిసెంబరు చివరి లోగా అన్ని పనులు పూర్తి అయ్యేలా రైల్వే అధికారులు పూనుకోవాలని తెలిపారు. ప్రతి రోజూ ఇతర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగుల కోసం భువనగిరి, ఆలేరు, జనగాం స్టేషన్లలో రైళ్లు ఆగేలా, పుష్ పుల్ రైల్ భువనగిరి లో ఆగేలా, అలాగే ఇంటర్ స్టేట్ రైల్ సర్వీసులు ఆగేలా కృషి చేస్తానని తెలిపారు. ఆలేరు పెద్దవాగు అండర్ పాస్ రోడ్ విస్తరణ అవసరమున్నందున రైల్వే శాఖ దృష్టికి తెస్తామని తెలిపారు. నేషనల్ హైవే అథారిటీస్ పై మాట్లాడుతూ చిట్యాల-భువనగిరి రోడ్డు విస్తరణ కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చి అనుమతులు సాధిస్తామని తెలిపారు. భువనగిరి ఎయిమ్స్ ఆసుపత్రిపై మాట్లాడుతూ ప్రతి రోజూ 2500 మందికి పైగా ఔట్ పేషెంట్లకు సేవలందిస్తున్నందున వారికి సరైన క్యూలైన్ సేవలు అందించాలని, ఎయిమ్స్ ఉన్న తరువాత ఎవ్వరూ కూడా హైదరాబాదు వెళ్లని విధంగా సేవలు మెరుగుపరచుకోవాలని సూచించారు. ఎయిమ్స్ వద్ద బస్సులు ఆగే విధంగా బస్సు స్టాప్స్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధి పనుల ద్వారా గ్రామీణ రోడ్ల పనులు పూర్తి చేస్తామని, పార్లమెంట్ సభ్యులు కేంద్ర ప్రభుత్వం నుండి ఎక్కువ నిధులు పొంది ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు మాట్లాడుతూ ఏ పథకం ఏ విధంగా ప్రజలకు ఉపయోగపడుతుంది అనేది ప్రజలకు వివరించాలని, వారికి అందుబాటులోనికి తేవాలని, పేదవారికి కేంద్ర ప్రభుత్వ నిధులు ఉపయోగపడేలా చూడాలని, అందుకోసం ఇలాంటి సమీక్షలు చాలా అవసరమని అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా నిధుల మంజూరీతో ఇంకా ఎక్కువ మొత్తంలో కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామాలలో ఉపాధి హామీ పనులు చాలా అవసరమని, గ్రామాల అభివృద్ధికే కాకుండా ప్రజలకు ఉపాధి కలుగుతున్నందున ప్రజలకు ఉపయోగపడే పనులను పెంచాలని సూచించారు. జిల్లా కలెక్టరు హనుమంత్ కే.జెండగే మాట్లాడుతూ. .. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అందరికి అవగాహన ఉండాలని, జిల్లాలో లేని, జిల్లాకు అవసరమైన పథకాలు గుర్తించి వాటి కార్యాచరణకు వివరాలు అందించాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల వివరాలను ఎం.పి. గారికి అందించాలని, వారు పనుల పురోగతిని ఇంకా ముందుకు తీసుకెళ్తారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.ఎ. కృష్ణన్, జిల్లా పరిషత్ సిఇఓ శోభారాణి, మున్సిపల్ చైర్మన్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రుణమాఫీతో వారికి నిద్రపట్టడం లేదు

- బిఆర్ఎస్, బిజెపి నేతలు విమర్శలకు పనికి వస్తారు
- కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఘాటు వ్యాఖ్యలు




హైదరాబాద్, జూలై19 (జనంసాక్షి) : కాంగ్రెస్ ప్రాక్టికల్ పార్టీ.. కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ రుణమాఫీ చేశారని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ బటన్ నొక్కితే సీఎం రేవంత్ రుణమాఫీ చేశారన్నారు. సినిమాల్లో రైతుల గురించి చూపించి డబ్బులు సంపాదించిన చిరంజీవి.. నల్లచట్టాల గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. నల్ల చట్టాలు తెచ్చిన మోడీకి మద్దతు ఇచ్చి.. రైతులకు అండగా ఉన్న రాహుల్ గాంధీకి మద్దతు ఎందుకు ఇవ్వలేదని అన్నారు. రుణమాఫీ చూసి బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు నిద్ర పట్టి ఉండదని జగ్గారెడ్డి పేర్కొన్నారు. కేటీఆర్‌కు ట్విట్టర్ పని తప్పా.. పనికి పనికిరాదని విమర్శించారు. మరోవైపు.. బీజేపీ దగ్గర పనితనమే లేదు.. మాటలు తప్పితే అని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. బీజేపీ రైతులను కుని చేసి మర్డర్ చేసింది.. రైతులను నల్ల చట్టాలతో హత్య చేశారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ నేతల పిల్లలు రైతుల మీద నుండి కార్లు తీసుకు పోయారు.. దీని మీద కిషన్ రెడ్డి, బండి సంజయ్ మాట్లాడగలరా అని ప్రశ్నించారు. ఎండనక.. వాన అనక రైతులు ధర్నా చేస్తే బీజేపీ నేతలు చంపలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరంజీవి ఖైదీ నెంబర్ 150 సినిమా రైతుల మీద తీశారు.. రైతులు ఆత్మహత్య చేసుకోవడం పై తీశారు.. సినిమా తీసిన హీరో చిరంజీవికి, నిర్మాతకు డబ్బులు వచ్చాయన్నారు. బీజేపీ రైతులు ఆందోళన చేస్తే కాల్చి చంపిన చిరంజీవి ఎందుకు ప్రశ్నించలేదని అన్నారు. రాహుల్ గాంధీ ప్రాక్టికల్ మనిషి.. వాస్తవాలకు దగ్గరగా ఉంటారని జగ్గారెడ్డి తెలిపారు. సోనియా గాంధీ కుటుంబంకి ఉన్న గొప్పతనం అదన్నారు. రాహుల్ గాంధీ సినిమాలో హీరోల లాగా నటించలేదు.. దేశం అంతా కాలి నడకన నడిచారని పేర్కొన్నారు. సినిమాల్లో రైతుల గురించి చేసే వాళ్ళు.. బయట మోడీకి మద్దతు ఇదేం పద్ధతి అని ప్రశ్నించారు.

# గనుల్లో భద్రత పెంపుదలకు పటిష్టమైన చర్యలు

- ప్రమాద రహిత సంస్థగా సింగరేణి
- కార్మిక సంఘాల సూచనలను పరిగణలోకి తీసుకుంటాం
- రక్షణ త్రైపాక్షిక సమావేశంలో సీఎండీ ఎన్.బలరామ్

(ప్రత్యేక ప్రతినిధి / జనం సాక్షి)



గనుల్లో భద్రత పెంపుదలకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, కార్మిక సంఘాలు చేసిన సూచనలను పరిగణలోకి తీసుకొని అవసరమైన చర్యలను తక్షణమే తీసుకుంటామని సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండి ఎన్.బలరామ్ ప్రకటించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో శుక్రవారం జరిగిన 48వ రక్షణ త్రైపాక్షిక సమీక్ష సమావేశంలో ఆయన గుర్తింపు, ప్రాతినిధ్య కార్మికసంఘాల ప్రతినిధులు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారులు, సింగరేణి అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. సమావేశానికి గుర్తింపు కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ వి. సీతారామయ్య అధ్యక్షత వహించారు. ఛైర్మన్ మరియు ఎండి బలరామ్ మాట్లాడుతు సింగరేణి సంస్థ ఉత్పత్తిలో ఆదర్శప్రాయంగా ఉందని, అలాగే రక్షణలో కూడా ప్రమాద రహిత కంపెనీగా రూపుదిద్దాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. ప్రతి కార్మికుని ప్రాణాలు ఎంతో విలువైన వని, ప్రాణనష్టం జరగకుండా, ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని అలాగే యాజమాన్యంతో పాటు కార్మికులు కూడా రక్షణను ఖచ్చితంగా పాటించాలని కోరారు. చాలా ప్రమాదాల్లో నిర్లక్ష్యం, నిర్లిప్తత వల్లే చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ లేని పని ప్రదేశాల్లో విధులు నిర్వహించమని యాజమాన్యం ఎప్పుడూ ఒత్తిడి చేయబోదని.. అదే సమయంలో ప్రతీ ఒక్కరూ కూడా స్వీయ రక్షణ అత్యం ముఖ్యమన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరాయంగా జరిగిన ఈ సమావేశంలో గనుల్లో రక్షణ పెంపుదలకు కార్మిక సంఘాలు అనేక సూచనలు చేశాయి, నాణ్యమైన హెల్మెట్లు బూట్లు సరఫరా చేయాలని, వైద్య సేవలు పెంపుదల, క్యాంటీన్లలో మెరుగైన సౌకర్యాలు, కొత్త యంత్రాల కొనుగోలు, ఆధునీకరణ, అవసరమైన సిబ్బంది నియామకం వంటి అనేక అంశాలపై గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐ.ఎన్.టి.యు.సి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ , ఇతర నాయకులు అనేక సూచనలు చేశారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ ఆఫ్ మై సేఫ్టీ రీజియన్ 2 ఎన్.నాగేశ్వరరావు, ఇతర డి.జి.ఎం.యస్. అధికారులు సింగరేణి వ్యాప్తంగా రక్షణ పెంపుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కొన్ని సూచనలు చేశారు. అనంతరం సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ (ఈ అండ్ ఎం) ఎన్ వి కె శ్రీనివాస్ (ఆపరేషన్స్ అండ్ పర్సనల్), జి వెంకటేశ్వర్ రెడ్డి (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) రక్షణ చర్యలపై ప్రసంగించారు. సమావేశంలో ముందుగా ఇటీవల పలు ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికులకు సంతాపం ప్రకటించారు. కార్యక్రమానికి డీజీఎం సేఫ్టీ జ్ఞాన సుందరం స్వాగతం పలకగా, జనరల్ మేనేజర్ సేఫ్టీ గురవయ్య రక్షణ నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కో-ఆర్డినేషన్ జి. దేవేందర్, జీ.యం. (.సీ.పి.పి) జక్కం రమేష్ జీ.యం. (పి అండ్ పీ) సాయిబాబా ఇంకా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ జనరల్ మేనేజర్లు, అన్ని ఏరియాలనుంచి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు, డీ.జీ.ఎం.యస్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో మొత్తం 545 దరఖాస్తులు రాక

- దరఖాస్తులను స్వీకరించిన చిన్నారెడ్డి

హైదరాబాద్, జూలై19 (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 545 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 95 , పౌరసరఫరాల శాఖ కు సంబంధించి 84 , విద్యుత్ శాఖ కు సంబంధించి 82, హౌజింగ్ కు సంబంధించి 79 దరఖాస్తులు, పంచాయతి రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కు సంబంధించి 47, ఇతర శాఖలకు సంబంధించి 158 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# మైక్రోసాఫ్ట్ సర్వర్‌లలో సమస్యలు

- విమానర సర్వీసలకు తీవ్ర అంతరాయం
- ప్రయాణికులకు నీళ్లు, ఆహార సేవలు అందించాలి
- అధికారులకు మంత్రి రామ్మోమన్ నాయుడు ఆదేశం

న్యూఢిల్లీ, జూలై19(జనంసాక్షి) : మైక్రోసాఫ్ట్ సర్వర్‌లలో సమస్యల కారణంగా విమాన సేవలు ప్రభావితమయ్యాయి. చాలా కంపెనీల విమానాలు ఎగరలేకపోతున్నాయి. భారతదేశంలో, ఢిల్లీ, ముంబై మరియు బెంగళూరు విమానాశ్రయాలలో విమానాలు షెడ్యూల్ కంటే ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ సాంకేతిక సమస్యల తర్వాత భారత ప్రభుత్వం మైక్రోసాఫ్ట్‌ను సంప్రదించింది. అనేక దేశాల ప్రభుత్వాలు అత్యవసర సమావేశాలు ఏర్పాటు చేశాయి. స్పైస్‌జెట్, ఇండిగో,అకాసా ఎయిర్‌లైన్స్ కూడా ఇలాంటి సాంకేతిక సమస్యలను ఉదహరించాయి. ఇండిగో, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలు సర్వర్ సమస్యల కారణంగా సర్వీసులు నిలిచిపోయాయని చెబుతున్నాయి. తాజాగా ఈ సమస్య పరిష్కారమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సమస్య వల్ల విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ అంశంపై తాజాగా పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అంతరాయం వల్ల ప్రభావితమైన ప్రయాణికులకు నీరు, ఆహారం అందిస్తుందని మంత్రి తెలిపారు. ప్రయాణికుల పట్ల విమానాశ్రయ అధికారులు, విమానయాన సంస్థలు సానుభూతితో వ్యవహరించాలి. విమాన సర్వీసుల ఆలస్యం కారణంగా ప్రయాణికులకు అదనపు సీటింగ్, వాటర్, ఆహారాన్ని తప్పక అందించాలి. ప్రయాణీకుల సురక్షిత ప్రయాణం

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370